ఆంధ్రప్రదేశ్

50 పైసలు

సెప్టెంబరు, 1972



గోపాలకృష్ణయ్యను నాయుడుపేట నుంచి మరో ఊరు బదిలీ చేశారు. ప్రకాశాన్ని మాత్రం చదువు కోసం అక్కడే ఉంచారు. ఒక మఠం పక్కనే ఉన్న ఓ ఇంట్లో రెండు మూడు ఏళ్ళు అలాగ గడిపాడు. వల్లూరులో ఉన్న పొలం కౌలుదారు పన్నులు గోపాలకృష్ణయ్య తెల్పలేక పోయాడు. వేలం వేశారు.
ఒక రోజు హఠాత్తుగా ప్రకాశానికి వార్త వచ్చింది – తండ్రిగారికి చాలా జబ్బుగా ఉందని — ప్రకాశం ఆ క్షణం మళ్ళీ గ్రామానికి వెళ్ళాడు
కొడుకు వస్తే చూసుకుందామని కళ్ళు మూశారు
నాన్నా! నాన్నా!
తండ్రిగారి మరణంతో ప్రకాశం జీవితంలో పెద్ద అగాధం ఏర్పడింది-
తల్లి గర్భవతి సంసారం బాధ్యతల యావత్తూ ఆ తల్లి మీద పడింది. పొలం పుట్రా ఏమీ లేదు. ఒక పైసా ఆదాయం లేదు. మగ దిక్కు లేదు.
ఆ భయంకర స్థితిలో కనపర్తి నుంచి ఆమె అన్నగారు వచ్చి—
చెల్లెమ్మా! దిగులు పడకు. నాతో రా! కడుపుగాని గంజో నాతో ఉన్నది తాగుదువు గాని!
అన్నయ్యా!
కనపర్తిలో రోజులు గడిచాయి. అక్కడ ప్రకాశానికి తమ్ముడు పుట్టాడు.
అన్నయ్యా! నీ మీద ఆధారపడి ఎన్నాళ్ళు ఇలాగ ఇక్కడ ఉండను. ఇంక మేం... వెళతాం, అన్నయ్యా
పిచ్చిదానా! ఆడుదానివి పసివాళ్ళతో ఎక్కడికి వెళతావ్? ఏం చేస్తావ్?
పిల్లలకు ఇంగ్లీషు చదువు చెప్పించాలని మీ బావగారు అంటుండేవారు. నాకూ అదే కోరిక.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 16

సెప్టెంబరు, 1972
భాద్రపద - ఆశ్వయుజ, 1894

సంచిక : 11

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

సంచికలో

సాలు చందా ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టరు నెం : 133

రెండవ అట్ట : } ప్రకాశం జీవిత కథ
మూడవ అట్ట : } (బొమ్మల సీరియల్)

చివరి అట్ట : ఆగస్టు 15న సాంస్కృతిక ఊరేగింపులో సమాచారశాఖ శకటం

తెలుగుప్రజల ఆదర్శాలు మూర్తీభవించిన ప్రకాశం పంతులుగారు

ఈ యేడు ఆగస్టు నెల మామూలు సంవత్సరాలకంటే ప్రత్యేక ప్రాముఖ్యం కలిగినట్టిది. ఎందుకంటే యీ యేడు ఆగస్టు నెలలో భారత స్వాతంత్ర్య రజతోత్సవాలు జరిగాయి. ఆగస్టు 15వ తేదీ నుండి ఒక సంవత్సరంపాటు స్వాతంత్ర్య జయంతి సంవత్సరంగా జరపాలనీ, అనావృష్టి పరిస్థితులు కారణంగా వృథా ఆడంబరాలు, ఖర్చులూ, నిష్ప్రయోజనకరమైన దండుగలు లేకుండా, హుందాగా యీ సంవత్సరోత్సవం జరపాలనీ భారత ప్రభుత్వం నిర్ణయించింది. దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమ విశేషాలకు అధిక ప్రాధాన్యం యిస్తూ రాష్ట్రంలో నిర్వహించిన కార్యక్రమాలు భారత ప్రభుత్వ ఉద్దేశాలను అక్షరాలపాటిస్తూ, తదనుగుణంగా జరిగినవి. రాష్ట్ర రాజధానిలో బ్రహ్మాండమైన సాంస్కృతిక ఊరేగింపు నిర్వహించబడింది. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి వీరులకు మనం సర్వదా కృతజ్ఞులమై వుండాలనీ, వారి త్యాగాలను ఆదర్శంగా వుంచుకుని జాతీయ నిర్మాణ కార్యక్రమాలలో మనంకూడా యితోధిక కృషితో నడుమువంచి పనిచేయాలనీ, బహిరంగసభలో ముఖ్యమంత్రి శ్రీ పి.వి.నరసింహారావుగారు చేసిన ఉద్బోధ యీ ఊరేగింపుకు అంతః ప్రేరణగా పనిచేసింది. ఊరేగింపు అనంతరం లాల్‌బహదూర్ స్టేడియంలో, ప్రజలకు ఉచిత ప్రవేశ సౌకర్యంతో గొప్ప సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించబడింది. ఎన్నడూలేనంత ఎక్కువగా ప్రజానీకం యీ కార్యక్రమానికి విచ్చేసి, ఉత్సవంలో తమ తాదాత్మ్యతను ప్రకటించారు. సాధారణంగా ప్రతిదానినీ విమర్శించేవారుకూడా యీసారి యీ కార్యక్రమాన్ని మెచ్చుకున్నారు. ఇంతగా ప్రజానీకం పాల్గొన్న కార్యక్రమం లోగడ జరుగలేదంటే అతిశయోక్తి కాదు.

రాష్ట్రంలోని స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానాలు జరిగాయి. అనేక బహిరంగ సభలలో వారి దేశసేవలను ప్రశంసించడం వారి త్యాగాలను ఉగ్గడించడం జరిగింది. అనేక విధానాల ద్వారా స్వాతంత్ర్యోద్యమ ప్రధాన విశేషాలను ప్రజల దృష్టికి తీసుకురావడం జరిగింది. మన రాష్ట్రానికి సంబంధించినంతవరకు శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వాన జరిగిన చరిత్రాత్మకమైన చీరాల–పేరాల సత్యాగ్రహము, బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడ గడ లాడించిన శ్రీ అల్లూరి సీతారామరాజు సాహస గాథలు, నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు జరిపిన వందలాది పోరాట ఘట్టాలవంటివి మన స్మృతిపథంలో ఏనాటికి చెదిరి పోవు. తన ధైర్య సాహసగాథలను తన జీవిత కాలంలోనే చరిత్ర కెక్కించిన శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు మన స్వాతంత్ర్య సంగ్రామ రంగంలో సాటిలేని మేటి యోధుడు. దేశం కోసం తన సర్వస్వాన్ని అర్పించి, దారిద్ర్యాన్ని వరించి, మానసికంగా, శారీరకంగా ఎన్నో దెబ్బలు తిన్న మహానుభావుడు ఆయన. ఈ యేడు జరుగుతున్న ప్రకాశం శతజయంతి ఉత్సవాలు తెలంగాణా ప్రాంతంలో కూడా ఎంతో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. తెలంగాణాలో ప్రకాశం గారిని గురించి చెప్పగా విన్నదీ చదువగా తెలిసినదీ, మినహా ప్రత్యక్షంగా ఎక్కువ తెలియక పోయినా, అక్కడి ప్రజల్లో కూడా ఉత్సాహం వెల్లివిరిసింది. బ్రతికి వున్నప్పుడూ, చనిపోయిన తరువాతకూడా తెలుగు ప్రజల ఐక్యతా మూర్తి శ్రీ ప్రకాశంగారు. ప్రజల ఆశలు, ఆశయాలు ఆయనలో మూర్తి కట్టినవి. ఆయన ప్రజల ఆశయాలకు సర్వ ప్రతినిధి. వారి తరఫున సాధికారంగా మాట్లాడగల మహా నాయకుడు. ప్రకాశం శతజయంతి సందర్భంగా జరిగిన అనేక సభలలో ప్రకాశం గారిలో ఉన్న యీ సద్గుణాలను గురించి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు. తెలుగు ప్రజలలో ఐక్యతా దీప్తులను ప్రసరింప జేసిన ప్రధాన వ్యక్తిగా ప్రకాశంగారి వ్యక్తిత్వాన్ని ప్రజల ముందుంచడం, రాష్ట్రశ్రేయస్సులో ఆయన పొందిన తాదాత్మ్య భావాన్ని ప్రకటించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో దృఢమైన ఐక్యతాభావం ప్రసరించ గలదనీ, తెలుగు ప్రజల కొక వ్యక్తిత్వం ఏర్పడగలదనీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

దక్షిణ భారత దేశంలో రాష్ట్రపతి ప్రధాన కార్యాలయంగా రాష్ట్రపతి నిలయంలో ఆయన ఏటా కొంతకాలం వుండడం వల్ల జాతీయ సదవగాహనకూ, జాతీయ సమైక్యతకూ దోహదకారిగా వుంటుంది. సభలలో పాల్గొని ప్రసంగించేటప్పుడూ, తన వద్దకు వచ్చిన వారితో మాట్లాడేటప్పుడూ వారిలో ఆశాపూరిత వాతావరణాన్ని కలిగించి సమైక్యత, సహకారాలతో మెలగవలసినదని సందేశాన్నిచ్చారు. వయసుకు కూడా లొంగిపోకుండా ఆటుపోట్లను తట్టుకోగల ఉత్సాహపూరితమైన ఆయన శక్తి, కష్టాలకూ కఠిన శిక్షలకూ ఎంతమాత్రం తలవంచని అచంచలమైన ఆయన దృక్పథమూ మనల్ని ముగ్ధుల్ని చేశాయి.

బహిరంగ సభలలో ప్రసంగాలలో స్పష్టంగానూ, దృఢంగానూ ఆయన చెప్పిన విషయాలు: తనను కలుసుకోడానికి వచ్చిన చిన్న పెద్దలందరికీ ప్రోత్సాహంయిస్తూ మాట్లాడడం–యివి నిస్సందేహంగా ప్రజలపై ఆయన భావాల ముద్రలను పడవేసాయి. రాష్ట్రపతికి యిష్టమైన సోషలిజం స్థాపన కృషిలో ఆర్థిక వ్యత్యాసాలను తొలగించే కార్యక్రమంలో ప్రజలు వెరవకుండా నిరంతరంగా పరిశ్రమించి ఉద్దీప్తులు కావడానికి వీలు కలిగిస్తాయి.

విశాఖపట్నం, కడప, నల్గొండ జిల్లాలలో కరువుప్రాంతాల్లో పర్యటించిన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ యిక్కడి ప్రజల బాధాతప్త హృదయాలను హర్షానందవర్షధారలతో తడిపారు. ఆమె ఎక్కడకు వెళ్ళినా ప్రజలు తమ బాధల్ని, కష్టాల్ని మరచి తమ ప్రియతమ అధినేతకు హృదయపూర్వకమైన స్వాగతాన్నిచ్చారు. ప్రజలు యిక్కట్లలో వున్నపుడు వారి బాధామయ హృదయాలను సానునయ వాక్యాలతో, ప్రేమాభిమానాలతో స్పృశిస్తూ: ఆ ప్రజలు తమ కష్టాలను ఆసరా చేసుకుని ఏ ప్రతీప శక్తులూ ఏమని దోచుకోకుండా, కష్టాలను ధైర్యంతో, దృఢ చిత్తంతో ఎదుర్కొనేట్టు వారిలో నూతన శక్తిని నింపారు.

కరువు సహాయక చర్యగా ఆమె రూ. 28 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన వార్త ప్రజల హృదయాలను రంజింప చేసింది. దీనికన్నా, ఆమె ప్రజల సరసన నిలబడి వారి కష్టాల్లో పాలు పంచుకోవడానికి సంసిద్ధతను తెలియజేయడం ప్రజలకు మరింత ఆనందాన్ని కలిగించింది.

— పి.వి.ఆర్.



స్వాతంత్ర్య సమరంలో అగ్రగామి ఆంధ్రప్రదేశ్

పి. వి. నరసింహారావు

ఈ రోజుకు సరిగ్గా ఇరువది ఐదు సంవత్సరాల క్రితం భారత దేశం దాస్య శృంఖలాలనుండి త్రెంచుకొని స్వతంత్రంగా ఆవిర్భవించింది. భారత దేశ స్వాతంత్ర్యంకోసం లక్షలాది మంది ప్రజలు అనేక త్యాగాలు చేసినారు. అనేక మంది యోధాన యోధులు ప్రాణాలర్పించారు. ఒక జాతి చరిత్రలో 25 సంవత్సరాలంటే అది స్వల్పమైన కాలం. ప్రపంచ చరిత్ర దృష్ట్యా ఇది మరి స్వల్ప కాలం అయితే ఈ కొద్దికాలంలోనే చరిత్రగతిని వినూత్న దిశలో మరలించిన చరిత్రాత్మక సంఘటనలు యెన్నో జరిగినాయి. ఏ అగ్రరాజ్య కూటానికీ చెందకుండా, అలీన విధానం అనుసరించిన స్వతంత్ర భారత దేశ అవతరణ ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి దోహదం కలిగించింది. దాస్య దేశాల చరిత్రలోనే అపూర్వమైన శాంతియుత సమరం సలిపి, దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన మహాత్మాగాంధీ, స్వతంత్ర భారతావనికే కాకుండా సామ్రాజ్యవాదుల కబంధ హస్తాలలో కృంగి కృశించిన ఆసియా ఆఫ్రికా ఖండ దేశాలకే గొప్ప ప్రవక్త అయినాడు. భారత దేశ ప్రజలకు ఆయన కేవలం స్వాతంత్ర్య సమర నాయకుడే కాదు, మూడు దశాబ్దాలవరకు ప్రజల జీవితంలో కూడా అడుగడుగునా తన ప్రభావం ప్రతిబింబింపజేసిన మహా పురుషుడాయన. ఆ మహనీయుడు మన మనస్సులలోని భయాన్ని పటాపంచలు చేసినాడు. రాజకీయ జీవితాన్ని నైతిక, ఆధ్యాత్మిక స్థాయికి తీసుకొని వచ్చాడు. అసంఖ్యాక గ్రామీణ ప్రజానీకానికి ఈ భూలోకంలో అవతరించిన దేవుడైనాడు. ఆయన ప్రాణత్యాగం ఆయనకు మహోత్కృష్టమైన స్థానం కల్పించింది. యుగ యుగాలుగా మానవ మాత్రుడెవడూ ఇంత ఉన్నతమైన ఉత్కృష్టమైన స్థానాన్ని అందుకోలేదు. మహాత్మాగాంధీజీ అడుగు జాడలలో నడచి ఆయనకు ఆధ్యాత్మిక వారసుడు, భారత దేశ విప్లవ నాయకుడు అయిన శ్రీ జవహర్లాల్ నెహ్రూ నవభారత నిర్మాత అయినాడు. తన 17 సంవత్సరాల అవిచ్ఛిన్నమైన, అప్రతిహతమైన నాయకత్వంలో ఆయన దేశాన్ని సోషలిస్టు రాజ్యంగా మలచి, తీర్చిదిద్దడానికి గట్టి పునాదులు వేసినాడు. ఈ పవిత్రమైన సందర్భంలో దేశాభ్యుదయానికీ, దేశస్వాతంత్ర్యానికీ బాటలు వేసిన రాజారాం మోహన్‌రాయ్ వంటి మహాపురుషులు, భారత దేశంలోనే

కాక ప్రపంచమంతటా శతజయంతి ఉత్సవం జరుగుతున్న శ్రీ అరవిందులువంటి మహర్షులు, జడత్వం అలముకొని వున్న ప్రజలలో నూతన జీవితవికాసం కల్పించిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకుల స్మృతికి శ్రద్ధాంజలి ఘటించడం మన కర్తవ్యం. దేశంకోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ వంటి వీరాగ్రేసరులు అమరత్వం పొందినారు. గగుర్పాటు కలిగించే వారి ధైర్యసాహస కృత్యాలు భావితరాలవారికి నూతనోత్తేజం కలిగిస్తాయి. అన్నిటికంటె ముఖ్యమైనదేమంటే, మహాత్మాగాంధీ శంఖారావం విని ఉత్తేజపూరితులైన పల్లెసీమలు, పట్టణప్రాంతాల అసంఖ్యాక ప్రజానీకం విదేశపాలకుల దౌర్జన్యకాండకు దమననీతికి గురియై పడరాని కష్టాలు పడ్డారు. వారందరూ చిరస్మరణీయులు, అభినందనీయులు, స్వాతంత్ర్య సమరంలో ప్రజావాహిని చేసిన త్యాగాల ఫలితంగా మనం విజయలక్ష్మిని చేపట్టగలిగినాము.

దేశస్వాతంత్ర్య సమరంలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ అగ్రగామిగా వుంది. స్వాతంత్ర్య సముపార్జనకు ఆంధ్రప్రదేశ్ ఎనలేని కృషిచేసింది. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, చీరాల



పేరాల వీరులను దేశ చరిత్రకెక్కించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వంటి ఆంధ్రప్రదేశ్ నాయకులపట్ల గాంధీజీకి అపారమైన గౌరవాభిమానాలు వుండేవి. వారి దేశభక్తి తత్పరత, త్యాగాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఉత్తేజపరచినాయి. ప్రజలుయెట్టి పరిణామాలను కూడా లెక్కచెయ్యకుండా స్వాతంత్ర్య సమరంలోకి దుమికినారు. శుభావహమైన ఈ ఆగస్టు నెలలో మనం ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నాము. మాతృదేశం కోసం తన సర్వస్వం ధారపోసిన మహా నాయకుడాయన. ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ చెప్పినట్లు వాస్తవంగా ఆయన ఆంధ్రప్రదేశ్ పిత. ప్రస్తుతం మన దేశానికి, శాంతికాముకులైన ప్రపంచ దేశాల ప్రజలకూ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వం లభించడం అదృష్టం.

మాతృదేశ సేవాపరాయణతకు వారసురాలు, గొప్ప దేశభక్తుల కుటుంబంలో జన్మించిన శ్రీమతి ఇందిరాగాంధీ, నేడు మన ఉజ్జ్వల భవిష్యత్తుకు ఆశాజ్యోతి. ఆమె నాయకత్వంలో మన దేశానికి యింటా—బయటా గొప్ప గౌరవ స్థానం లభించింది. శాంతి, ప్రజాస్వామ్యం సోషలిజం, మత ప్రసక్తిలేని రాజ్యవ్యవస్థకూ, జాతి సమైక్యతకూ అంకితమైన నవభారత దేశ ప్రజలను సమైక్యపరచడానికి ఆమె అవిరళ కృషి చేస్తున్నది. అమేయమూ, అప్రతిహతమూ అయిన ఆమె నాయకత్వం, సైనిక నియంతృత్వంనుండి బంగ్లాదేశ్ విముక్తి పొందడానికి దోహదం కలిగించింది. అంతేగాక మన దేశానికి విజయాన్ని చేకూర్చింది. సిమ్లాలో పాకిస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడంతో ఆమె చరిత్ర సృష్టించింది. ఆమె మాటలలోనే చెప్పాలంటే యీ ఉపఖండంలో శాశ్వత ప్రాతిపదికపై శాంతిని నెలకొల్పడానికి "నాందీవాచకం" పలకడం జరిగింది. ఈ విధంగా భారత దేశం శక్తివంతమైన గొప్ప దేశంగా ఆవిర్భవించింది.

ఒకే భాష, ఒకే సాహిత్య, సంప్రదాయ సంస్కృతులు ఉన్న నాలుగున్నర కోట్ల తెలుగు ప్రజల అభీష్టానుసారం 1956లో భాషా ప్రాతిపదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. ఈ రాష్ట్రావతరణ భారతదేశంలో వింధ్యకు దక్షిణాపథాన ఉన్న రాష్ట్రాల సరిహద్దులు మారి భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పడడానికి తోడ్పడింది. ఆంధ్రప్రదేశ్ సాధించిన నూతన స్థిరత్వం, దాని ప్రగతికీ ఉజ్జ్వల భవిష్యత్తుకూ హామీగా నిలిచింది. ప్రజల ఆదరాభిమానాలను అపారంగా చూరగొన్న ధీశాలి శ్రీ ప్రకాశం ముఖ్యమంత్రిత్వంతో రాష్ట్రం ప్రారంభమైంది. ఆయన తర్వాత వచ్చిన సమర్థులైన ముఖ్యమంత్రుల నేతృత్వంలో రాష్ట్రం అనేక రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. నేడు రాష్ట్రంలో నూతనోత్సాహం వెల్లివిరుస్తున్నది. జనాభాలో అత్యధికంగా ఉన్న వెనుకబడిన తరగతులవారు షెడ్యూలు కులాలవారు, షెడ్యూలు తెగలవారు ముందుకువస్తూ ఒక నూతన వ్యక్తిత్వాన్ని చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇటీవల తలపెట్టిన భూ సంస్కరణలు ప్రజలలో కొత్త ఉత్తేజాన్ని కలిగించినాయి. భూ యాజమాన్యంలోగల అపారమైన వ్యత్యాసాలను తొలగించడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. ఈ సంస్కరణలు గ్రామీణ ప్రాంతాలలో ఇతోధికమైన సమానతను, సాంఘిక న్యాయాన్ని చేకూర్చే నూతన వ్యవస్థను రూపొందిస్తున్నవి. దీనితోపాటే పట్టణ ఆస్తుల విషయంలోకూడా యిటువంటి సంస్కరణలను ప్రవేశపెట్టడం జరుగుతుంది. అనతికాలంలోనే అన్ని ఆదాయాల విషయంలోకూడా ఇటువంటి మార్పులు జరుగుతాయి.

ఈ సందర్భంలో గతంలో జరిగిన అభివృద్ధినిగూర్చి సమీక్షించడం సంప్రదాయం. అయితే మనం దేశస్వాతంత్ర్య రజతోత్సవాలు జరుపుకుంటున్న దృష్ట్యా గత పాతికేండ్లలో వివిధ రంగాలలో సాధించిన విషయాలను గూర్చి సమీక్షించాల్సి ఉంది. మనం సాధించిన అసంఖ్యాకమైన విషయాలను గూర్చి ఈ కొన్ని నిముషాల్లో వివరించడం కష్టమే అయినా ప్రపంచంలోకెల్లా ఎత్తయినదీ అతిపెద్ద రాతికట్టడమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపూర్తి చేయడాన్ని గూర్చి ప్రస్తావించడం సందర్భోచితంగా ఉంటుంది. మానవనిర్మిత మహాకాసారాల్లో యిది మూడవది.


దీనివల్ల ఉభయ ప్రాంతాలకు విశేషమైన లాభం కలుగుతుంది. హైదరాబాదు, విశాఖపట్టణములలో ప్రభుత్వ రంగంలో అనేక భారీ పరిశ్రమలు ఏర్పడడం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో యితర అనేక పరిశ్రమలు ఏర్పాటు కావడంతో రాష్ట్రం సత్వర పారిశ్రామిక అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తున్నది. రామగుండంలో భారీ ఎత్తున ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణానికీ, విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారానికీ ప్రారంభోత్సవం జరగడం అపూర్వమైన విజయంగా భావించవచ్చు. వాటి నిర్మాణంవల్ల మన ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుంది. తెలంగాణాలో గోదావరిపైన పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణం, దానితోపాటు యీ ప్రాంతంలో యితర అనేక పరిశ్రమలు నెలకొల్పబడడంతో తెలంగాణా, రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. పరిశ్రమలు, నీటిపారుదల, వ్యవసాయం, ఆర్థిక, విద్యారంగాలలో సాధించిన అభివృద్ధికితోడుగా రాష్ట్రసమైక్యత పటిష్ఠం కావడమనేది అపూర్వమైన విజయంగా మనం భావించాలి.

దేశంలో మనరాష్ట్రం కీలక ప్రదేశంగా ఉండడం, విస్తీర్ణం, జనాభా వనరుల దృష్ట్యా పెద్ద రాష్ట్రాలలో ఒకటిగా రూపొందుతున్నది. దేశంలోని ఉత్తర దక్షిణ ప్రాంతాలలో మధ్య వారధిగా మన రాష్ట్రం భాసిల్లుతున్నది. అంతేగాక గతంలో భారతదేశ చరిత్ర ఘట్టాలలో కీలకపాత్ర వహించింది.


అయితే మన రాష్ట్రంలో వెనుకబడినతనాన్ని పూర్తిగా నిర్మూలించడానికి కొంత వ్యవధి పడుతుందని నేను చెప్పవలసి వుంది. ప్రస్తుతం మనకు వనరులు చాలా పరిమితంగా వున్నాయి. ప్రకృతి వైపరీత్యాల ఫలితంగా చాలా సంవత్సరాలుగా వ్యవసాయ ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరంకూడా పరిస్థితులు అంత ఆశాజనకంగా లేవు. మన వనరుల్లో పెరుగుదల ప్రభావితం కావాలంటే పారిశ్రామిక విస్తరణ యింకా ఎంతో జరగవలసి ఉన్నది. ఇది యిలా ఉండగా కనీసపు జీవనావసరాల కొరకు సతమతమవుతున్న లక్షలాది బలహీన వర్గాల ప్రజలు తమకు సమాజం నుంచి న్యాయమైన వాటాలభించాలని ఎదురుచూస్తున్నారు. వారికోరికలు సామాన్యమైనవే ఐనప్పటికీ, వాటిని పూర్తి చేసేకార్యభారం ఏ దృష్టితో చూచినా మనశక్తికి మించినదిగా కనపడుతుంది. పెరుగుతున్న అవసరాలు, తరుగుతున్న వనరులు, దానికితోడు మారుతున్న సాంఘిక ఆర్థిక స్థితిగతుల వలన కలిగే సంచలనం—ఈ పరిస్థితిని ధైర్యస్థైర్యాలతోను, దూరదృష్టితోను ఎదుర్కోవల్సివుంది. తప్పకుండా, నిశ్చయంగా యెదుర్కోగలం. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆశావాదులు. న్యాయయుతమైన ఒక నూతన వ్యవస్థ ఉదయిస్తున్నప్పుడు ముమ్ముందే దాని అరుణారుణరేఖలను తిలకించి అవగాహన చేసుకునే సామర్థ్యం వారిలో ఉండడంలో నాకెట్టి సందేహమూలేదు. మనం చాలా దూరం పయనించాల్సి వున్నదనేది వాస్తవం. అయితే ఆకర్షణీయమైన భవిష్యత్తు మనను ఆహ్వానిస్తున్నందున మనం ఎంతదూరమైనా ఆగకుండా పయనిస్తూ ముందుకు పురోగమించగలము.


అభ్యుదయ భావాలు, సేవాతత్పరత కలిగిన స్థిరమైన ప్రభుత్వం, ఏర్పడడంతోను ప్రధానమంత్రి ఆశీస్సులతోను ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉన్నది. దేశంలో సోషలిజాన్ని నెలకొల్పడానికి మనరాష్ట్రం తన విద్యుక్తపాత్రను తప్పక నిర్వహిస్తుంది.

(ఆగస్టు 15 వ తేదీ రేడియో ప్రసంగం)



19—2





ఢిల్లీలో ఆంధ్ర ప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధులు
శ్రీ వి. వి. గిరి, శ్రీమతి ఇందిరా గాంధీ గార్లతో

'ఆ నిద్రాణ నిశీధిని మానిసి మేల్కాంచినాడు'

—పి. వి. నరసింహారావు

[రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావుగారు స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భంగా శాసనసభా భవనంలో తమ సందేశాన్ని కవితాగీతంలో ఆలాపన చేశారు. ఆ గీతం ఇది]

ఆ నిద్రాణ నిశీధిని మానిసి మేల్కాంచినాడు
ఒళ్లు విరిచి కళ్లు తెరచి హోహో అని లేచినాడు
చిటిక చీకటుల చిమ్మెడు కారడివిని పయనించు
నిజ జఠరాగ్ని జ్వాలల నింగినంత లేపినాడు
అదుగో, హిమనగమిచ్చిన అశ్రు తర్పణమ్మనగా,
కడుపుమంట సెగ ఆవిరి గంగానది చేసినాడు.
యుగయుగాల అన్యాయం నగుమోముల దిగమ్రింగగ
సాంధ్యారుణ రౌద్ర క్షితిజముఖుడై చెలంగినాడు
వాడొక విప్లవ తపస్వి, మోడుపడిన కాయముల
వాడిన నెమ్మనముల, సర్వం 'కోల్పోయిన దశ' గల్లముల
వాడి చెడిన చూపుల, బువ్వకు నోచని జనగణముల
వేతల బరువు మోసి మోసి విల్లులకు వంగిన నడుముల
జరాహతములై కృశించు జవ్వనంపు వల్లకాళ్ల—
అన్నిటినీ కాయకల్పమా తపస్వి చేసినాడు,
నవరసార్ద్రి జీవితాల, నవోన్మేష మానసాల
నవపల్లవ తరుశాఖల రవళించెడి పూజనాల
నవవిధ భక్తుల, రక్తుల, నవశక్తుల మేళవించి
నవనిర్మితి సంతరించినాడా విప్లవ తపస్వి.
పావు శతాబ్దము పొడుగున బకుల, అర్భకుల మధ్య
విభజన వికృతమై పోవగ, బావురుమనే జీవితాలు—
అటు సమృద్ధి, ఇటు దైన్యము. అటు పెంపు, ఇటు హైన్యము
ఒకడు మింటి కెగయ అసంఖ్యాకులింకిరీ భూతలమున,
అర్భకుని భుజాన మోయు అమ్మ, వాని పద్రదోయ
దారి చూపు కాగడాలు తలకొరివిగ పరిణమింప,
ధర్మకర్తలే ధనకర్తలుగా మారిపోయినారు
పావు శతాబ్దము పొడవున—వెలుగు నీడలాడును
దాగిలి మూతలనుచు తలంచి
వెలుగు ముక్కు మురిచెను నీడల నలుపు తిరస్కరించి
తంత్రీనాదముల చెలిమి తరగదంచు భావింపగ
తీగల త్రెంచుచు నాదము తృణీకరణ మాలపించె

ఈ నిద్రాణ నిశీధిని
ఈ నీరవ వాయుతరంగిణిలో ఒరపిడిపడి
వొల్లిన భావస్ఫులింగములు వెలుగు నిచ్చునా
అటులని విశ్వసించునా పథికుడు?
మృగ జలమును జలమని నమ్మిన
ఆ చిర పిపాసి శీతోదక సేవనమున నిక దీరునా నేటికి?
మిన్ను మన్ను కలిసి చెలిమి చెన్నారెడు శివ సుందరసీమ,
పచ్చెనంచు సంతసించ వచ్చునా పాంథుడు?
భూమి దానవగ్రహమై పోవ రోదసిని మథించి
మానవతా వాహనమై పూనుచున్న రాజ్యేందిర
జయదుందుభి విని ఉత్తేజము పొందునా పౌరుడు?
మోదమునని చెర లనరో మ్రగ్గిన భావ కీరోత్కరకి
విహరణ స్వేచ్ఛాంతరిక్ష విధిని లభ్యమ్మగునా?
అవునని, అవునౌనని, అవునౌనౌనని ఉపవాక్యము
తనువులు పలకెత్త ప్రతిధ్వనింప పయ్యెద మహాంబరము
శాశ్వతమై నిలచెడు ప్రశ్న పరంపర ఇది
పృచ్ఛకుడెవడో? ఇవ్వగజాలెడు నెవడో సమాధానము? నాకేల?
విహంగమున కాకసంపు కొలతలేల?
చిన్ని అలకు ఒడ్డు దూరమున్నదన్న చింతయేల?
దీపము పెనుగాలికి దిల్లలనేల?
జీవితాత్మకు ఎన్నడు బ్రహ్మము
చేరుదునన్న సందియమ్మదేల?
నేనొక చైతన్యోర్మిని
నిస్తుల ప్రగతి శకలమును
ఇది నా సంతత కర్మ
మరే హక్కులు లేవు నాకు
ఈ నిద్రాణ నిశీధి మహిని జాగృతి పుంజముగ
వెలుగుటయే నా తపస్సు
వెలిగించుట నా ప్రతిజ్ఞ।

ఆంధ్రకేసరి సంస్మరణ

ముదిగంటి జగ్గన్నశాస్త్రి



గాంధీయుగములో ఆంధ్ర రాజకీయ గగనవీధి నద్వితీయముగ వెలుగొందచేసినది శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు. ఆంధ్రుల కీర్తి, ఆంధ్రపౌరుషము వెనుకచూపులేని త్యాగము ఆయన ద్వారా భారత దేశమంతట వెల్లడియై మహాత్ముని ప్రశంసను పొందెను. ఆయన హృదయములో ఆంధ్రు కొరకు విశిష్టస్థానము లభించెను. 1872లో గుంటూరుజిల్లా మారుమూల గ్రామమైన టంగుటూరులో నొకబీద బ్రాహ్మణ కుటుంబములో జన్మించి బాల్యమున నతిదారిద్ర్యము ననుభవించినను మాతృశ్రీ లాలన పాలనలో నవనవగా పెరిగి దారిద్ర్య బాధను తృణీకరించి ఆటలలో, పాటలలో విద్యాప్రాభవములలో దినదినాభివృద్ధి చెందుచు బాలక్రీడలలో తన శక్తిని ప్రదర్శించిన బాలవీరుడు.

అందమైన విగ్రహము బలిష్ఠమైన కాయము, గంభీరమైన వదనము, లోతైనగుండె, చదువులో దిట్ట. ఈ బాలుడు గుణగణములచే మిత్రులనాకర్షించి తన గ్రామమును వీడి వారి ప్రోత్సాహము వలన రాజమహేంద్రవరము చేరెను. అది ప్రఖ్యాతి వహించిన పురాతన పట్టణము. చరిత్ర, జ్ఞానవిజ్ఞానములకు నాటపట్టు.

ఇచ్చట నీతడు చదువుపైకి వచ్చుచు చదువుతోపాటు నాయకత్వము వహించుటలోనూ స్ఫురద్రూపియై నాటకకళలో ప్రసిద్ధి చెంది స్త్రీ పాత్ర వహించుటలోను నందెవేసిన చేయియై రాణించెను. ఈ నాటకములు వేయుటలో తరచుగవచ్చు రచ్చలలో నవసరమైనపుడు దోషులను సడుముకట్టి తాళాధ్యాయము చేయుటకు వెరచెడివాడు కాడు.

ఇంతటి పౌరుషశాలి ప్లీడరీపట్టా తీసుకొని యా పట్టణములో న్యాయవాద వృత్తి నవలంబించెను. ప్రారంభములోనే యీ వృత్తిలో ప్రసిద్ధి పురుషుడగుచు విజయములు సాధించుచు ననేక విషమ ఘట్టములలో, దొంగసంతకముల కేసులు, దొంగకరెన్సీ కేసులు, మరణమునకు సంబంధించిన వాటిలో నతి చాకచక్యముగ వాదించుచు విజయము పొందుచుండెను.

కొద్ది కాలములోనే పట్టణములోని ప్రముఖులతోను విద్యాధికులతోను చేయికలిపి ప్రజారంజకుడై మున్సిపలు అధ్యక్షుడుగ రాణించెను. ఏ రంగములోనైనను ఆయన నాయకుడే. ఇట్లుండగా చిన్న ప్లీడరీ వృత్తితో తృప్తిపొందక యీయన తన ప్రియులు స్నేహితులు నయినవారి యండదండలతో బారిష్టరు చదువుటకు ఇంగ్లండు వెళ్లెను, ఆ పరీక్షలో విఖ్యాతమైన స్థానము సంపాదించి స్వదేశమునకేగగనే రాజమహేంద్రవరము వీడి మదరాసు నగరమునకు తరలివెళ్లెను. రాజమహేంద్రవరము చిన్న రంగస్థలము, మదరాసు న్యాయవాద జగజ్జెట్టీల పీఠభూమి. ఇది యాంగ్లవిద్యా వరప్రసాదము. ఇంగ్లీషువారిచే Mad-ras అనగా పిచ్చి అగ్రము అని నామకరణ మీయబడిన యీ ప్రదేశము చెన్నప్ప అను ఆంధ్రునిచే దానము చేయబడినది. కాని మరెవరి సొత్తు కాదని దాని నిజచరిత్రను లోకమునకు వెల్లడిచేసిన మనీషావంతుడు ప్రకాశం పంతులు. ఈ మహా పట్టణంలోని ధీమంతులతో ఢీకొనుచు పడరాని యిడుములు పడినతల్లి ఋణమును తీర్చుకొనుటకో యనునట్లీయన దోసిళ్లతో వేలకొలదిగ సంపాదించి యాపదాంధ్ర దేశములోను అనేక దివ్యసౌధముల నార్జించి "ఉత్తమం స్వార్జితం విత్తం మధ్యమం పితురార్జితం, స్త్రీ విత్త మధమాధమం" అను యశశ్రీని పొందిన ధీరుడు. ఇంతేకాదు. "జననీజన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" యను నార్యోక్తి ప్రకారము తల్లి ఋణమునేకాక భారతమాత ఋణమునుకూడ తీర్చుకొని యశస్సు నార్జించెను. మదరాసు అను పిచ్చి అగ్రములో ఇంగ్లీషువాడు ఆడించిన కుటిల రాజకీయ తంత్రములో సైమను కమిషను రాక నెదిరించిననాడు మదరాసు వీధులలో సింహగర్జన చేసిన వీర

విహారముచేసి గుండ్లబారు చేసిననాడు మహాధీమంతులు రాజనీతి తంత్రజ్ఞులుగల ఆ నగరములో గుండ్లబారు కెదురేగి తనచొక్కా విప్పి ఛాతీని చూపిన యేకైక వీరుడు ప్రకాశంపంతులు.

స్వరాజ్య సంపాదనలో, స్వరాజ్య పత్రికను నడుపుటలో, సత్యాగ్రహ కదనరంగమున నాయకత్వము వహించుటలో పదవులను నైశ్వర్యమును విసర్జించుటలో నే నాయకునకు తీసిపోని దీక్షైనవాడు ప్రకాశంపంతులు. ఆయన మంత్రిగను, ముఖ్యమంత్రిగను స్వయంప్రతిభ, నిర్మాణదక్షత, ఉపజ్ఞ ప్రదర్శించినవాడు. రెవిన్యూమంత్రిగ ఆయన చేసిన పరిశోధన మరెవ్వరు చేయలేదు. గ్రామ పునరుద్ధరణ కార్యక్రమాలలో మహాత్ముని కార్యక్రమము నమలుపరుచుటలో సిద్ధహస్తుడు. ఉత్పత్తి దారులకు, వినియోగ దారులకు కలిసివచ్చు కార్యక్రమమును సంఘములను ఆయన నిర్మింప తలపెట్టెను. ఆయన నిజమైన ప్రజానాయకుడు, "నా ప్రజలను హింసించినచో నేనూరుకొనను" అని గర్జించిన కేసరి. పదవి యున్నను లేకపోయినను ప్రజలమధ్య రాజువలె సంచరించినవాడు. మంత్రిపదవియో మరే కాంగ్రెసు గద్దెయో పోయిననాడు మృత్పిండమగుట, లేక కొన్ని నక్కలను లేవదీసి కొత్తపార్టీ స్థాపించుట ఆయన జాతకములో లేదు. ఒకవేళ కాంగ్రెసు కెదురు తిరిగినను ఆయనను తిరిగి కాంగ్రెసులో చేర్చుకొనిన కాని కాంగ్రెసుకే దిక్కులేక పోయెడిది. పండిత జవహర్లాలు నెహ్రూజీ ఆయన నర్థించి ముఖ్యమంత్రి పదవి సమర్పించెను.

ఆయన యెన్నికల కార్యక్రమములో పులి. 1925 మొదలు కాంగ్రెసు నాయకత్వమున జరిగిన యెన్నికలలో ఆంధ్రదేశములో ఆయన యే నాయకత్వము వహించి యభ్యర్థులను నిలుపుటలో, ప్రచారము చేయుటలో, వెళ్ళిన చోటులలో జయము సంపాదించుటలో మేటి. రాష్ట్రకాంగ్రెసు ప్రెసిడెంటు యెన్నికలలో ప్రతిసారి యోడిపోవుచుండిన రంగాను విదేశములో నున్నవానిని ఆయనయే నిలబెట్టి గెలిపించెను.

స్వరాజ్యము వచ్చిన తరువాత జరిగిన పదవుల వేటలో ననేక కుట్రలు బయలుదేరెను.

పరిపూర్ణ ఆత్మవిశ్వాసమున్న ప్రకాశంగారు, స్వార్థమెంతమాత్రమూ లేని ప్రకాశంగారు, 'ప్రజలేనేను, నా సేవ ప్రజలకొరకే' అని చాటగలిగిన ప్రకాశంగారు తాటాకు చప్పుళ్ళకు భయపడునా? ఆయనను పడగొట్టుటకు కర్ణుని పడగొట్టుట కారుగురు కావసినట్లనేక గ్రహములు చేరెను. ఆయన వలన పైకివచ్చిన వారే చాలమంది యాయన కెదురైరి.

ప్రజాసేవ చేయుట కాయనతో దీటురాని వారందరూ కుతంత్రములు పన్నిరి. ఇట్లు పడగొట్టబడిన ప్రకాశంగారికే జవహరు పండితుడు పిలిచి ముఖ్యమంత్రి పదవిఇచ్చిన గాని విశాలాంధ్ర యేర్పాటు కాలేదు. ఇదియే ప్రకాశంగారి విశిష్టత. యెత్తులువేయుట, యే యెండకాగొడుగు పట్టుట, జిత్తులుపన్నుట, రంగులుమార్చుట ఆయనకు గిట్టవు. సూటిగా నడుచుట, ఛాటిగా కుండ పగలగొట్టినట్లు మాట్లాడుట ఆయన నైజము. పలుకులో కరుకుదనమున్నను హృదయము నవనీతము. జ్ఞాపకశక్తి యద్భుతము. ఎంతటి వానినైనను, "వాడు" అనినను యెవరు బాధపడెడివారు కాదుకదా, అది యాశీస్సుగ గుర్తించెడివారు. శత్రునైనను ప్రేమించు స్వభావవ మాయనిది. ఒకసారి ఆయనను దింపివేయుటకు చేయబడిన తీర్మానమును తీసికొని వెళ్ళిన ఆయన శిష్యుడొకడుండెను. "నీవిందుకే వచ్చినావా? అయితే వళ్ల పట్టిపో' అని చిరునవ్వుతో పంపివేసెనని నాకాశిష్యుడే చెప్పెను. ఎంతటి నిర్లిప్తత! ఎంతటి స్వభావము! ఆయనది దేశభక్తి యే కాదు దైవభక్తి. ఆధ్యాత్మిక కావగాహన కూడ నున్నత శ్రేణికి చెందినదే. జైలులో గీతా పఠనమొక కార్యక్రమముగ నుండెడిది. ఒకనాడు గీతను పఠించుచు "అనికేతనః" అని శ్లోకమునకు వ్యాఖ్యానముగా తన యుదాహరణయే చాటి చెప్పగా యీ కేసరి కేవల రాజకీయములలో గాక వేదాంత కేసరియని నివురుకప్పిన కాషాయ దుస్తులు ధరింపని యథార్థ మునిసింహమని మే మబ్బురపడితిమి.

భూసంస్కరణలను అక్షరాలా అమలుపరచాలనీ,
యింతటి బృహత్కార్యానికి కావలసిన దృఢదీక్షతో,
ఉత్సాహంతో పనిచెయాలనీ ప్రభుత్వ సంకల్పం.--ముఖ్యమంత్రి.

ప్రకాశం శతజయంతి

ఖైదీలకు క్షమాభిక్ష

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి శత జయంతి ఉత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని వర్గాలకు చెందిన ఖైదీలకు క్షమాభిక్ష పెట్టింది. శ్రీ ప్రకాశంపంతులుగారి జన్మదినమైన ఆగస్టు 23 వ తేదీన దిగువ పేర్కొన్న విధంగా ఖైదీలకు క్షమాభిక్ష పెట్టబడింది.

అ 1. పదేండ్లుకాని లేక ఆజన్మకారాగార శిక్ష విధించబడిన వారికి ఒకసంవత్సరం రెమిషన్ ఇవ్వబడుతుంది.

2. ఐదేండ్లు కాని లేక పదేండ్లవరకు గాని శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఆరునెలలు.

3. ఒక సంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల వరకు శిక్ష విధించబడిన వారికి మూడు నెలలు రెమిషన్ ఇవ్వబడుతుంది.

4. ఒక నెల నుంచి సంవత్సరకాలం వరకు శిక్షవిధించబడిన వారికి శిక్ష పూర్తిగా రద్దుచేయబడింది. అయితే అట్టి ఖైదీలు లోగడ ఇవ్వబడిన రెమిషన్ కలుపుకొని సగం శిక్షకాలాన్ని అనుభవించివుండాలి. ఈ నిబంధన ప్రకారం విడుదల కావడానికి ఆస్కారం లేని పక్షంలో వారికి రెండు నెలలు రెమిషన్ ఇవ్వబడుతుంది.

5. కేవలం ఒక నెల లేక అంతకులోపుగా మాత్రమే శిక్ష విధించబడిన వారికి శిక్ష అనుభవించవలసిన కాలానికి పూర్తిగా రెమిషన్ ఇస్తూ 1972 ఆగస్టు 23 వ తేదీన వారిని విడుదలచేయడం జరుగుతుంది.

పైన పేర్కొన్న క్షమాభిక్ష దిగువ పేర్కొన్న వర్గాలకు చెందిన ఖైదీలకు వర్తించదు.

ఆ 1. అలవాటు ప్రకారం నేరాలు చేసేవారు.

2. ఐ.పి.సి. 106, 107, 108, 109 లేక 110 నిబంధన ప్రకారం జైలులో పెట్టబడినవారు.

3. ఐ పి సి యొక్క 9, 10, 11 అధ్యాయాల క్రింద లేక 1947 సం. అవినీతి నిరోధక చట్టం క్రింద శిక్ష విధించబడినవారు.

4. దొమ్మి, దోపిడీ, స్త్రీలపైన అత్యాచారాలు చేసిన నేరానికి శిక్ష విధించబడినవారు. ఐ పి సి లోని 359 నుంచి 3.7 వరకు గల నిబంధనల ప్రకారం నేరస్థులైనవారు.

5. హత్యా ప్రయత్నం చేసినవారు, హత్యానేరం మోపబడిన వారు.

ఇ. అయితే ఇట్టివారికి దిగువ పేర్కొన్నవిధంగా రెమిషన్ ఇవ్వబడింది

1. పదేండ్లు లేక జన్మాంతర శిక్ష విధించబడినవారికి 6 నెలలు.

2. ఐదేండ్ల నుంచి పదేండ్లవరకు శిక్షవిధించబడిన వారికి $1\frac{1}{2}$ నెల.

4. ఒక సంవత్సరం శిక్ష విధించబడి, లోగడ ఇచ్చిన రెమిషన్‌తోపాటు శిక్ష కాలంలో నాల్గింట మూడు వంతులు శిక్ష అనుభవించినవారిని విడుదల చేయుడం జరుగుతుంది ఈ క్షమాభిక్షకు వారు అర్హులు కానట్లయితే వారికి ఒక నెల రెమిషన్ ఇవ్వబడుతుంది.

అ ఇ పేరాలలో పేర్కొన్న ఉత్తర్వు ఇతర రాష్ట్రాలలో శిక్ష అనుభవిస్తున్న రాష్ట్ర ఖైదీలకు వర్తిస్తుంది. అయితే ఇతర రాష్ట్రాలలో న్యాయస్థానం శిక్ష విధించిన వారికీ కేంద్ర ప్రభుత్వ అధికారావరణలోనున్న ఖైదీలకూ ఈ ఉత్తర్వులు వర్తించవు.

ఈ. ఆంధ్రప్రదేశ్ సంప్రదింపుపైన ఇతర రాష్ట్ర ప్రభుత్వం కాని లేక కేంద్ర పాలితప్రాంత ప్రభుత్వం కాని ఖైదీలకు ప్రత్యేక రెమిషన్ ఇచ్చివుండినట్లయితే, అట్టి వారికి అ ఇ లలో పేర్కొన్న ఉత్తర్వులను అమలుపరచనవసరంలేదు

ఉ అ ఇ పేరాలలో పేర్కొన్న ఉత్తర్వులు దిగువ వర్గాలకు చెందిన వారికి వర్తించవు.

1. డిటెన్యూలు.

2. సైనిక న్యాయస్థానంచే శిక్షలు విధించబడినవారు.

3. 1972 సం. ప్ర అధికార రహస్య చట్టంలోని 3 నుంచి 10 వరకు గల సెక్షన్‌ల ప్రకారము, 1966 సం క్రిమినల్ లా సవరణ చట్టంలోని 2 3 సెక్షనుల ప్రకారం విదేశస్థులు, ప్యాసుపోర్టుల నిబంధనల ప్రకారం శిక్షవిధించబడినవారు.

విదేశస్థుల చట్టం, ప్యాసుపోర్టు చట్టం ప్రకారం శిక్ష విధించబడిన వారు గూఢచారి పనులు చేసినారు అనే అనుమానం లేనట్లయితే, వారికేసులను పరిశీలనచేసి రెమిషన్ ఇవ్వవచ్చు.

జరిమానాలు చెల్లించడానికి బదులు శిక్షలు అనుభవిస్తున్న వారికి కూడా ఈ రెమిషన్ వర్తిస్తుంది.

దున్నేవాడిది భూమి

కాశరాజుగడ్డ రామచంద్రరావు

ఈ నుడి పాతకాలం నుంచి వింటున్నదే.

మనుస్మృతిలో యిలా వుంది: "పృథోర పీమాం పృథివీం భార్యాం వేదవిదో విదుః॥ స్థాణు చ్ఛేదస్య కేదార మాహుః శల్యవతో మృగమ్". బాణంతో కొట్టినప్పుడు పడిపోయిన మృగము కొట్టిన వాని దెలాగవుతుందో అలాగే అడవి లాంటి (అనాక్రమితమైన) భూమిని సరికి పొలంగా జేసినవాడిదే ఆ భూమి అవుతుంది అందుకనే ఆక్రమితమయి యున్న భూమిని ఒక వ్యక్తి హఠాత్తుగా వచ్చి దీన్ని నేను దున్నేశాను యీ భూమి నాదీ. అనే అవకాశం లేదు.

ఆదిమకాలంలో కొన్ని కుటుంబాలు భూమిని ఆక్రమించుకొని ఉపయోగించుకొనేవి. వాళ్ళకొక నేత వుండేవాడు. అతడే భూమిపతి అయినాడు. అతడి క్రిందవుండే ఆ భూమిని యింకొకరెవరూ ఆక్రమించుకోవటానికి ఒప్పుకొనేవారు కాదెవరూ

ఈ పరిస్థితే 'ఆస్తి' అనే ఊహకు ప్రోత్సాహం అయింది. ఈ ఆస్తినే పౌరుడు సంపాదించటానికి గాని, అట్టి పెట్టుకోవటానికి గాని దత్తం చేయటానికి గాని అధికారం లేదా స్వాతంత్ర్యం కలిగి వున్నాడని మనం మన సంవిధానంలో 19 (యఫ్) విషయంలో ప్రకటించుకోవటం జరిగింది. ఈ హక్కు సంవిధాన పూర్వకమైన శాసనము ద్వారా తర్జించబడినంతమేర ఆ శాసనమునకు లోబడి వుంటుంది.

భూమిపై స్వత్వముల ఉపక్రమణం యీ విధంగా వుండగా 'దున్నేవాడిది భూమి' అనేది నినాదంగా చేసి ఎంతో కొంతను చాటగొట్టి పనివాళ్ళకు పళ్ళికెత్తాలనే అర్థం చెప్పటం "ఉతికేవాడిది బట్ట", "కేశసంస్కారకుడిది తల" అన్నట్లే వుంటుంది.

'దున్నేవాడిది భూమి' అనంటే స్థూలంగా యిప్పుడు చెప్పగల అర్థం యేమిటంటే రైతుదే భూమిలోని కుడివరం హక్కు-- అంతేగాని రాజుది కాదు అని. రాజుకు పన్ను వసూలునేసే హక్కు మాత్రమే వుంది. అది మేల్వరం హక్కు అని చెప్పటమే ఆ నుడికి గల ప్రధానమైన ప్రయోజనం.

వెనక ఒకప్పుడు రాజులు తమ మేల్వరం హక్కును కొందరు జమీందార్లకు బదిలీ చేశారు. కాని ఆ హక్కును ప్రభుత్వంవారు జాగీర్దారీ రద్దు శాసనం, జమీందారీ రద్దు శాసనం మొదలైన వాటిద్వారా తిరిగి పుచ్చుకొన్నారు. అవన్నీటిలోను రైతులకు కుడివరం హక్కుల్ని ప్రసాదించారు

ఇకనిప్పుడు రైతుకుగల కుడివరం హక్కును కొట్టివేయటం ద్వారా సామాన్య జనానికంతా అందుబాటులోకి తావటానికి ఇదీ ...ంలో కృషి చేసుకొంటున్న భూస్వాములు నుండి భూమిని లాగికొని సామాన్యులకు పంచవలెనే రాజనీతిని అనుసరించటానికై ప్రయత్నం జరుగుతున్నది.

ఇది సమంజసమా అనే విచికిత్స మనసులో కలగటం సహజం.

ఆస్తి ననుభవించటంలో పాతకాలం వారికి ప్రస్తుతకాలం వారికీ మనస్తత్వాల్లో భేదం వుంది ఒకరు భూమి, సిరి, సంపదాని యుసి నస్తువులు అంతా అనుభవించటానికైనట్టివి. ఇంకొకరు నాలాంటివాడు వీటిని యథేచ్ఛగా అనుభవిస్తాయి

పినతండ్రి యింకొకరు అనుభవిస్తున్నారనే ఉక్రోషంగాని లోభంగాని క్రోధంగాని వుండటం మొదటి రోజుల్లో అంతగా లేదు పైగా తమ ఆస్తిని నాయి సత్కార్యానికి గాని పరార్థం గాని ఉపయోగించటానికి తలంచేవారు. ఆ సందర్భంలో ధర్మరాజు శ్రీకృష్ణునితో రాయబారానికి ముందు చెప్పిన మాటల్లో చూసి తెలుసుకోవచ్చు ఆయనన్నాడు - ఈ అయిదూ ఐనా నాకు ఇవ్వవలసిందని యెందుకంటున్నానంటే,-"గ్రామంబులైదైన ... నాయందు నీ చుట్టాలకున్ గావున" అన్నాడు ... తిరిగే ... పోషించటానికి గాను అడుగుతున్నాను సుమా యీ అయిదైనా గానీ అన్నాడు.

అప్పటికీ యిప్పటికీ చాలా భేదంపడి వుంది. దానం, ధర్మం, యజ్ఞం, స్వాధ్యాయం, తపం, ఆర్జవం లాంటి సద్గుణమైన భావాలు పరంపరగా మనకు ప్రాప్తించటంలో కొంతకొంతగా తీవ్రతను పోగొట్టుకొని నష్టమై, వంచన, దర్పం, అభిమానం

క్రోధం పౌరుష్యం లాటి భావాలు గూడు కట్టుకొని మనసుల్లో వెలార్చటం జరుగుతోంది.

శుభమైన భావాలు కలిగి ఆస్తిని అనుభవించినన్నాళ్ళు ఎంత ఆస్తి ఎవరి ఆధీనంలో వున్నదన్న సమస్య రాలేదు. కాని మనసు, సముద్రంమీద వున్న నావ గాలి యెటు కొట్టితే అటువెళ్ళి పోతున్నట్టుగా జీవితాన్ని నడుపుతుంటే, తన చుట్టూర గిరి గీసి కొని లేదా తన వాళ్ళని అనుకొన్నంత మాత్రంచేత వారి కోసం పాప కార్యాలుచేసి ఆస్తి గడించి ధన మార్జించి శుష్కంగా కూడ బెట్టి పైశాచిక సంతోషాన్ని ఆశించటం జరుగుతూ వుంది.

ఈ నడవడి దిద్దటానికి శాసనాలూ కోర్టులూ కావాల్సి వచ్చినయి. శాసనాలు యే యే పద్ధతులల్లో చేయాలో చెప్పేందుకు రాజ్యాంగం ఒక శాసనాల శాసనమై అవతరించింది. అందులో సర్వసామాన్యత్త్వం వుండాలనీ, వ్యక్తిగతమైన స్వేచ్ఛ కొన్ని విషయాల్లో వుండాలనీ సామాజిక సంబంధమైన, ఆర్థసంబంధ మైన, రాజకీయ సంబంధమైన న్యాయం దేశంలో నెలకొల్ప బడాలనీ నిశ్చయించి ప్రజలు ప్రమాణ పూర్వకంగా ఆ సూత్రాల నంగీకరించారు.

ప్రసక్త విషయానికి వచ్చేముందు యీ సామాజిక సంబంధ మైన న్యాయం యెలా నెలకొల్ప బడుతుందో తెలియటం అవసరం. ఉదాహరణకు-

ఫ్యాక్టరీలోని సిబ్బందికి కనీస వేతనాలు యివ్వ వలసిందేననీ, అలా యివ్వకపోతే ఫ్యాక్టరీ మూసివేయ వలసిందే ననీ, లాభాలువస్తే కొంత లాభం పనివారికి ఇవ్వాలెననీ వీలయితే సంపూర్ణావకాశాలు వినియోగించు కోగలిగిన జీవనభృతి కూడ వారికి ఇచ్చి తీరాలనీ శాసనంగాని సుప్రీంకోర్టు వారి తీర్పులుగాని రావడం జరిగింది. ఇది సామాజిక న్యాయం దృష్ట్యా జరిగినట్టిదే.

జమీందారుల హక్కులు తొలగించినపుడు కూడ యీ సామాజిక న్యాయమే తన దయారసాన్ని రైతులపై వర్షించింది.

షెడ్యూలు తరగతులకు, వెనుకబడిన తెగలకు స్త్రీలకు ప్రత్యేక అవకాశాలివ్వడం దీనిని పురస్కరించుకొనే.

ఇంకా అలాంటి హక్కుల్ని కలిగించి శాసన సభలుగాని సుప్రీంకోర్టు వారుగాని క్రొత్త విషయాలు ధర్మాలుగా చెప్పవచ్చు. యీన్యాయం దృష్ట్యా-ఉదాహరణకు తక్కువ తరగతి ఉద్యోగులకు జీతం యివ్వడానికి బదులు జీవితావసర వస్తువులను సరఫరాచేసి సర్వావకాశాలూ కల్పించవలెననవచ్చు. లేదా బ్లాకు మార్కెటింగు దొంగతనం, లంచగొండితనం, చేసిన వాళ్ళందరికీ శిక్షగా "వ్యాసెక్టమీ'' చేయాలె నిర్బంధంగా ననవచ్చు అలా అన్నా యేమీ ఆశ్చర్య పడవలసినపని లేదు.

భూమి సీలింగు చట్టము చేయవచ్చు

ఎవరినైనా కదిలించండి. సీలింగు వద్దనరు. పరిమితి యీ మాత్రం వుండాలి ఆ మాత్రముండాలి అని మాత్రం అంటారేమొ అంతే సభ్యులు యీ శాసనం కావాలనే మనసుతో కోరటం బాహాటంగా కనుపడుతోంది. ఇంతమంది కావాలనటం సామాజిక దృష్ట్యా యీ శాసనంచేయవలసిందేనన్న మాటను ధ్రువపరుస్తుంది.

ఈ సీలింగు నాందిగా 1972వ సంవత్సరపు వ్యవసాయ భూముల అన్యాక్రాంతముల నిషేధపు ఆర్డినెన్సును జారీచేయటం జరిగింది. దానిప్రకారం పది హెక్టేరులకు మించినవ్యవసాయ భూమిని కలిగివున్న వ్యక్తిగాని కుటుంబంగాని దానిలో యేమాత్రం ఇతరులకు అన్యాక్రాంతం చెయ్యగలిగే అవకాశంలేదు సీలింగు చెయ్య బోతున్నామని ప్రజలకేమాత్రం నోటీసు యీయకపోగా ముందరనే యీ నిషేధంయేర్పాటు చేసిన కారణం యేమిటంటే, తమ పేరనుంచి మార్చి బినామీగా భూమిని యితరుల పేర్లపెట్టుతారనీ యీ అబద్ధపు బ్రతుకులు ప్రజలకు అలవాటు కాకూడదనే ఉద్దేశం అయివుంటుంది. భూమిని యెవరూ యెత్తుకొని పోయేది లేకపోయినా పైగా, పరమోద్దేశం వీలయినంత యెక్కువ మంది గరిష్ట భూముల పరిమితి మాత్రం భూమిని కలిగి అనుభవించాల్సిందే అని అయినా సూత్ర ప్రకారం అది ప్రభుత్వం చేతుల మీదగా జరగాల్సిన పని కనుక యీ ఆర్డినెన్సు ముందుగానే జారీ చేసేరు

1950వ సంవత్సరంలో తెలంగాణాలో వ్యవసాయ మరియు కౌలు భూముల చట్టమని ఒకటి చేశారు. అందులో భూమిని వాస్తవంగా దున్ని వ్యవసాయం చేసే యే ఒక్కడికిగాని ఒక ఫ్యామిలీ హోల్డింగ్ (కుటుంబ క్షేత్రము) కంటే ఎక్కువ భూమిని సేకరించేందుకు అడ్డంకి వున్నది. అసలు భూస్వామికు కూడ ఒకకుటుంబ క్షేత్రము కంటే ఎక్కువ భూమివున్నపుడు అతడి క్రిందనున్న సంరక్షిత కౌలుదారుకు అతడు కొనదగినంత మేర భూమిని అమ్మితీరవలె. ఇంకా తనకు మిగిలినట్లయితే ప్రభుత్వం కూడా స్వాధీనం చేసికొని నష్ట పరిహారం యివ్వగలదు.

1950వ సంవత్సరపు చట్టంలోని నిబంధనలు యీ సీలింగుకు సంబంధించినంత వరకు 1961వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల సీలింగు చట్టము అమలులోనికి వచ్చిన వెంటనే ఆ విషయాలకు అన్వయించటం మానివేసినవి. అందుకని 1961వ సంవత్సరపు చట్టములోని విశేషాలు తెలుసుకొంటే ప్రస్తుతం అమలులోవున్న వ్యవహారం అర్థమవుతుంది

1961వ సంవత్సరం చట్టప్రకారం ఒక వ్యక్తికిగాని ఐదుగురు మెంబర్లున్న ఒక కుటుంబానికి గాని నిర్ణయింపబడ్డ సీలింగు పరిమితి యేదంటే ఒక కుటుంబ క్షేత్రమునకు 4½ రెట్లు. అతిడికి లేదా ఆకుటుంబానికి వున్న మొత్తం భూమి యీ పరిమితి కంటె ఎక్కువగా వున్నట్లయితే, ఆ అదనంగా వున్న భూమిని అతడు లేదా ఆ కుటుంబం ప్రభుత్వానికి అర్పణ చేసి వెయ్యాలి. కాగా కుటుంబ క్షేత్రం అంటే యెంతో తెలిసికొంటేనే గాని ఈ సీలింగు యిదమిత్థమని తెలియదు.

కుటుంబ క్షేత్రం అంటే యేమిటో 4వ సెక్షనులో వివరీకరించబడింది. ఏ రకం భూమికి యెంత విస్తీర్ణం, ఒక కుటుంబ క్షేత్రం అవుతుందో చక్కగా అందులో చెప్పబడింది ఎ.బి.సి.డి. ఇ.యఫ్.జి.హెచ్ అనే రకాల భూములకు 8 విస్తీర్ణాలు నిర్ణీతమయినాయి. ఇక ఏలాంటి భూమి యే రకం క్రిందికి వస్తుందో ఆ వివరం మొదటి షెడ్యూలులో వుంది.

ఆ మానాన్ననుసరించి ఏయే రకాల భూములు ఒకళ్ళ కున్నా అవి అన్నీ, ఒకే రకంలో యెంత భూమికి సమానమవుతయ్యో లెక్కగట్టి 1½ కుటుంబ క్షేత్రములకు మించి వుంటేనే అదనపు భూమి ప్రభుత్వపరం చెయ్యవలసి వుంటుంది. అలా ప్రభుత్వపరం చేయబడిన భూమికి ప్రభుత్వం నష్టపరిహారం లెక్కగట్టి యిస్తారు. అలా అర్పణ చేయబడిన భూమి ఒక కుటుంబ క్షేత్రమునకు సమాన మయిగాని, దానికి లోబడిగాని వుంటే దాని మొత్తము సంవత్సరాదాయమునకు ఐదు రెట్లు పరిహారం ఇస్తారు. అంతకంటే ఎక్కువగా అర్పణచేసినట్లయితే, మొదటి కుటుంబ క్షేత్ర విషయంలో 5 రెట్లు రెండవ కుటుంబక్షేత్రం మేర 4 రెట్లు ఆ తరువాత ఇంకావున్న భూమికి 3 రెట్లు, సంవత్సరాదాయంపై లెక్కగట్టి నష్టపరిహారం ఇస్తారు. ఈ మొత్తం సంవత్సరాదాయము అనేదేమిటో యిలా చెప్పబడింది.

ఏ వ్యక్తి ఆ భూమిని అర్పణ చేస్తాడో ఆ వ్యక్తి 5వ సెక్షను క్రింద తన కింద యింత భూమి వున్నదని ప్రకటించి వుంటాడు. అలా ప్రకటించిన తేదీకి పది సంవత్సరాల పూర్వం నుంచి ఆ భూమిపై యెంతెంత ఆదాయం వచ్చిందో దానిని గమనించి దాని సంవత్సర సరాసరి యింత అని ప్రభుత్వాధికారి యోచించి లెక్కించి తేలియజేస్తే అది ఆ భూమి కయిన మొత్తం ఆదాయంగా పరిగణించాలి.

కాగా— ఈ చట్టం ప్రవేశ పెట్టబడి పదకొండు సంవత్సరాలయినా యింతవరకూ ప్రభుత్వపరం చేయబడిన భూమి 2,700 ఎకరాలు మాత్రమే దానికి సుమారు 36 లక్షల రూపాయిల నష్టపరిహారం యిచ్చారు.

ఉన్న మొత్తం భూమి యెంత అని గణన చేసేటప్పుడు, భూస్వాముల కౌలుకు యిచ్చిన భూమి యేదయినా వుంటే గణన చేయనక్కరలేదని వుండేది మొదట్లో. మొన్న మొన్ననే (1970లో) యీ స్థితి మార్చటానికిగాను సవరణచట్టం చేయాల్సి వచ్చింది.

సీలింగు నిర్ణయించటం 5 గురుగల ఒక కుటుంబానికి గదా. అంతకంటె ఎక్కువ మందివున్న కుటుంబాల విషయంలో ఆ అదనంగావున్న ప్రతివారికీ ఒక కుటుంబక్షేత్ర మాత్రభూమి వుంచుకోవచ్చును. ఆదీగాక కుటుంబమంటే ఒక నిర్వచనంవుంది. బహుళమైన సంఖ్యలో మనుష్యులు చేరివుండే కుటుంబం కూడ ఆ నిర్వచనంలో యిమిడేటట్లు చేయబడింది. అందులో భాగం పంచుకొనేవాళ్లు ఎక్కడో నివసిస్తున్నా, మెంబర్లే ఆధారాన్ని, వాడుకను, అనుసరించి పాలేళ్లు వగైరాలు కూడ, ఒక కుటుంబంలో వుండి బ్రతుకుతుంటే వాళ్లుకూడా కుటుంబంలో ఒకరుగా పరిగణింపబడే అవకాశంవుంది. అందుచేత పాలేళ్లూ పరదేశులూ కూడ ఫలానా కుటుంబంలోని వాళ్లేనని లెక్క సరిపెట్టి ప్రభుత్వానికి అర్పణం చేయగలిగిన భూమి లేదనటం కద్దు.

మొత్తం భూమిలో స్త్రీ ధనం లెక్కవేయాల్సిన అవసరంలేదు.

ఆ తరువాత ఈ చట్టం ల్యాండు మార్టుగేజి బ్యాంకులకు చెందిన భూములకు, పశువుల మేతకై వదలిన భూములకు, ఫ్యాక్టరీలచే చెరుకు పండింపబడుచున్న భూములకు, యుద్ధంలోంచి తిరిగివచ్చినవారికి ప్రదానం చేయబడగా వారి అధీనంలో నున్న భూములకు వర్తించదు.

పైగా ఏదయినా ఒకపెద్ద విస్తారమైన భూమి చక్కగావ్యవసాయం చేయబడుతూంటే దానిని పగలగొట్టి యీ చట్టం క్రింద ప్రభుత్వం తీసికొన్నా అంత చక్కగా యిక వ్యవసాయం జరిగించటం కుదరదన్న ఉద్దేశానికి కలెక్టరుగారు వచ్చినట్లయితే ఆ భూమికి కూడ యీ చట్టం వర్తించదు.

ఈ విధంగా కుదరకున్న రంధ్రాల్లో నుంచి నీరు కారిపోయినట్లు, ఈ చట్టం యొక్క పటిష్ఠత లొంగి పోయింది.

మరి ఇప్పుడు తలపెట్టిన సీలింగు చట్టంలో పైలోపాలు సరిదిద్దటానికి మాత్రం ప్రయత్నాలు జరుగుతవి.

ప్రస్తుతంవున్న సీలింగు పరిమితి తగ్గించాలి.

ప్రభుత్వం డబ్బును సేకరించాలి. అందుకు మార్గం క్రొత్తపన్నులు వేయడమన్నా కావచ్చు—లేదా ప్రజల దగ్గరనే అప్పులు వసూలు చేయటం కావచ్చు—క్రొత్త అప్పులు చేయడమూ కావచ్చు.

అసైన్ చేసిన తరవాత పేదవారు కూడ 'అసైనీ'లై వుంటారు కనుక వారు కూడా ముందే భూమి విలువ యివ్వవలసిన అవసరం లేకుండా ప్రభుత్వానికి వడ్డీ రూపకంగా చెల్లించే యేర్పాటు వుంటే బాగుంటుంది.

అసలు ఇవ్వవలసిన నష్టపరిహారమే మార్కెటు విలువకు సమానంగా లేకుండా ఇంకా తక్కువలోనే వుండాలి. ఉదా:- ప్రస్తుతమున్నట్లు ఆదాయమునకు కొన్నిరెట్లని వుండవచ్చు. లేదా శిస్తుకు కొన్ని రెట్లని గాని వుండవచ్చు.

అర్పణ కాబడిన అదనపు భూములు పరిశ్రమలు స్థాపించగలిగిన వారికి అమ్మి పరిశ్రమలు యేర్పాటుచేసి ఉత్పత్తి పెంచవచ్చు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తోడ్పడవచ్చు.

ప్రస్తుతం అమలులోకి వచ్చిన ఆర్డినెన్సు ఆధారంగా ఆలోచిస్తే యీ పై కట్టుబాట్లు చేయాలని ఆశించి అలా చేయటానికి ముందుగా రైతులు బినామి వ్యవహారాల ద్వారా—చేయబోయే చట్టపు ఉద్దేశాన్ని జరగకుండా చేస్తారేమోననే భయంతోనే యీ ఆర్డినెన్సును జారీచేశారేమోనని అనిపిస్తుంది.

ఇంతకు యీ సీలింగువల్ల కలిగే లాభాలేమిటి ?

భూములు లేనివాళ్లకు కొందరికి భూములు కలుగుతవి. వాళ్లు యితః పూర్వం నిరుద్యోగులుగావున్న వాళ్లయితే ఉద్యోగాలకై వారు ప్రాకులాడే అవకాశం తగ్గుతుంది. నక్సలైట్లు కూడ యీ భూములను పొందినట్లయితే తమ అంతరంగాలకు ఋజువని తోచే మార్గం చేపట్టి హింసాకాండ పరిత్యజించవచ్చు.

ప్రతి మనుష్యుడికీ కావాల్సిందేమిటి ఒక్క భూమి మాత్రమేనా ? కాదు అన్నింటితోపాటు తృప్తి కావాలనీ అదివుంటే మిగతావి కొన్ని లేకపోయినా సుఖమే అవుతుందని తెలిసి కూడ తృప్తిని అనుసంధానం చేయకపోవటం, మనుష్యుడికి శోచనీయమైన పరిస్థితి అనిపిస్తుంది. పది ఎకరాలుంది యిప్పుడు ఫలాని వాడిలాగా ఇరవై ఎకరాలు కలిగ్గిలేనుగదా అనే చింతను పెంచితే యీ భూమి వుండికూడ కలిగేది అసుఖమే. ఇంకా యింకా ఎక్కువ వుండాలి అనే ఊహ మనసులో ఉపరిభాగంలో నాట్యం చెయ్యటమే దుఃఖహేతువు.

మనసులో స్వార్థం వుంటుంది. పరార్థభావం కూడ వుంటుంది మనిషికి. మనసులో మాత్రం స్వార్థభావము ప్రేమిస్తూ పరార్థభావాన్ని అడుగుకు నెట్టి నిరసిస్తూవుండి దానికి దూరంగా వుంటాడు మనిషి. అంటే యజ్ఞభావానికి దూరంగా వుంటాడు యజ్ఞభావం సుఖప్రదమనీ స్వార్థభావం దుఃఖప్రదమనీ అతడికి తెలియదుగాక. శాస్త్రం చెపుతున్నది. అది తెలిసికోవటానికి ప్రయత్నమైనా చెయ్యడు.

ఈ కిష్టాలు దుఃఖాలూ వదలటానికి శాస్త్ర రీత్యా యేమి మార్గం చెప్పారంటే "బుద్ధిని ప్రచోదయించి స్వార్థభావాన్ని క్రిందికి త్రోసి, పరార్థభావాన్ని మనసుకు దగ్గరగా ఎల్లప్పుడూ వుండనీ—సుఖ సౌఖ్యాలు నిన్నలముకొంటాయి." అని ఈ సుఖ సంతోషాలకోసమే తమకున్న అదనపు పొలాలను ఇచ్చివేయమనటం.

జోహారులు !!

—జి. కోటయ్య

శ్రీ జె. వి. నరసింగరావు
కీర్తిశేషులైన సందర్భమున
శాసనసభలో
ది. 4-9-72 న చదివిన గేయం.

(1)

జోహారులు నీ కివె
శ్రీ జె. వి. నరసింగరావు
ఎంతటి దుర్వార్త నిటుల
వింటినయ్యా నేడు నేను.

మింట మెరయు తారలన్ని
మంటిపైన రాలినట్లు
భూకంపము వచ్చినట్లు
భూమి బ్రద్దలైనయట్లు

హోరెత్తే కడలిరాజు
భోరున ఏడ్చినయట్లు
లోకా లోకాలన్నీ
చీకట్లో మునిగినట్లు

నాకేమో మదిలోపల
చీకట్లే క్రమ్మినట్లు
దిక్కేమీ తోచనట్లు
దిగులు చెందుచున్నట్లు



కీ. శే. శ్రీ జె. వి. నర్సింగరావు

ఎంతటి దుర్వార్త నిటుల
వింటినయ్యా నేడు నేను
జోహారులు నీ కివె
శ్రీ జె. వి. నరసింగరావు

(2)

కారుణ్య మూర్తివయ్యా
కనులు మూసినావు నేడు
సాటి సభ్యుడవు నీవు
సభలో కనరావు మాకు
మాసి పోయె నీ మూర్తి
మిగిలెను నీ కీర్తి ధరలో.

జోహారులు నీ కివె
శ్రీ జె. వి. నరసింగరావు
అందుకొనుము జోహారులు
ఆకాశమునుండి నీవు
జోహారులు, జోహారులు
జోహారులు నీ కివె
శ్రీ జె. వి. నరసింగరావు

తెలుగు అకాడమి లక్ష్యాలు, కృషి

పి. ఎస్. ఆర్. అప్పారావు

చాలా కాలంనుంచి తెలుగుదేశంలో హైస్కూలు తరగతులలో తెలుగు బోధన భాషగా ఉంటున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 1966 లో అధికార భాషా శాసనాన్ని ప్రవేశపెట్టిన నాటినుంచి తెలుగు అధికార భాషగా గుర్తింపు పొందినది.

తెలుగు భాషను మహత్తరమైన విద్యాబోధన సాధనంగాను, ఉన్నత పరిపాలన వాహకంగాను తీర్చి దిద్దడానికి సూచనలు ఇయ్యవలసినదిగా ప్రభుత్వం 1966 డిసెంబరులో ఒక నిపుణుల సంఘాన్ని నియమించినది. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మాజీ కార్యదర్శి శ్రీ జె. పి. యల్. గ్విన్, ఐ. సి. యస్. అధ్యక్షులుగా ఏర్పడిన ఈ సంఘము 1967 ఏప్రిల్ నాటికి ప్రభుత్వానికి ఒక రిపోర్టు సమర్పించి, తెలుగు భాషను శక్తిమంతంగా రూపొందించడానికి రాష్ట్రస్థాయిని 'తెలుగు భాషా సంస్థ' ఒకటి ఏర్పడవలసి ఉందని ప్రభుత్వానికి నివేదించినది.

మాతృభాషను కాలేజి స్థాయిలో బోధన మాధ్యమంగా చేయవలెననే సంకల్పము చిరకాలంనుంచి మనదేశంలో ఉన్నది. 1966 లో కోఠారి కమిషన్‌వారి నివేదిక ఈ సంకల్పానికి ఒక నిర్దిష్టమైన స్థూల రూపాన్ని ఇచ్చినది. కమిషన్ సూచించిన ముఖ్యమైన సలహాలను భారత ప్రభుత్వము ఆమోదించడంతో, ప్రాదేశిక భాషలలో ఉన్నత విద్యాస్థాయిలో పాఠ్యగ్రంథాలు, పఠనీయ పుస్తకాలు, అనువాదాలు, సంప్రదింపు గ్రంథాలు సిద్ధం చేయించి ప్రచురించవలసిన ఆవశ్యకత ఏర్పడినది. దీనిని దృష్టిలో పెట్టుకొని 1967 జూన్ నెలలో భారత ప్రభుత్వము ఒక బృహత్ప్రణాళికను తయారుచేసి ప్రాదేశిక భాషలలో రాష్ట్ర భాషా సంస్థలను ఏర్పాటు చేయవలెనని సూచించినది.

ఆరంభము

గ్విన్ కమిటీ నివేదికను, భారత ప్రభుత్వ ప్రణాళికను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 1968 జూన్ 12 వ తేదీన ప్రకటించిన అధికార పత్రం ద్వారా 'తెలుగు అకాడమి' అన్న పేరుతో, ఈ రాష్ట్రభాషా సంస్థను ఏర్పాటు చేసినది. ప్రథమంలో ఇది కొద్దిమంది కార్యోద్యోగులతోను, ఒక స్పెషల్ ఆఫీసర్‌తోను 1968 ఆగస్టు 6 వ తేదీనుంచి పని ప్రారంభించినది. ఆరంభంలో పరిమితంగా నియమితులైన ఉద్యోగులలో చాలా మంది 1968 నవంబరు నాటికి ఉద్యోగాలలో చేరినారు. డిగ్రీస్థాయి గ్రంథ ప్రచురణార్థం నియమితులైన ఉద్యోగులలో చాలామంది 1971 మార్చినాటికి అకాడమిలో చేరినారు.

వ్యవస్థాపన

సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం క్రింద రిజిస్టరైన తెలుగు అకాడమి స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థ. రాష్ట్ర విద్యాశాఖామాత్యులు (ప్రస్తుతము ముఖ్యమంత్రి) అధ్యక్షులుగా ఒక గవర్నర్ల బోర్డు దీనిని పరిపాలిస్తున్నది. వ్యవసాయవిశ్వవిద్యాలయంతో సహా రాష్ట్రంలో ఉన్న నాలుగు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, ఆర్థికశాఖా కార్యదర్శి, విద్యాశాఖా సలహాదారు, రాష్ట్రవిద్యాశాఖాధికారి, సాంకేతిక విద్యాశాఖాధికారి, న్యాయశాఖ ఉపకార్యదర్శి (న్యాయశాఖలో అనువాద విభాగానికి కార్యదర్శి), ఆంధ్రప్రదేశ్ సాహిత్య, సైన్సు అకాడమీల అధ్యక్షులు, భారత ప్రభుత్వ విద్యా సంక్షేమశాఖా ప్రతినిధి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్, సి యస్.ఐ.ఆర్.ల ప్రతినిధులు ఒక్కొక్కరు, దేశంలో ప్రతిష్ఠ నార్జించుకొన్న విద్యావేత్తలు అయిదుగురు కలిసి ఈ గవర్నర్ల బోర్డులో సభ్యులుగా ఉన్నారు. క్రమానుపూర్వంగా నలుగురు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులలో ఒకరు, విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ సలహాదారు ఉపాధ్యక్షులుగా ఉంటారు.

డైరక్టర్‌ను నియమించే వరకు అకాడమి వ్యవహారాలను ప్రారంభంనుంచి స్పెషల్ ఆఫీసర్ నిర్వహించినారు. 1970 ఆగస్టు 7వ తేదీన డైరక్టర్ పదవీ స్వీకారం చేయడం జరిగింది. పరిపాలన విషయాలలోను, విద్యా విషయాలలోను అకాడమి డైరక్టరే ప్రధానాధికారి. పరిపాలన విషయాలలో ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ముగ్గురు మేనేజర్లు, ఒక ప్రింటింగ్ సూపరింటెండెంట్, డైరక్టర్‌కు సహాయకులుగా ఉన్నారు. విద్యావిషయాలలో—అసిస్టెంట్ డైరక్టర్, రిసెర్చి ఆఫీసర్లు, ఆయా శాస్త్ర విషయాల రిసెర్చి అసిస్టెంట్లు, భాషా విషయాల రిసెర్చి అసిస్టెంట్లు, సర్వే అసిస్టెంట్లు, పబ్లికేషన్ అసిస్టెంట్లు వొకాబ్యులరీ అసిస్టెంట్, డైరక్టర్‌కు సహాయులుగా ఉన్నారు.

అకాడమిలో దాని లక్ష్యసాధనకు అనుగుణంగా విద్యావిషయాలకు సంబంధించిన మూడు శాఖలున్నవి: 1. పరిశోధన—

సర్వేశాఖ, 2. శిక్షణశాఖ, 3 ప్రచురణశాఖ. ఈ శాఖల సమీకృత కృషిఫలితంగా తెలుగు అన్ని స్థాయిలలోను బోధన మాధ్యమంగా పరిపాలన భాషగా సమర్థవంతంగా రూపొందడానికి అవకాశ మేర్పడుతున్నది. డైరక్టర్ పర్యవేక్షణలోనే ప్రచురణ శాఖ ఉన్నది. మిగిలిన రెండు శాఖలు అసిస్టెంట్ డైరక్టర్ పర్యవేక్షణలో ఉన్నవి.

అకాడమి పథకాలను కార్యక్రమాలను శాఖల వారీగా దిఙ్మాత్రంగా సూచించడం ఇప్పుడు జరుగుతున్నది. ఈ శాఖలన్నీ కలిసిమెలిసి పనిచేయడం వల్లనే అకాడమి కొన్ని లక్ష్యాలను సాధించగలిగినది. మిగిలినవి సాధించగలదని విశ్వాసమున్నది. అకాడమి చేసిన, చేయుచున్న కృషిని విశ్వవిద్యాలయాల నుంచి, ప్రభుత్వంనుంచి, ఇతరులనుంచి ప్రత్యేకంగా పరోక్షంగా ఎంతో సహాయ సంపత్తి లభిస్తూఉన్నది.

పరిశోధన-సర్వేశాఖ

సామాజిక భాషా పరిశోధన : తెలుగు అకాడమి పెద్ద యెత్తున ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుభాషను గురించి సామాజిక భాషా పరిశోధన ప్రారంభించినది. భారత దేశంలోని భాషాధ్యయన సంస్థలో బహుశా ఇదే మొదటిసారిగా ఈ విషయమై భారీయెత్తున పరిశోధన కార్యక్రమం మొదలయినదని చెప్పవచ్చును. తెలుగు వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలో పర్యటన, పరిశోధన చేయడంద్వారా, నేటి తెలుగులో ఉన్న వచన రచనను-ముఖ్యంగా కథానికలు, నవలలు, ఆధునికశాస్త్ర రచనలు మొదలయిన వాటిని భాషా దృష్టితో అధ్యయనం చేయడంద్వారా, ఆధునిక భాషకు వర్ణనాత్మకమైన బృహద్వ్యాకరణ మొకటి వ్రాయడమే తెలుగు అకాడమి ప్రధాన లక్ష్యాలలో చేరినది. ప్రస్తుతం పర్యటన పరిశోధన పద్ధతులద్వారా సామాజిక భాషా పరిశీలనకు కావలసిన విషయసేకరణ జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని 21 జిల్లాలలోని ప్రతితాలూకా కేంద్రాన్ని ఇతర ముఖ్యనగరాలను సందర్శించి విషయసేకరణ చేయడానికి నిర్ణయమయినది. ఈ విధంగా రాష్ట్రం మొత్తంలో 260 కేంద్రాలను సందర్శించవలసి ఉంటుంది. ఇప్పటికి 38 కేంద్రాలు పూర్తి అయినాయి. ఇంతవరకు సేకరించిన విషయంతో కరీంనగర్, కడప, విశాఖ పట్నం, గుంటూరు జిల్లాలను గురించిన పరిశోధన పత్రికలు అచ్చయినవి. వర్ణనాత్మక వ్యాకరణ రచనా పథకము త్వరగా జరిగేదికాదు అది దీర్ఘకాలికమైనది. అందువలన మున్ముందుగా సర్వేఫలితాలను విశ్లేషిస్తూ, ఆ ఫలితాలను జిల్లాల వారీ పరిశోధన పత్రిక (బులెటిన్)ల రూపంలో ప్రకటించడం మేలని నిశ్చయించడమైనది. జిల్లాల వారీ తెలుగులో వచ్చే పరిశోధన పత్రికలు కాక, భిన్న మాండలిక వ్యవహార భేదాలను తులనాత్మకంగా పరిశీలించే వ్యాసాలతో, వ్యవహార ఖండికలతో ఆంగ్ల భాషలో రోమన్ లిపిలో (సంకేత పూర్వకంగా) కొన్ని పత్రికలు వస్తాయి. ప్రతి జిల్లాకు ఒక సంక్షిప్తమైన మాండలిక వ్యాకరణంకూడావస్తుంది. ఈ గ్రంథాలు ఆంగ్ల భాషలో ఉంటాయి. ఈ మాండలిక వ్యాకరణాలు, ఆధునికాంధ్ర భాషకు వర్ణనాత్మకమైన బృహద్వ్యాకరణ గ్రంథరచన చేసేటప్పుడు పనికివస్తాయి.

పారిభాషిక పదకోశాలు

అవిభక్త మద్రాసు రాష్ట్ర ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వము, శాస్త్రీయ పారిభాషిక పదసేకరణ సంఘము తయారు చేసి ప్రకటించిన పద పట్టికలను; ఇంతకు పూర్వము అచ్చయిన పాఠ్య గ్రంథాలలో, విజ్ఞాన సర్వస్వాలలో, ప్రసిద్ధ రచయితల రచనలలో ఉన్న పారిభాషిక పదాలను పరిశీలించి విశ్వవిద్యాలయాల శాస్త్ర నిపుణుల సాయంతో సంప్రదింపులతో తెలుగు అకాడమి, పారిభాషిక పదాలను సంతరించుకొన్నది. అకాడమి ప్రచురణలలో వీటి వాడకం జరిగినది. విద్యార్థులకు అధ్యాపకులకు తక్షణం సంప్రదించడానికి వీలుగా ఆయా పాఠ్యగ్రంథాల చివర పారిభాషిక పదకోశాలను అకారాదిగా ప్రకటించడం జరిగింది. గ్రంథంలో తెలుగు పారిభాషిక పదాన్ని మొదటి సారిగా వాడినప్పుడు అక్కడే బ్రాకెట్లలో దానికి సమానమైన అంతర్జాతీయ పదాన్ని ఇంగ్లీషులో వ్రాయడం జరిగినది.

ఈ విధంగా తయారయిన పారిభాషిక పదావళిని కాలానుగుణంగా సమీక్షిస్తూ : రచయితల గ్రంథాలలోను, తరగతి బోధనలో తమ నిత్యానుభవంవల్ల కళాశాలల ఉపన్యాసకులు సంతరించి అకాడమీకి అందజేసిన పారిభాషిక పదాలలోను లభ్యమైన నూతన పదాలను దీనికి చేర్చడం జరుగుతూ ఉంటుంది. తరవాత పారిభాషిక పదకోశాలుగా అకాడమి ప్రచురిస్తుంది.

శాస్త్ర నిఘంటువులు

విద్యార్థులకు అధ్యాపకులకు సంప్రదింపు గ్రంథాలుగా ఉపయోగపడటానికి ఒక్కొక్క శాస్త్రానికి ఒక్కొక్క తెలుగు నిఘంటువును సిద్ధం చేయవలెనని అకాడమీ సంకల్పించినది. ఒక్కొక్క నిఘంటువు 300 నుంచి 500 పేజీలవరకు ఉంటుందని అంచనా. అకారాదిగా ఆంగ్లేయ పదాలు వ్రాసి తెలుగులో వివరించడం జరుగుతుంది. సులభంగా సంప్రదించడానికి వీలుగా గ్రంథం చివర తెలుగు పదాలను అకారాదిక్రమంలో ఇయ్యడం కూడా ఉంటుంది. నిపుణులందరితో దీర్ఘంగా చర్చలు జరిపిన తరవాత ఈ నిర్ణయం జరిగినది. ప్రప్రథమంగా భౌతిక, రసాయన, వృక్ష, జంతు, గణిత, అర్థ, వాణిజ్య, రంగస్థల శాస్త్రాలలో ఈ నిఘంటువులు తయారు చేయడం జరుగుతుంది. క్రమంగా మిగిలిన శాస్త్రాలలో కూడా ఇవి వస్తాయి

గ్రంథసూచిక

ఆంధ్రప్రదేశ్ సైన్సు అకాడమివారు 1863నుంచి 1965 వరకు తెలుగులో వెలువడిన శాస్త్రీయ గ్రంథాలను సమాలోకించి నవీన పద్ధతిలో ఒక గ్రంథసూచికను తయారుచేసి 'శాస్త్రీయ వాఙ్మయ సూచిక' అనే పేరుతో ఇదివరకే (1967) ప్రచురించినారు. తెలుగు అకాడమి 1963 నుంచి తెలుగులో వెలువడిన మానవీయ శాస్త్ర గ్రంథాలను, 1966–1969 నడుమ తెలుగలో వెలువడిన శాస్త్రీయ గ్రంథాలను, పెక్కు గ్రంథాలయాలలో పరిశీలన చేయించిన, నవీన

సంపదను నిర్ధారణచేసి వాచక రచనకు పనికివచ్చే సామాగ్రిని సిద్ధంచేస్తారు. ఈ కృషిలో ఇంతవరకు ప్రాథమిక తరగతులకోసం వివిధ ప్రాంతాలలో అచ్చయిన వాచకాలలోని శబ్దాల పరిశీలన కూడా చేరుతుంది. ఈ పరిశీలన పూర్తి కావడానికి 3, 4 ఏళ్లు పట్టుతుంది. తెలుగులో ఇంతకుపూర్వం ఇంత పెద్దఎత్తున ఈ పరిశీలన జరగలేదు.

ప్రచురణశాఖ

తెలుగు అకాడమిలో ఉన్న శాఖలలో దీనికొక విశిష్టత ఉన్నది. అన్నిశాఖలకు దీనితో సంబంధమున్నది. ఆ యా శాఖలలో తయారయిన సామాగ్రిని తెలుగు ప్రజలకు సముచిత రీతిలో అందిచ్చే శాఖ యిది. ఈ శాఖ, ప్రత్యేక కృషివల్ల లభించే సామగ్రిని అచ్చువేయడమేకాక, ఇతర శాఖల కృషిని అందియ్యడంతోపాటు, అకాడమి సర్వ కార్యక్రమాలకు సంబంధించిన కృషిని కూడా తెలుగువారికి అందిస్తుంది.

మౌలికమైన పాఠ్యపుస్తకాల, పఠనీయ గ్రంథాల ప్రచురణ

ఈ శాఖ చేపట్టిన వివిధ కార్యక్రమాలలో — పరిస్థితుల ననుసరించి, ఇంటర్మీడియట్ తరగతుల వారికి కావలసిన మౌలికమైన పాఠ్యపుస్తకాలను, డిగ్రీ తరగతులవారికి కావలసిన మౌలికమైన పఠనీయ గ్రంథాలను ప్రచురించడం ప్రముఖస్థానం వహిస్తున్నది. తెలుగును కాలేజిస్థాయిలో బోధనమాధ్యం చేయడం దీనికి ముఖ్యకారణము.

నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ పరీక్షకు రాష్ట్రమంతటా ఒకే పాఠ్యప్రణాళిక, ఒకే పరీక్ష ఉండడానికి అన్ని విద్యాలయాలు సమ్మతించడంతో విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదవడానికి అన్ని విషయాలలోను పుస్తకాలు కావలసి వచ్చినవి. ఈ బృహత్కార్యాన్ని చేపట్టి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌కు కావలసిన 27 పుస్తకాలను, విశ్వవిద్యాలయాల ఆచార్యుల పర్యవేక్షణక్రింద మౌలికంగా వ్రాయించి, పనిప్రారంభించిన సంవత్సరంలోపునే అకాడమి ప్రచురించగలిగినది. రెండవ సంవత్సరానికి కావలసిన 32 పుస్తకాలను పై విధంగానే వ్రాయించి 1970–1972లో అకాడమి వెలువరించినది. ఈ పుస్తకాలలో చాలా పుస్తకాలు తిరిగి ముద్రణాన్ని పొంది అవి విద్యార్థుల, అధ్యాపకుల మన్ననలను పొందినట్లు రుజువుచేసినవి.

ఆదిలో చేపట్టిన పథకము–అంటే ఇంటర్మీడియట్ తరగతి పాఠ్యపుస్తకాల ప్రచురణ–పూర్తి కావడంతో అకాడమి డిగ్రీ తరగతులకు మౌలికమైన పఠనీయ గ్రంథాల ముద్రణాన్ని చేపట్టినది. 1970 లో సమావిష్టులైన విశ్వ విద్యాలయాల ఉపాధ్యక్షుల నిర్ణయానుసారంగా ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగినది. గ్రంథరచనకు ముందు – డిగ్రీ స్థాయిలో విశ్వవిద్యాలయాల కన్నింటికి ఒకే పాఠ్య ప్రణాళిక లేదు గనక–వివిధ విశ్వవిద్యాలయాలలో ఉన్నవిద్యార్థులకు పనికి వచ్చే విధంగా వివిధ విషయాలకు ప్రత్యేకంగా సమాహార ప్రణాళికలను తయారు చేయించవలసి ఉన్నది. ఇందుకోసం–వివిధ విశ్వవిద్యాయాలలోను పోస్టుగ్రాడ్యుయేట్ కేంద్రాలలోను ఉన్న ఆయా శాస్త్ర నిపుణులను, పాఠ్యబోర్డుల అధ్యక్షులను సమావేశ పరిచి; వారు ఆయా విశ్వవిద్యాలయాల పాఠ్యప్రణాళికలను పరిశీలించిన తరవాత, వాటి ఆధారం మీద ప్రతి విషయానికి ఒకసమాహార ప్రణాళికను అకాడమి తయారు చేయించినది. ఈవిధంగా డిగ్రీ తరగతులకు పనికి వచ్చే 21 విషయాలకు సమాహార పాఠ్యప్రణాళికలు తయారయినవి. తరువాత విశ్వవిద్యాలయాల నిపుణులు మౌలికమైన పఠనీయ గ్రంథాలను రచించడానికి అనుభవజ్ఞులైన ప్రిన్సిపాల్‌లను ఆచార్యులను, రీడర్లను, ఉపన్యాసకులను రచయితలుగా, సంపాదకులుగా నిర్ణయించినారు. కొన్ని గ్రంథాలను ఆయాశాస్త్ర నిపుణులే సంపాదకత్వ బాధ్యతను స్వీకరించినారు. ఇందరి సహాయసంపత్తితో గ్రంథ రచన చేయించి మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులలో మొదటి సంవత్సరానికి కావలసిన 78 గ్రంథాలను, వివిధ విషయాలకు సంబంధించిన వాటిని, అకాడమి ప్రచురించగలిగినది. డిగ్రీ కోర్సులలో రెండు మూడు సంవత్సరాలకు కావలసిన 200 గ్రంథాలు అచ్చవుతూ కొన్ని, అచ్చునకు సిద్ధమౌతూ కొన్ని, రచనలో కొన్ని ఉన్నవి.

అనుబంధ పఠనానికి గ్రంథాలు

అనుబంధ పఠనానికి వీలుగా ప్రామాణిక గ్రంథాలను– భారతీయులు వ్రాసినవి, పాశ్చాత్యులు వ్రాసినవి–ఇంగ్లీషులో నుంచి అనువాదం చేయించి ప్రకటించే కార్యక్రమాన్ని కూడా అకాడమి చేపట్టినది. ఈ కార్యక్రమంలో విజ్ఞాన మానవీయశాస్త్రాలకు సంబంధించిన వివిధ గ్రంథాలు ఉన్నవి. అనువాదకులను ఎన్నుకొనే విధానంలో పోటీ పద్ధతిని అకాడమి అనుసరిస్తున్నది. నిర్ణీతమైన విషయాలలో అనువాదానికి తీసుకొన్న పుస్తకాలు ప్రకటించి అనువాదాల పోటీకి పుస్తకంలో నుంచి మొదటి 10 పేజీలు అనువదించి పంపవలసినదిగా ప్రకటన పూర్వకంగా రచయితలను ఆహ్వానించడం జరిగినది. వచ్చిన అనువాదాలలో యోగ్యమైనవి ఆయా భాషలలో నిపుణులైనవారు, భాషానిపుణులు, నిర్ణయించిన వాటిని స్వీకరించి; ఆయా విషయాలలో ఆయా అనువాదాలను పంపిన అనువాదకున్ని, లేదా అనువాదకులకు ఆయా గ్రంథాలను అనువదించడానికి అకాడమి నియమిస్తున్నది. ఈ విధంగా ఇంతవరకు అనువాదం కోసం 19 విషయాలనుంచి 37 గ్రంథాలను ఎన్నుకోవడం జరిగినది. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలలోఉన్న గ్రంథాలను ఈ విధానాన్ని అనుసరించి అనువాదం చేయించడం జరుగుతున్నది.

వివిధ వైజ్ఞానికాంశాలపై ప్రసిద్ధుల రచనలు

పాఠ్యప్రణాళికల ననుసరించి మౌలిక గ్రంథాలను, అనుబంధ పఠనానికి ప్రామాణిక గ్రంథాలను, సంప్రదింపులకు నిఘంటువులను ప్రచురిస్తున్న అకాడమి, వివిధ వైజ్ఞానికాంశాలపై ప్రసిద్ధ శాస్త్రవేత్తలచే మౌలికమైన రచనలు చేయించి ప్రకటించవలెనని సంకల్పించినది. డిగ్రీస్థాయి గ్రంథాల ప్రచురణ పూర్తి

కాగానే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందువల్ల వివిధ విజ్ఞాన విషయాలమీద అధికారికమైన రచనలు తెలుగులో బయలు దేరి తెలుగువారి విజ్ఞానతృష్ణను తీరుస్తాయి.

తెలుగు పత్రిక

వైజ్ఞానిక శాస్త్ర విషయాలలోను మానవీయ శాస్త్ర విషయాలలోను సృజనాత్మక రచనలను ప్రోత్సహించడానికి, తెలుగు ప్రజలలో నవీన విజ్ఞానాన్ని ప్రచారం చేయడానికి, వారికి శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచడానికి, తెలుగు మాధ్యమంగా కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు, చదువు చెప్పుతున్న అధ్యాపకులకు విజ్ఞాన విషయాలను గురించి ఇతోధికంగా తెలుగులో చదువుకోవడానికి వీలుగా అకాడమి 'తెలుగు' అనే పేరుతో త్రైమాసిక వైజ్ఞానిక పత్రికను జనవరి 1972 నుంచి ప్రచురిస్తున్నది. విజ్ఞులు వ్రాసిన వ్యాసాలతో ఈ పత్రిక అందరి ఆదరాన్ని పొందుతూ ఉన్నది.

తెలుగు పరిశోధన సూచిక

తెలుగు భాషావాఙ్మయ సంబంధమైన విషయాలపై మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలోను, ఇతర భారతీయ విశ్వవిద్యాలయాలలోను, పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలోను, ఇతర పరిశోధన సంస్థలలోను పరిశోధన కృషి జరుగుతున్నది. ఇదివరకే పరిశోధన వ్యాసాలను సమర్పించి పట్టభద్రులైన వారి కృషిని, ప్రస్తుతం పరిశోధన పట్టాలను లక్ష్యంగా ఉంచుకొని వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధన సంస్థలలో పరిశోధన చేస్తున్న వారి కృషిని గ్రంథరూపంలో సమీక్షిస్తే అనేక విధాల ప్రయోజనకారి కాగలదన్న నమ్మకంతో తెలుగు అకాడమి, దానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నది. సేకరణ ముగిసిన తరువాత ఇది గ్రంథరూపాన్ని పొందుతుంది.

వైజ్ఞానిక పరిశోధన సూచిక

మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో విజ్ఞాన మానవీయ శాస్త్రాలలో చిరకాలంనుంచి పరిశోధన జరుగుతున్నది. ఆ పరిశోధనలకు సంబంధించిన వివరాలేవీ తెలుగులో లేవు. తెలుగు మాధ్యమంగా నవీన విజ్ఞాన విషయాలను విద్యార్థులు నేర్చుకొంటున్న ఈ రోజులలో విశ్వవిద్యాలయాలలో జరిగిన, జరిగే పరిశోధనల సారాంశమైనా తెలుగులో ఉండి, కుతూహలమున్న వారికి అది అందుబాటులోకి వస్తే బాగుంటుందని ఊహించి, తెలుగు అకాడమి ఆ విషయసేకరణకు సంకల్పించినది. అకాడమి స్థాపితమైన 1968 నుంచి 1972 వరకు [4 సంవత్సరముల కాలము] జరిగిన పరిశోధనల సారాంశాలను సవివరంగా ప్రచురించవలెనని సంకల్పము. విజ్ఞానశాస్త్రములకు సంబంధించిన వివరాలతో ఒక గ్రంథము, మానవీయ శాస్త్రములకు సంబంధించిన వివరాలతో ఒక గ్రంథము వెలువరించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన విషయ వివరణలను సేకరించడం కోసం నిర్ణీత పత్రాను వివిధ విశ్వవిద్యాలయాలకు పంపడం జరుగుతుంది.

ఇంగ్లీషు తెలుగు నిఘంటువు

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ధన సహాయంతో తయారు చేసిన ఇంగ్లీషు-తెలుగు నిఘంటువును నిపుణుల సాయంతో పునః పరిశీలన చేయించి ప్రచురించవలెనని అకాడమి నిర్ణయించుకొన్నది. పునః పరిశీలన కార్యము చురుకుగా సాగుతున్నది ఇది ఒక బృహన్నిఘంటువు.

తెలుగు అకాడమి ప్రచురణ - శైలి

ఇంక అకాడమి ప్రచురణలకు శైలిని గురించి కొంత చెప్పవలసి ఉన్నది. 1965లో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి అధ్యక్షతలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంఘము తెలుగు భాషారచనలో అనుసరించవలసిన శైలివిషయంలో ఉభయ పక్షాల వారికి-అంటే దేశంలో ప్రసిద్ధంగా ఉన్న గ్రాంధిక, వ్యావహారిక భాషావాదులకు అంగీకారయోగ్యంగా ఒక ప్రణాళికను రూపొందించినది. ప్రథమ భాషగా తెలుగు అభ్యసించేటప్పుడు గ్రాంధిక శైలిలో వ్రాసిన పాఠ్యపుస్తకాలను చదువవలెననీ, తక్కిన శాస్త్రాది విషయాలు చదివేటప్పుడు ఆధునిక శైలిలో వ్రాసిన పుస్తకాలు చదువవలెననీ ఆ సంఘం చేసిన సూచనలను ప్రభుత్వం ఆమోదించినది. గ్విన్ కమిటీ కూడా దీనిని బలపరిచినది భారత ప్రభుత్వ ఆదేశము కూడా ఇదే. లక్ష్మీకాంతం కమిటీ సూచనలను దృష్టిలో పెట్టుకొని, తెలుగు అకాడమి నిపుణుల సాయంతో ఆధునిక శైలిని రూపొందించినది. అకాడమి ప్రచురణలో ఈ శైలినే ఉపయోగించడం జరుగుతున్నది.

అకాడమి ప్రచురణకు జాతీయ బహుమానము

నేషనల్ బుక్ట్రస్ట్, ఇండియావారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని, ఆ సంస్థవారు మద్రాసులో నిర్వహించిన నాలుగో జాతీయ పుస్తక ప్రదర్శనలో (డిసెంబరు 1970-జనవరి 1971) అకాడమి పాల్గొన్నది. అక్కడ అకాడమి ప్రచురించిన భౌతిక శాస్త్ర ప్రయోగ దీపిక రెండవ భాగానికి, 1969-70 సంవత్సరాలలో తెలుగులో అచ్చయిన పుస్తకాలన్నింటిలోను శ్రేష్ఠమయినదిగా బహుమానము లభించినది.

1972 మార్చి-ఏప్రిల్లో నేషనల్ బుక్ట్రస్ట్ వారు న్యూఢిల్లీలో జరిపిన అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో కూడా తెలుగు అకాడమి పాల్గొన్నది.

ఇతర కార్యకలాపాలు

నేషనల్ బుక్ట్రస్ట్ వారు ఇంగ్లీషులోను హిందీలోను తాము ప్రకటించిన గ్రంథాలను ఇతర భాషలలోనికి అనువదింప జేయవలెనని ఒక పథకాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. ఆ పుస్తకాలను తెలుగులోనికి అనువదింపజేయడంలో వారికి అకాడమి సాయపడుచున్నది.

గ్రంథాలయ శాస్త్ర పద్ధతిలో ఒక గ్రంథ సూచికను తయారు చేయించి అంతర్జాతీయ పుస్తక సంవత్సరసందర్భంగా ఈ ఏడు ప్రచురించినది. ఈ గ్రంథసూచిక పరిశోధకులకు, పాఠకులకు ప్రచురణ సంస్థలకు గ్రంథాలయాలకు, రచయితలకు చాలా ఉపయోగ పడుతుంది.

గద్య పద్య సంకలనాలు

మొదటితరగతి మొదలు డిగ్రీ స్థాయి వరకు తరగతుల వారీగా ఎంచి కూర్చిన గద్య పద్యాత్మక పాఠ్యాంశాల సంకలనాన్ని తెలుగు అకాడమి తయారు చేయించినది. ఆయా తరగతులకు నిర్ణయించే పాఠ్య విషయాల ప్రమాణాలల్లో అనుపూర్విగా అభివృద్ధి ఉండవలెనన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టి పూర్తి చేయించడం జరిగినది. ఇది విద్యార్థులకు పాఠ్యాంశాను నిర్ణయించేటప్పుడు పనికి వస్తుంది.

ఇంతకు పూర్వమెప్పుడూ కళాశాల తరగతుల స్థాయిలో శాస్త్ర విషయాల బోధన తెలుగులో జరగలేదు గనక: విజ్ఞాన మానవీయ శాస్త్రాలను బోధించే అధ్యాపకులు తెలుగులో బోధించడానికి వీలుగా, వారిని సజ్జీకృతులను చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టడానికి తగినంత ఆత్మవిశ్వాసం వారిలో పెంపొందింప జేయడానికి, పునరభ్యసన కార్య గోష్ఠుల (ఓరియంటేషన్ కోర్సుల) ను తెలుగు అకాడమి ఏర్పాటు చేసినది.

ఈ కార్యగోష్ఠులు రెండు దశలలో జరుగుతాయి. ప్రథమ దశలో కేంద్ర కార్యగోష్ఠి జరుగుతుంది. రాష్ట్రంలో ఉన్న ఒక్కొక్క విశ్వవిద్యాలయ ప్రాంతం నుంచి విషయానికి ముగ్గురు చొప్పున అనుభవజ్ఞులైన ఉపన్యాసకులు తెలుగు అకాడమికి వచ్చి ఈ గోష్ఠిలో పాల్గొంటారు ఈ ఉపన్యాసకులను విశ్వవిద్యాలయాలు పంపుతాయి. రెండోదశలో జరిగే కార్య గోష్ఠులు ప్రాంతీయ కార్యగోష్ఠులు. కేంద్రకార్యగోష్ఠిలో పాల్గొన్న ఉపన్యాసకులు అకాడమి ప్రతినిధులుగా వ్యవహరించి ఆయా విశ్వవిద్యాలయ ప్రాంతాలలో నిర్ణీతాలైన ప్రదేశాలలో సమావేశకులుగా ప్రాంతీయ కార్యగోష్ఠులను నడుపుతారు. కేంద్ర కార్యగోష్ఠులు అకాడమి భవనంలో పది రోజుల పాటు జరుగుతాయి. ప్రాంతీయ కార్యగోష్ఠులలో పాల్గొనడానికి ఉపన్యాసకులను ఆయా కళాశాలధ్యక్షులు విషయానికి ఒక్కొక్కరిని చొప్పున పంపుతారు. ఇంటర్మీడియట్ తరగతులకు తెలుగులో విజ్ఞాన విషయాలను బోధించే అధ్యాపకులకు 1969, 1970–1971 సంవత్సరాలలో రెండు సార్లు ఈ కార్యగోష్ఠులను అకాడమి నిర్వహించినది.

ఈ గోష్ఠులలో పాల్గొనే వారికి తగిన ఉపదేశాలివ్వడానికి ఆయా విషయాలమీద ఉపన్యాసాలివ్వడానికి విశ్వవిద్యాలయాచార్యులను, అనుభవజ్ఞులైన అధ్యాపకులను అకాడమి ఆహ్వానించినది. అకాడమి ఉద్యోగులు కూడా వీటిలో పాల్గొని వీటి సక్రమ నిర్వహణకు తోడ్పడినారు. ఈ రెండు దశల కార్యగోష్ఠులలోను సభ్యులందరిని వారి వారి బోధన విషయాలను తెలుగులో చర్చించి, తెలుగులో వ్యాఖ్యలు వ్రాయడానికి ప్రోత్సహించి అకాడమి ఉద్యోగులు సాయపడినారు. పారిభాషిక పదరూప నిర్ణయంలోను, అనువాద విధానాల చర్చలలోను అకాడమి భాషా నిపుణులు పాల్గొని కార్యగోష్ఠులు సత్ఫలితాలను ఇవ్వడంలో తోడ్పడినారు ప్రాంతీయ గోష్ఠులలో చివరి రెండు రోజులలోను అకాడమి ప్రచురించిన పాఠ్యపుస్తకాలను అధ్యాయాల వారీగా గుణవిమర్శన చేసి విలువలు నిర్ణయించడం జరిగినది ఆయా శాస్త్ర విషయాల పాఠ్యగ్రంథాలలో ఉన్న వ్యాసఘట్టాలను అర్థం చేసుకొని విద్యార్థుల ఉపయోగార్థం తమ భావాలను నిష్కర్షగా, నిశితంగా ఆవిష్కరించడానికి తగిన శిక్షణ అధ్యాపకులకు లభించినది. 1969 లో ఇంటర్మీడియట్ తరగతులకు పాఠాలు చెప్పే కళాశాలల్లో పాధ్యాయులు 700 మంది ఈ కార్య గోష్ఠులలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ కేంద్రాలకు దూరస్థమైన కళాశాలల ఉపన్యాసకులకు: ఆయా శాస్త్ర విషయాలలో నిగూఢాలు, కఠినాలు అయిన పరిభాషికా భాగాలను సుబోధకం చేయడానికి అనుభవజ్ఞులచేత, విశ్వవిద్యాలయాల ఆచార్యులచేత ఈ కార్యగోష్ఠులలో ఉపన్యాసాలు ఇప్పించడం జరగడం వల్ల ఉపాధ్యాయులకు మేలైనది.

1970–1971 సంవత్సరంలో ప్రాంతీయ కార్యగోష్ఠుల కేంద్రాల సంఖ్యను తగ్గిస్తే విశేష శ్రద్ధ వహించడానికి ఎక్కువ అవకాశ ముంటుందనితోచి, విశ్వవిద్యాలయాలను సంప్రదించి మొదట ప్రతి విశ్వవిద్యాలయ కేంద్రంలోను, ప్రతి పోస్టు గ్రాడ్యుయేట్ కేంద్రంలోను మాత్రమే ప్రాంతీయ కార్యగోష్ఠులను ఏర్పాటు చేయడం జరిగింది. ఆశించినట్లే ఇవి విశేష ఫలప్రదాలైనవి. వీటిలో పాల్గొన్నవారి సంఖ్య 580.

డిగ్రీస్థాయిలో కూడా తెలుగు బోధన మాధ్యమంకావడం తోడనే, ఈ సంవత్సరం డిగ్రీ తరగతి ఉపాధ్యాయులకు కూడా ఈ కార్యగోష్ఠులు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ మారు కేంద్ర కార్యగోష్ఠులలో 103 మంది: ప్రాంతీయ కార్యగోష్ఠులలో 913 మంది పాల్గొన్నారు.

ఈ అన్ని కార్యగోష్ఠులలోను పాల్గొన్నవారు అకాడమి ప్రచురణల విషయమై చేసిన సూచనలను పరిశీలించి, ఉచితమైన వాటిని గ్రంథపునర్ముద్రణమున అకాడమి ఉపయోగించుకొన్నది. ఈ విధంగా పునరభ్యసన కార్యగోష్ఠులు అందరికి ఫలప్రదాలైనవి.

తెలుగు భాషా బోధన

తెలుగు నేర్చుకోవలెననే కుతూహలమున్న తెలుగు మాతృభాషకాని వయోవిద్యావంతులకు తెలుగు అకాడమి రెండు విధాలైన తరగతులను ఏర్పాటు చేసినది. వీటిలో ఒక తరగతిని 1969 లో అకాడమి నడిపినది. కొంత మంది ఉన్నతోద్యోగులు ఆ తరగతికి హాజరైనారు. ప్రస్తుతం, తెలుగు అక్షరాభ్యాసంతో ఆరంభించవలసిన వారికి 8 వారాల కోర్సు ఒకటి మే నెల నుంచి జరుగుతున్నది. వారానికి మూడు రోజులు, రోజుకు (సాయంకాలం 6 మొదలు 8 గంటల వరకు) రెండు గంటల చొప్పున ఇది జరుగుతున్నది. తెలుగు కొంత వచ్చి, దానిలో నిశితమైన పరిజ్ఞానాన్ని ఆపేక్షించే వారికోసం ఏర్పాటయిన 6 నెలల కోర్సు త్వరలోనే

ప్రారంభం కాబోతున్నది. తెలుగు నేర్చుకోవడానికి ఎక్కువ మంది ఉత్సాహాన్ని చూపుతున్నారు. ఇతర భాషలు మాటాడే ప్రభుత్వోద్యోగులు చాలామంది తెలుగు నేర్చుకోవడం ముదావహము.

భాషా ప్రయోగ శాల

ఆధునిక శాస్త్రపద్ధతిలో తెలుగు బోధనకు పరిశోధనకు అనువుగా ఉండే భాషా ప్రయోగశాలను, అకాడమి అవసరాలకు తగినట్లుగా స్థాపించుకోవలెనని తెలుగు అకాడమి కృషిచేస్తున్నది. అనతి కాలంలోనే దీనిస్థాపన జరుగుతుందని ఆశ.

ఇతర ద్రావిడ భాషల బోధన

తెలుగు భాషా సాహిత్యాలలో కృషిచేసే వారికి సోదర ద్రావిడ భాషల పరిజ్ఞాన మావశ్యకం గనుక, అవినేర్చుకోవలెననే కుతూహలమున్న తెలుగు విద్యా వంతులకోసం ఆ భాషల బోధన అకాడమిలో చేయించవలెనని తెలుగు అకాడమి సంకల్పించినది. ఈ పని జాతీయైక్యానికి ఎంతగానో ఉపకరిస్తుంది. ముందుగా తమిళ కన్నడ భాషల బోధన ప్రారంభించవలెననే దృష్టితో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆ భాషలు బోధిస్తున్న ఆచార్యుల సహాలను గ్రహించి, అకాడమి వాటి బోధనకు తరగతులు ఏర్పాటు చేయబోతున్నది. త్వరలో వీటి నిర్వహణ ప్రారంభమవుతుంది.

ఉపగతి వారీగా వాచకాల రచన

తెలుగును ద్వితీయ భాషగా అభ్యసించే తెలుగు మాతృభాషకాని వయోజనులకు, బాలబాలికలకు ఆనుపూర్విగా భాషా వాచకాలు తయారు చేయించవలెనని అకాడమి సంకల్పించినది. అనతి కాలంలో ఇది కార్యరూపాన్ని పొందుతుంది.

అనువాదకులకు శిక్షణ

నవీన విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకరావడానికి జరుగుతున్న కృషిలో అనువాదకునిది విశిష్టమైనపాత్ర. ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో శిక్షణఇచ్చి మంచి అనువాదకులను తయారుచేయడానికి అకాడమి సంకల్పించినది. రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలలోను తదితర సంస్థలలోను అనువాద సరళి ఏవిధంగా ఉన్నదో తెలుసుకోవడానికి పరిశీలన జరుగుతున్నది. ఫలితాల ననుసరించి ఈ పథకానికి రూపకల్పన జరుగుతుంది.

బ్రిడ్జి కోర్స్

హైస్కూల్ విడిచి కాలేజిలో తెలుగు మాధ్యమం ద్వారా ఇంటర్మీడియట్ చదవడానికి చేరిన విద్యార్థులలో తెలుగుభాషా నైపుణ్యాన్ని పెంచవలెననే దృష్టితో, హైస్కూల్ కాలేజిలమధ్య వారధివలె పని చేయవలెననే భావంతో బ్రిడ్జి కోర్స్‌ను అకాడమి రూపొందించినది. నవీన విజ్ఞానాన్ని విద్యార్థులు తెలుగు మాధ్యమంలో నేర్చుకొనేటప్పుడు పరిభాషతోపాటు, సరళమైన తెలుగు వాక్య నిర్మాణాన్ని కూడా విద్యార్థులు సాధించవలెను. ఇందుకోసం, విజ్ఞాన మానవీయశాస్త్రాలను ప్రాతిపదికగా పెట్టుకొని, కళాశాలాధ్యాపకులు అకాడమి నిపుణులు కలిసి 48 పాఠాలను తయారు చేసినారు. రోజునకు నాలుగు గంటల చొప్పున, ఈ కోర్సు 12 రోజులలో అధ్యాపకులు బోధిస్తారు. ఏ రోజుకారోజు పాఠమయిపోయిన వెంటనే; ఆ పాఠం మీద విషయానికి సంబంధించిన, భాషకు సంబంధించిన ప్రశ్నలలో పరీక్ష ఉంటుంది. ఆ పరీక్ష ఫలితాలను మరునాడు అధ్యాపకులు విద్యార్థులకు చెప్పి వారివారి లోపాలను సరిచేస్తారు. భావ వ్యక్తీకరణ విషయంలో, ఉచితపద ప్రయోగం విషయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. పునరభ్యసన కార్యగోష్ఠులద్వారా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చినట్లే, ఈ కోర్సుద్వారా విద్యార్థులకు శిక్షణ ఈయవలెనని అకాడమి సంకల్పము. కోర్సు ప్రారంభానికి పూర్వమూ, కోర్సు ముగిసిన తరువాతా ఉన్న పరీక్షలవల్ల విద్యార్థులు పొందిన లాభాన్ని గ్రహించడానికి వీలవుతుంది. ప్రప్రథమంగా హైదరాబాదులో తెలుగు మాధ్యమంలో బోధిస్తూవున్న న్యూసైన్స్ కాలేజీ, నానక్‌రామ్ భగవాన్‌దాస్ సైన్స్ కాలేజీలను ఎన్నుకొని ప్రయోగాత్మకంగా ఈ ఏడు ఈ కోర్సును ఆ కాలేజిలలో నిర్వహించవలెనని అకాడమి నిర్ణయించినది ఇది విశేష ఫలప్రదమైతే, దేశవ్యాప్తంగా దీనిని అనుసరించవచ్చు.

బాలబాలికల శబ్ద సంపద పరిశీలన

మంచి పుస్తకాలుంటే చదువు తొందరగా చక్కగా వస్తుంది. ఇది చిన్నపిల్లల విషయంలో పరమసత్యము. చిన్నపిల్లల శబ్ద సంపదను పరిశీలించి తదనుగుణమైన మాటలతో వాచకాలలో పాఠాలుంటే వారు ఉత్సాహంగా చదువుకొంటారు. ఇందుకోసం, ఒకటి మొదలు ఏడవ తరగతి వరకు మన పాఠశాలలలో చదువుకొంటూ ఉన్న బాలబాలికల శబ్ద సంపదను శాస్త్రీయంగా పరిశీలించడానికి ఒక కార్యక్రమాన్ని తెలుగు అకాడమి రూపొందించినది. ప్రభుత్వ విద్యాశాఖకు అకాడమికి చెందిన భాషా నిపుణులసాయంతో ఒక ప్రశ్నావళిని తయారుచేసినది. ఈ పరిశీలనకు కార్యక్షేత్రాలుగా వరంగల్లు, కర్నూలు, గుంటూరు జిల్లాలను ఎంచుకోవడం జరిగింది. తెలుగునకున్న విశిష్టమైన మూడు మాండలికాలున్న ప్రాంతాలలోనివి ఈ జిల్లాలు. ఈ జిల్లాలలో ఇంచుమించుగా 70 స్కూళ్లలో ఒకటి మొదలు ఏడవ తరగతివరకు చదువుతున్న విద్యార్థులు అకాడమి ప్రశ్నావళికి సమాధానాలు చెప్పగా అధ్యాపకులు వాటిని యథాతథంగా వ్రాసుకొని అకాడమికి వాటిని పంపుతారు. ప్రతి క్లాసులో ఉన్న విద్యార్థి తన తరగతి స్థాయిలో ఉన్న ప్రశ్నావళికి సమాధానాలు చెప్పుతాడు. ప్రతి విద్యార్థికి ఒక ప్రశ్నావళి ప్రతి కేటాయించి ఉంటుంది. మొత్తం విద్యార్థులు 10,000 మంది ఉండవచ్చుననుకుంటే, ఇంచుమించుగా 16 లక్షల మాటలు వ్రాసిపంపడం జరుగుతుంది. అకాడమిలో నిపుణులు వీటిని వ్యాకరించి చూచి శబ్దపౌనఃపున్యాన్ని పరిశీలించి తరగతి వారిగా బాలబాలికల శబ్ద

(తరువాయి 46వ పుటలో)

చెల్లాయికి ఒక ఉత్తరం

సుధామ

నీ జీవితాన్నొక ఆటగా తలచి
నిన్నొక బొమ్మగా మలచి
యంత్రయుగపు నాగరికతతో బలసి
కన్నీళ్ళను మాత్రమే మిగిల్చి
రక్తాన్ని సైతం త్రాగేస్తున్న
దానవ మానవ చరిత్ర పుటలను
తిరిగి తిరిగి చదువుతూ
వెక్కి వెక్కి ఏడ్పులను నొక్కుతూ;
నేను బ్రతుకుతున్నాను చెల్లీ.
మనస్సు అమ్ముడు పోయిన మల్లీ.

అక్కడ నీకు నచ్చని కనకాంబరాలు
పూలు పిల్లలుగా కొల్లలు.
ఇక్కడ నీ వదినెకి
ఒక్క గులాబీ అయినా లేదు.
ఆమె కళ్ళు కాయలు కాచాయిగానీ
కడుపున ఒక్కటీ కాయలేదు.
ఆమె నాటిన గులాబీ మొక్క
మొగ్గయినా తొడగలేదు.

నీ ఇంట గులాబీలను ధిక్కరించి
కనుకాంబరాలు పూస్తున్నాయని,
కానీ కేవలం గడ్డిపూలను తలపిస్తున్నాయని,
నీవు రాసిన ఉత్తరం
ఎదలో ప్రతివాక్యాన్నీ ముద్రించి వుంచింది.

ఎన్ని పూలు పూస్తున్నాయి చెల్లీ—
నీ వదినెలో అసూయ పూలు పూయిస్తూ
కానీ దానికేం తెలుసు తల్లీ!
ఆ పూలు మొక్కని క్రుంగ దీస్తాయని,
ఒకనాటికి అసలుకే ఎసరు పెడతాయని,
దానికేం తెలుసు తల్లీ.

నీ పిల్లలకు అంకెలే తప్ప పేర్లులేవు.
పంచుకోడానికి
దారిద్ర్యంలో తప్ప షేర్లులేవు.
భవిత భారత భాగ్యోదయానికి
కాంతి కిరణాల్లా వారు కనబడరు.
నీ కళ్ళకాటుక
వాళ్ళ జీవితాన్ని నిర్వచిస్తుంది.

ఒకప్పుడు నీకోసం
కలలనూ, కన్నీళ్ళనూ సమానంగా వెచ్చించే
నాబావ ఏం చేస్తున్నాడమ్మా?

దానవ మానవ చరిత్ర పుటల
మెట్లు ఎక్కి పోతున్నాడెందుకమ్మా?
ఆ దారి తప్పిన బాటసారిపై
జాలికన్నా క్రోధమే ఉద్భవిస్తోందే!
నీపై అధికారం చేసే మనిషి
నీ హృదయం గాజుపాత్రను ప్రక్కలుచేసి
నందనాన్ని వందుల దొడ్డి చేసి
ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో కదా!

నీ కథకు ఏడ్వనా?
నీ వదిన వ్యథకు ఏడ్వనా?
నువ్వేదో బంగారు చెంచాను
నోట పెట్టుకు పుట్టావని,
గతంలో ఎన్ని నోములో పట్టావని
నీ పుణ్యం పిల్లలుగా
నీ కడుపునే ఉద్భవించి;
ఇవాళ మీ నట్టింట వేణువు ల్నాదుతోందని,
ఆమె భావన.
నాదం పెరగాలని నీకు దీవెన

కానీ తల్లీ
నీ బాధ నాకు తెలుసు చెల్లీ
అపరమిత కుటుంబం వేణుగానం కాదనీ,
చీకట్లో కీచురాళ్ళ మ్రోతనీ,
అది పుణ్యం కాదనీ,
పునాదులనే బలహీనం చేసేస్తుందనీ,
పూలకు బదులు ముళ్ళనే
కిరీటాలుచేసి జీవితాలకు పెడుతుందనీ,
నాకు అంతా తెలుసు చిన్నారీ!
నీ చరిత్రే చెప్పిందినాకు చితికిపోయిన నారీ,

కళ్ళకన్నా హృదయం లోతెక్కువ.
మోదం కన్నా బాధ బరువెక్కువ
అందుకే ఆనందం కళ్ళకుకడితే
బాధ హృదయాన్నే తడుతుంది.
ఇంకా ఏంరాయను చెల్లీ?
బరువెక్కిన హృదయం గాయం
ఎలా కడగను తల్లీ?
నీకు సానుభూతి చెప్పమంటావా?
ఓదార్పు పలక మంటావా!
నీకథనం వదినెకు తెల్పమంటావా!
నీ జీవితాన్ని పణంపెట్టి
కొన్ని జీవితాలకైనా ఆదర్శాన్నీ, ఉదాహృతినీ
మిగిల్చి పోతానంటావా!
వద్దు చెల్లీ అంతమాటనకు.

నువ్వుండగానే
ఇంత వేదనా గరళనాన్ని మ్రింగుతున్నానే,
నువ్వేలేకుంటే, పువ్వేలేకుంటే,
ఇంకెలాగమ్మా!
వస్తున్నానమ్మా
బయలుదేరి వస్తున్నాను.
ఆకులు తాకే రోజులేఅయినా
కాలం యింకా మించిపోలేదు.
ఇక నీయింట మరో పువ్వు పుట్టనియ్యను.
నేల సారాన్నే హరించే
ఎన్నెన్నో పూలు వద్దువద్దు,
బావను దారికి మళ్ళిస్తాను.
బాధ్యతల నుండి పారిపోయే పిరికిని
సవ్యంగా దిద్దిస్తాను.

ఇప్పుడిప్పుడే నీ వదినె గ్రహిస్తోంది.
మా ప్రక్కయింటి, నీ జీవితంలాంటి
ఛాయను గమనిస్తోంది.
చింతలులేని కుటుంబ ప్రణాళికను
గమనిస్తూ పరికిస్తోంది
ఆమె పెంచుతున్న మొక్కకు
వెగటయ్యే సంఖ్యలో పూలు వద్దుట
గులాబీలు రెండుమూడు చాలుట
నందనం అందులోనే ఉంటుందట.
నీ చరిత్ర పునాదులపై
నవ్యజీవిత చరిత్రలు విప్పుకోనీ
చరిత్రలు ఎన్నివున్నా
సారాలు వేసారనీయని రీతిలోవుండనీ

ఈ ఉత్తరం నీకు చేరేసరికి
నవ ఉషస్సు ఉదయిస్తుందనీ,
మొగ్గ తొడుగుతుందనీ,
వేణుగాన లహరిలో
వేదన మాయమవుతుందనీ; నాకు తెలుసు.
ఇద్దరూలేక ముగ్గురి వలని
స్వర్గతుల్య జీవితం అందరికీ తెలుపు.

తెలుగు సాహిత్య సమీక్ష 1971

తిరుమల రామచంద్ర

[గత సంచిక తరువాయి]

2. నవల

నవల నేడు ప్రాచీన మహాకావ్యాలను తోసిరాజన్నదని ఇదివరకే అన్నాను. సమాజంలోని ఆటుపోట్లు సమకాలీన సాహిత్యంలో ప్రతిబింబించడం పరిపాటి అయినప్పుడు, సాహిత్య ప్రక్రియలలో ప్రధానంగా పీటవేసుకొన్న నవలలో ప్రతిఫలించక పోవడం ఎట్లా? కాని హేతువాదయుగం వచ్చేసరికి ప్రాచీన ప్రబంధ ఫక్కీ, అలంకారధోరణి కవితలోంచి మాయమై పోయినట్టు, నవల నుంచి కూడ విస్తృతి, కల్పనాత్మక, చమత్కారాత్యాత్మక పద్ధతిపోయి, ఆధునికావసరాలకు అనుగుణమైన రూపు ఏర్పడుతూ వచ్చింది. కనుకనే మాలపల్లి, వేయి పడగలు, నారాయణరావు వంటి నవలలు ఇప్పుడు ఎక్కువగా రావడంలేదు. ఆయా చారిత్రిక ఘట్టాల ప్రాధాన్యాన్నిబట్టి ఆ నవలలు ప్రాచుర్యం పొందాయి కాని ఇప్పటి యంత్రయుగంలో, పారిశ్రామిక సంస్కృతిలో ఆటువంటి విస్తృత నవలలు జనాదరంపొందే అవకాశంలేదు.

అంతేకాక పాఠకుల సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతూ ఉండడంవల్ల రచనలో సరళత, పాఠకులను అధికంగా ఆకర్షించే ఒడుపూ అనివార్యాలయ్యాయి. మేధాజీవులను, ఉన్నత విద్యావంతులను మాత్రమేకాక రాశిమీద పాఠకులను ఆకర్షించే నవలలు, కథలు బహుళ సంఖ్యలో వెలువడుతూవుండడం, గృహ జీవనం వస్తువుగా రచయిత్రీమణులు కోకొల్లలుగా నవలలను, కథలను అల్లిపారేయడం గమనించదగ్గది. అయితే ఇలాటి రచనలకు విసుగుపుట్టి, ఆలోచనాపరులు కొత్త కోసం కొన్ని ప్రయోగాలు చేయడం, ఇది క్రమంగా Content కన్నా Form కు ప్రాధాన్యం ఇచ్చే విధంగా పరిణమించడం, కవితలో కొట్టవచ్చినట్టు కనబడే ఈ ధోరణి కథలు, నవలలలోను చొరబడడం, చైతన్య స్రవంతిని చిత్రించడం, దైనందిన సాంసారిక జీవిత చిత్రణకు విసిగి వేసారిన పాఠకుల మనస్సును గ్రహించారా అన్నట్టు కొందరు విచిత్రమైన సాంకేతిక ప్రయోగాలు చేయగా, మరి కొందరు ఆరోగ్యకరమైన ప్రయోగాలు చేయడం మొదలయినవి 1971లో తలయెత్తి పాఠకుల తలలాడించిన కొత్త ధోరణులనవచ్చు. వీటిని పరిశీలిద్దాం.

చైతన్య స్రవంతి

చైతన్య స్రవంతి అనే పద్ధతి మన వేదాంతుల దృష్టిలో స్వప్నాన్ని కూడా నిజానుభూతిలో భావించే మన తత్త్వవేత్తల దృష్టిలో ఏ విభాగానికి వస్తుందో కాని, లౌకిక దృష్టికి, చాక్షుష ప్రజ్ఞకు విచిత్రంగానే కనిపించి, ఇది ఇంత త్వరగా ఇంత స్వల్ప పరిధిలో జరగడం సంభవమా అనిపిస్తుంది. కాని, దీని ప్రవర్తకుల వాదమేమంటే "మనకు స్వప్నంలో కొన్ని అనుభవాలు కలుగుతాయి. కొన్ని శతాబ్దాల విషయాలు పది నిమిషాల స్వప్నంలో ఎలా అనుభూతికి వస్తాయి? ఈ విచిత్రమేమిటి? కనుక రచనలోను ఈ త్వరితగతి విడూరంకాదు" అని. దీనికి పాశ్చాత్య దేశాలలో హెచ్చుగా ప్రవర్తకులు జేమ్స్ జాయ్స్, వర్జీనియా ఉల్ఫ్ మొదులయినవారు.

ఈ చైతన్య స్రవంతిని మన రచయితలూ ప్రయోగిస్తున్నారు, తమ రచనలలో. ఇటీవలి కాలంలో ఈ ధోరణితో వెలువడిన నవలలో గణనీయమైనది "అంపశయ్య". రచయిత శ్రీ నవీన్. ఒక హాస్పిటల్లోని విద్యార్థికి 24 గంటలలో కలిగిన భావపరంపర చిత్రించబడింది. విద్యార్థి గ్రామీణుడైన రైతు, చైతన్య స్రవంతి చిత్రణకు కావలసినవి, ముఖ్యమైనవి కాలదేశాలు. కాని, నవీన్ పరిధి పరిమితి చాలచిన్నది కావడంవల్ల చైతన్యస్రవంతి స్రవంతిగా ప్రవర్తించడానికి తగినంత స్థలం, సమయం లేకపోయాయను కుంటాను. కాని, ప్రయోగం గొప్పది.

సాంకేతికత (Symbolic Trend)

కవితలో తలఎత్తిన సాంకేతికత, అస్పష్టత అంతగా కాక పోయినా కొంతకు కొంతయినా, నవలలలోనూ కథలలోను వచ్చింది. Content కంటె form కే ప్రాధాన్యమిచ్చి పని తనం చూపుదామనే వైఖరీ హెచ్చింది. ఈ సాంకేతికతకు ఉదాహరణంగా శ్రీ వినుకొండ నాగరాజా 'ఊబిలో దున్నను' పేర్కొనవచ్చు. ఊబిలోకూరుకుని పోయిన దున్నను యజమాని లేవదీయడమే దీనిలో కథావస్తువు వాళ్లిద్దరే పాత్రలు. కథంతా ఈ రెండు పాత్రల చుట్టూ నడుస్తుంది దున్నపోతు ప్రజాస్వామ్యా నికి సంకేతం. అది ఊబిలో కూరుకుపోవడం ప్రజాస్వామం దుర్గతిలో వుందని సంకేతించి సామాజిక సమకాలీన స్థితిగతులను వ్యంగ్య ధోరణిలో పరామర్శించడం ఈ నవల సాధించిన విషయం.

ఈ సాంకేతికతకు కొంత వంగ్యం, హాస్యం మిళాయించి నడిచినట్టిది పాలగుమ్మి పద్మరాజుగారి రామరాజ్యానికి రహదారి. ఈ పేరును బట్టే సమకాలీనత, వంగ్యమూ, విషాదమూ మిళిత మయి ఉన్నాయని గ్రహించవచ్చు.

సాంఘిక చైతన్యం

పలువురు మహిళలు వ్రాసిన నవలలు ఈ సంవత్సరం వచ్చాయి. పత్రికలలో ధారావాహికంగాను ప్రచురితమయాయి. కాని స్త్రీల సమస్యలను నిర్దిష్టంగా చర్చించినవి అంత ప్రముఖంగా రాలేదనే అనాలి. వారికి సంఘంలోగల స్థానం, చైతన్యం ఎందుకు అవసరం, ఆ సంఘ చైతన్యం ఎలావస్తుందని కచ్చి తంగా చర్చించిన రచయిత్రీమణులు చాల తక్కువ.

ఎద్దనపూడి సులోచనారాణి ఎప్పటిలాగే ఈ సంవత్సరమూ, 'జీవనతరంగాలు' రెండు భాగాలతో పాఠకలోకాన్ని ముంచెత్తింది. రచన మెలోడ్రమెటిక్. అక్కడక్కడ రాజకీయాలమీద విసుర్లు కేవలం సంసారపక్షం. మరికొందరు సుప్రసిద్ధ రచయిత్రీ మణు లవీ అంతే. వారు—శ్రీమతి ఆనందారామం వంటి వారు తెలుగు గృహస్థ జీవితానికి—ముఖ్యంగా లోయర్ మిడిల్ తరగతి గృహస్థ జీవితానికి—సాదు చేయడంకన్నా పైకిపోలేదు. సినిమా కథలలాగే ఉంటాయి హెచ్చుగా.

కాని, ఈ సాధారణ పరిస్థితిని చీల్చుకొని సంఘ చైతన్యాన్ని చిత్రించిన నవలలు కొన్ని ముందుకు తోసుకొని వచ్చాయి. వీటిలో మొదటిది శ్రీ దాశరధి రంగాచార్యులుగారి "మోదుగుపూలు".

రంగాచార్యులుగారు తెలంగాణావాడు, తెలంగాణాను కర తలామలకంగా ఎరిగినవాడు. స్వాతంత్ర్యానికి ముందు నిజాం ప్రభుత్వం ఉద్యోగులు ప్రజలపై చేస్తూన్న దౌర్జన్యాలు. వాటిని ప్రజలు సంఘ చైతన్యంతో ఎదుర్కోవడం, తెలంగాణాలోని అనాది జాతులవారు కూడ ఈ సంఘ విమోచన సమరంలో తోడ్పడడం ఈ నవల ప్రధానేతి వృత్తం. పాత్రోచితమైన మాండ లిక భాషను రచయిత ఎంతో మొలకువతో వాడాడు.

రెండవది బీనాదేవిగారి "Hang me Quick" అన్నది. దీనికి "పుణ్యభూమీ కళ్లుతెరు" అని నామాంతరం. వర్గ కలహాలు, అధికారుల దోపిడి, కన్వెన్షనల్ లా వల్ల కలుగు తున్న చిక్కులు. చక్కగా చిత్రించ బడ్డాయి దీనిలో.

మూడవది శ్రీ బలివాడ కాంతారావుగారి "సంపంగి". ఈయన వెనుకటి సంవత్సరం 'పుణ్యభూమి' అనే నవలలో ట్రావె లోగ్ పద్ధతి అనుసరించి ఏకవ్యక్తి కథనంతో కథ నడిపించి సెబాస్ అనిపించుకొన్నారు. ఈ సంవత్సరం సంపంగిలో గ్రామీణ జీవితాన్ని చిత్రించారు. అసదృశంగా లోకానుశీలనం పాత్రల మానస ప్రవృత్తుల వెనుక నిలిచి విశ్లేషణ, వాస్తవిక దృక్పథం, పాత్రల పట్ల పక్షపాతం లేని సానుభూతి, సంప్రదాయం పట్ల అభిమానం, మంచి మార్పుల పట్ల స్వాగత హస్తాంతో ఎదురు వెళ్లడం కాంతారావు రచనలోని గుణాలు కొన్ని.

నాలుగవది కుమారి వాసిరెడ్డి సీతాదేవిగారి "సమత". దీనికి ఆంధ్రప్రదేశ్ అకాడమీ 1971 బహుమతీ లభించింది. సీతాదేవి గారు సాంసారిక పరిధిలోనే గుడుగుడు గుంచం ఆడక, దానినుంచి వెలువడిన సంఘచైతన్య దృష్టితో ఈ నవల సృష్టించారు. స్త్రీల నిజమైన కష్టాలు ఈమె చిత్రించారు. రాజకీయ పెత్తందార్లను (పొలిటికల్ బొసస్) ఆశ్రయించుకొన్న మహిళలు పొందే సహా యాలు, వారి అవసరాలు తీరిన తర్వాత వారుపడే బాధలు స్త్రీ జనంలో తద్వారా కలిగిన చైతన్యం—ఇవన్నీ దీనిలో చిత్రితాలు.

చారిత్రిక నవలలు కూడా వచ్చాయి. వాటిలో పేర్కొన దగింది శ్రీ కొండూరి వీరరాఘవాచార్యగారి "లేపాక్షి". అనంత పురం జిల్లాలోని సుప్రసిద్ధ కళాక్షేత్రమైన లేపాక్షి కేంద్రంగా అల్లిన నవల యిది.

ఏమైనా, ఒక్కటి తలచుకొన్నప్పుడు మాత్రం మనస్సు చివుక్కు మంటుంది. తెలుగు నవల నూరేండ్ల పండుగ ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ యాజమాన్యాన హైదరాబాదు నగ రంలో జరిగినప్పుడు, గవర్నర్ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు ప్రసంగిస్తూ, ప్రపంచం సంగతి అలావుండగా, దేశమన్నా—భారత దేశమన్నా—దిగ్భ్రమ చెంది, చకితమయ్యే నవల ఒక్కటైనా, తెలుగులో ఈ నూరేళ్లలో వచ్చిందా?" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న ప్రశ్నగానే మిగిలింది.

(3) కథానిక

కథానికకు ఉన్నంత ప్రాముఖ్యం తెలుగులో మరేసాహిత్య ప్రక్రియకూ లేదంటే అసత్యంకాదు. కథానిక దాదాపు వంద సంవత్సరాలుగా మంచిదారినే నడుస్తూంది. న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ (Newyork Herald Tribune) నిర్వహించిన అంతర్జాతీయ కథానికల పోటీలో శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన' (Cyclone) ద్వితీయ బహుమతి పొందడంతో మన కథానికకు ప్రపంచపరిగణన కలిగింది: ఆస్థాయిని నిలబెట్టుకుంటూనే ఉందనీ అనవచ్చు.

రచయితలూ, పాఠకులూ, వీరిద్దరినీ ప్రోత్సహించే వివిధ రాజకీయ విధానాలు అనుసరించే పత్రికలూ క్షణం విజృంభించడం వల్ల కథానికల సంఖ్యా వేలమీద పెరుగుతూఉంది. కనీసం సంవత్సరానికి రెండువేల కథానికలైనా ప్రచురింపబడుతున్నాయి, దిన వార పక్షమాస సంవత్సర పత్రికల మూలంగా.

కథానిక ఇంత విస్తరించడం వల్ల వివిధ ప్రయోగాలకూ ఆస్కారం ఉండడం, సర్జనశీలమయిన శాఖలకన్నిటికీ మూలకందమైన కవితలో పొడసూపిన రీతులు కథానికలోను తలఎత్తడం సహజం. అందులోను 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పడినప్పుడు అలాంటి ధోరణులు సహజాతి సహజం. కేవలం శిల్పం కోసం, కేవలం ఈ వస్తువుకోసం, కేవలం సిద్ధాంతంకోసం రచితమైన కథానికలు అసంఖ్యాకం. ఇక ఉబుసుపోక కథలు, సాంసారికపు గానుగెద్దు కథలూ చెప్పనక్కరలేదు. వైశాఖమాసం వడగాలికి రాలే మామిడి కాయలలాగ కుప్పలు తెప్పలు. అయినా ఈ సంవత్సరం గొప్ప కథలను కథానికా గుచ్ఛాలను నా దృష్టిలో యావద్భారత స్థాయినే కాక ప్రపంచ స్థాయినే అందుకొన్న వాటిని కానుక ఇచ్చింది, ఆంధ్రావళికి. వీటిలో సంఘ చైతన్యం, వ్యంగ్యం, ప్రధానమైనవి. మాత్రం స్థాలీపులాకన్యాయంగా చెబితే చాలు మనకథానిక ఎంత ఏనుగు నడకలు నడుస్తున్నదో, ఎంత నగిషీలతో మెరుపు తీగై పైకి ప్రాకి పోతున్నదో తెలుస్తుంది.

సంఘ చైతన్యం

సామాజిక సమస్యల ఎడల, సామాజిక అవగాహన ఎడల రచయితలకు గురుతరమైన బాధ్యత ఉండాలని కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడిఉండాలని 'హోరు' "ఇప్పుడువీస్తున్నగాలి" అనే కథానిక సంపుటాలు నినదిస్తున్నాయి. రెండవదానిని విప్లవ రచయితల సంఘం నెల్లూరు ప్రచురించింది. దీనిలో ప్రముఖ కథానిక రచయితలు రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొడవటిగంటివంటివారు దిగంబర కవులు మాత్రమే కాక తదితరులు పలువురు కథలు వ్రాశారు. కొన్ని కథానికలలో రచనాశిల్పం కన్నా విప్లవోద్వేగం హెచ్చుగా, నిర్దిష్ట లక్ష్యంతో ఉన్నవి గనుక ప్రశంసనీయాలే. శ్రీకాళీపట్నం రామారావు ఎప్పుడో గాని రాయడు. కాని. వ్రాశాడా ఒక ఉద్దేశంతో హృదయంలో నాటేలాగ వ్రాస్తాడు ఈ సంవత్సరం ప్రచురించిన ఆయన యజ్ఞం కథల సంపుటి ఉత్తమ కథల సంపుటిలో ఒకటి.

శ్రీమతి కల్యాణ సుందరీ జగన్నాథ్ కలం పడితే కళావిలాసం కురిపిస్తుంది. ఈమె వ్రాసిన "అలరాసపుట్టిల్లు" వంటి కథలు కథానికా శిల్పరీతులకు లక్షణ గ్రంథాలనినా అభిప్రాయం. ఈ సంవత్సరం ఎనిమిది కథలలో వెలువడిన "పున్నమి మసకలు" సంపుటి గ్రామీణ, పట్టణ సంఘాల ప్రేమకథలను అపూర్వ వివేచనా దృష్టితో. రచనా వైభవంతో చిత్రిస్తూ ఈమె వ్యక్తిత్వానికి మరింత వన్నె తెచ్చింది.

శ్రీమతి ముప్పాళ్ల రంగనాయకమ్మ "పెళ్లానికి ప్రేమలేఖ" పరివారమే కేంద్రంగా, గానుగెద్దులాగా తిరిగే రచయిత్రీ మణులకు కనువిప్పువంటిది. కేవలం వినోదం కోసమో, స్వరచనా ప్రాగల్భ్యం కోసమో వ్రాస్తున్నదికాదు. ఈమె సంఘంలోని దురాగతాలను చూపడం ధైర్యంగా విమర్శించడం ఎలాంటి అనాహూతులనయినా ఎదుర్కొనడం, పైకి "యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః" నారీమణులు గౌరవం పొందేచోటే నారాయణుడుంటాడు. అని పైకి ధర్మపన్నాలు చెబుతూ స్త్రీని బానిసగా ఆసిగా జమకట్టిన మన సంఘం దురాగతాలను దుయ్యబట్టి వాటిని ఎదుర్కొనడానికి ఈమె తన రచనలలో ఇచ్చే ధైర్యం మరే రచయిత్రికీ లేదు. ఈ "పెళ్లానికి ప్రేమ లేఖ" పది పంక్తులు అదాటుగ చదివినా, ఇది రంగనాయకమ్మ రచన సుమా అనిపించే వ్యక్తిత్వంతో నడిచింది.

వ్యంగ్యం ప్రధానం

ఈ సంవత్సరం నాలుగు గొప్ప కథలు వచ్చాయి. అవి భాషాంతరీకరిస్తే ప్రపంచం ఓహో అంటుందనడంలో ఆశ్చర్యం వుండదు. ఈ కథలు వ్రాసిన ముగ్గురు వేలకొలది కథకులలో నుంచి ఆకుల మధ్యనుంచి పైకి తలలెత్తి వచ్చే పూవులలాగ, మబ్బుతెరల నుంచి మెరిసే మెరుపులలాగ, పరిసర ప్రాంతాలనుంచి పైకి ఎగసిన గోపురశిఖరాల లాగ దూసుకొని వచ్చారు. కొత్త వారేమీకారు పాతవారే కాని మర్కొమారు అందరికన్నా ముందుకు వచ్చారు. సంవత్సరమంతా ముందుగానే ఉన్నారు. ఇక మీదఉంటారు. వీరు శ్రీమతి ఆర్. వసుంధరదేవి, శ్రీవాకాటి పాండురంగారావు, శ్రీ మధురాంతకం రాజారాం.

శ్రీమతి వసుంధరాదేవి చదివింది విజ్ఞానశాస్త్రం. చేపట్టింది కథానికా రచన. వ్రాసినప్పుడెల్లా మంచి కథలే వ్రాశారు. కాని ఈ సంవత్సరం ఆమె వ్రాసిన వాటిలో రెండు కథలు రాగమ్మ (భారతి) బదిలీ (సంవత్సరాది సంచిక ఆంధ్రపత్రిక) విశిష్టంగా నిలుస్తాయి. ఈమె రచనలో విశేషం ఉంది. శిల్పం ఉన్నట్టు పైకి కనిపించదు. వ్యంగ్యం, హాస్యం, మరుగున ఉంటాయి. పైకి వట్టి పరిశీలనే కనిపిస్తుంది. విమర్శ పూర్వవృత్తాంతాలలో నడుస్తుంది.

రాగమ్మ ఒక పనిమనిషి సూర్యునికి ముందులేచి, సూర్యుని తర్వాత మేను వాల్చుతుంది. ఆమె నిరీహ, నిజాయితీ, సేవాధర్మ ప్రవణత, సంఘ వ్యవస్థపై ఆమె వ్యాఖ్యలు, కర్మ సిద్ధాంతం ఇవన్నీ నర్మగర్భితంగా ఎంతటి పరిశీలన అనిపిస్తుంది. పాఠకునికి. రాగమ్మ రమ్యమూర్తి మనస్సులో అంకితమౌతుంది. 'బదిలీ'

ఒక ప్రభుత్వోద్యోగి బదిలీకి సంబంధించింది. ఇష్టంలేని చోటుకు బదిలీ అయినప్పుడు దానిని మార్చుకొనడానికి పడేపాట్లు? మన స్తత్వాలు పై అధికారుల ఆశలు ప్రతారణలు, ప్రలోభనలు మార్పయి వెళ్లిన పూరిలో దిగిన యింటిపై అనుమానాలు, అభాండాలు, చివరకు ఇంట్లో జరిగిన దుర్ఘటనలు ఇవన్నీ ఎంత సరళ సుందరంగా చిత్రించారు ఈమె.

శ్రీ వాకాటి పాండురంగరావుగారు ప్రముఖ రచయిత. పత్రికా రచనకోసం పెక్కు ఉద్యోగాలు మానినవాడు. రచననే పూనినవాడు. సహజంగా హాస్యప్రియుడు, ఈయన కథలు చదివి పక్కున నవ్వనివాడు, కళ్లు చెమ్మగిలని వాడు వుండడు. మన కళ్లముందు అనుదినము కనబడుతున్న కుత్సితాలు. కుహనా సంస్కారాలు, అపహాస్యపు వంచన జీవితాలు, ఆత్మప్రతారణలు. విదూషకప్రాయుల విడ్డూరపుచేతలు, పెద్దమనుష్యుల నిజస్వరూపాలు మన స్తత్వ వివేచనతో నడిచి పారకుని నవ్వుల వెన్నెలతో నింపివేస్తాయి! ఈయన కథానికలు. కాని, ఈ నవ్వులవెనుక కళ్లు చెమ్మగిల్లే కారుణ్యం ఉన్నది, హృదయక్షోభ ఉన్నది. సమకాలీన సమాజపు ఆటిటూవికట స్వరూపపు ఆవిష్కృతి ఉన్నది. "మంకీ డిపై డెడ్ బై టు" వంటి గొప్పకథలు వ్రాసిన ఈయన ఈ సంవత్సరం 'వైతరణికి అటూ ఇటూ' అనే మరొక అపూర్వ కథను నివాళియిచ్చారు.

ఈ కథ కత్తిపోరువలె నడుస్తుంది. లయబద్ధంగా, ఎప్పటికప్పుడు ఉత్కంఠతతో (సస్పెన్స్‌తో) భాష అందమూ, ఆ సన్నివేశాలకోసమే సృష్టించాడా అన్నట్టు—కాదుకాదు సృష్టి అయిందా అన్నట్టు ఉంటుంది. ఈ కథ రచయిత—కాదు ఒక పరిశీలకుడు ఆస్పత్రిలో రోగులుపడే అగచాట్లను, వారి సహాయకులు పడే పాట్లను చిత్రిస్తున్నట్లు సాగుతుంది. పాండురంగరావు నలుగురు వ్యక్తుల సమ్మేళనం, నాదృష్టితో ఒకడు పరిశీలకుడు, విమర్శకుడు, రచయిత, వీరు ముగ్గురినీ మించిన వినోదప్రియుడు నాలుగవవాడు. ఇంతకుముందే అన్నట్లు ఈ వినోదం లోకంలోని విషాద విస్మృతి కథనానికి చేదు మాత్రకు తీపి పూతలాగా, నా చిన్నప్పుడు మా అమ్మ చేదుమందును బెల్లంముద్దలో పెట్టి పొదిగి యిచ్చినట్లు ఆవరణం. వైతరణికి అటూ ఇటూ చదువు తున్నప్పుడు ఈ నలుగురూ మనను నడిపించి చివరకు ఒక్క పాండు రంగారావే మిగులుతాడు – ఆతనితో పాటు ఎటు వంటి కథ అనే ఆనందానుభూతీ మిగులుతుంది; ఎక్కడిదీ భాష అనే ఆశ్చర్యము ఆవరిస్తుంది.

శ్రీ మధురాంతకం రాజారాం లబ్ధ ప్రతిష్ఠుడైన కథకుడు. ఈ సంవత్సరం ఈయన అద్వితీయమైన కథ "పాదరేణువు". ఈ శీర్షికలోనే ఎంతో ధ్వని ఉంది. ఏడు కొండల వానికి శైత్యోపచారం కోసం పెట్టే పచ్చ కప్పురం ప్రసాదాన్ని శ్రీ పాదరేణు వంటారు. అది భక్త జనులందరికే సుపరిచితం. దానిని ఈ కథకు వాడుకొన్నారు ఈయన. ఈయన కథలు హెచ్చుగా కొసమెరుపుతో ఆనందపరచేవి. దీనిని ఓహెన్రీ పద్ధతి అంటారు. కాని, ఇదీ కొందరికి గొప్ప టెక్నిక్. ఇది రాజరాం గారికి అలవోక.

ఈ "శ్రీపాదరేణువు" కథలో ఒక సామాన్యుడు గొప్పలకుపోయి, తనకోరిక సిద్ధించకపోయినా సర్దుకొనిపోయి ఇతరులు పరిహసిస్తారేమోనని, తన చేతలను వ్యాఖ్యానించుకోడం చిత్రించబడింది. ఇద్దరు మిత్రులు ప్రయాణంచేస్తారు. వారిలో ఒకడు బలవంతాన తనమిత్రుణ్ని రెండవ తరగతిలో ఎక్కిస్తాడు. అక్కడ కూర్చోడానికి స్థలంలేదు. ఒక మహిళ పాదాలచెంత కిందకూర్చోవలసి వస్తుంది. బండిదిగిన తర్వాత అతడు తన మిత్రునికి సంజాయిషీ చెప్పుకొంటాడు. ఆమె ఎవరో తెలుసా? డిప్టీ కలెక్టరుగారి భార్య— అని. ఆమె పాదాలచెంత కూర్చుంటే తప్పులేదన్నట్టు. ఎంత ఘాటైన దెబ్బ!

నవీన కథానిక ఇంతగా వికసిస్తున్నా, ప్రాచీన పురాణ కథలకు, ఆ కథాగుచ్ఛాలకూ లోటులేదు. ఈ సందర్భంలో ఈ సంవత్సరం వచ్చిన ఇలాటి కథాకదంబాలలో "శ్రీ శివలీలామృతము" ఒకటి. శ్రీ ద్విభాష్యం వేంకట సూర్యనారాయణమూర్తి గారు గ్రాంథిక భాషలో దీనిని నడిపారు.

4. నాటిక, నాటకం

ఈ సంవత్సరం నాటకాలలో మనో విశ్లేషణం హెచ్చుగా కనిపిస్తున్నది. సంప్రదాయ విరుద్ధమైన వస్తువులతోను నాటక నాటికలు వెలువడ్డాయి; సామాన్య జన జీవితం వర్ణించేవి వచ్చాయి. మొత్తంమీద ఇతివృత్తం కన్నా, మన స్తత్వ వివేచనకే ప్రాధాన్యం. ఇలాటి వాటిలో దేశమంతా మెచ్చుకోదగినవీ వచ్చాయంటాను నేను వీటిలో అగ్రగణ్యమయినవి ఇవి.

''పావలా'' రచయిత శ్రీ గణేశపాత్రో, విశాఖ మాండలిక భాషలో సాగిన నాటకమిది. ఒక జాలరి కుటుంబం ఒక పావలా కోసం ఒకరినొకరు ఎత్తుపై ఎత్తుతో లొంగదీసుకొనడానికి మోసానికి యత్నించిన దారుణ చిత్రమిది.

శ్రీ గొల్లపూడి మారుతీరావు "కరుణించని దేవతలు'' అనే నాటకం యాంటి సెంటిమెంట్ అనేదోషం తప్పితే బాగా నడిచింది. జ్ఞాతులయిన అన్న చెల్లెండ్లు వివాహంచేసుకొంటారు సంబంధం తెలియక! ఇంటికివస్తే ఈ సంగతి తెలుస్తుంది. వీరి వివాహం సంగతి తెలియక సంబంధం కుదురుస్తారు, తల్లిదండ్రులు. పెళ్లి చూపులకు వరుడు వస్తాడు. పెళ్లయిన యిద్దరికీ—మీరు జ్ఞాతుల పిల్లలు అని ఎవరు చెప్పాలి? ఈమథనతో నాటకం నడుస్తుంది. Over sex (అతి జాత్యం) అనే పేరుతో 40 ఏళ్లక్రితం డాక్టర్‌గాలి బాలసుందరరావుగారు ఇలాటికథే వ్రాశారు. దానిని అప్పుడూ జనం అంతగా హర్షించలేదు; ఇప్పుడూ అంతగా హర్షించరనుకుంటాను.

శ్రీ రాఘవ "కనక పుష్యరాగం'' Well made play. ఒక కన్య తన తండ్రికి సహాయంచేసిన ఒక పెద్దమనిషియింట్లో ప్రవేశించి, అతనికి కూతురువలె సేవచేస్తుంది. అతని కుమారుని పై ప్రేమవున్నా, అతని భవిష్యత్తుకోసం తను త్యాగం చేస్తుంది.

5. విమర్శ

భాషా సాహిత్య విమర్శలో మనకు రెండు సంప్రదాయాలు దాదాపు శతాబ్దిగా వస్తున్నాయి. ఒకటి ప్రాచీన వ్యాఖ్యాన పద్ధతీ, రెండవదిగా, నవీన పాశ్చాత్య విశ్లేషణ పద్ధతి. ఇంతయినా మన రచయితలు విమర్శంటే గించుకొంటారు, తమ రచనాలేశంపైన ఈగవాలనివ్వరు. కాని యువకులలో పట్టింపులు తగ్గడంవల్ల, విశ్వ సాహిత్య సంబంధంవల్ల విమర్శ సహిష్ణుత హెచ్చింది, విమర్శ రంగం విస్తృతమవుతున్నదనే నా విశ్వాసం.

ఈ సంవత్సరం ఈ రంగంలో మంచిపూవులే పూచాయి, ప్రాచీన నవీన ధోరణిలో. కొన్ని అపూర్వాలు, అద్వితీయాలూ అన్నా తప్పుకాదు. పాతవి, కొత్తవి సాహిత్యంలోని అన్ని ప్రక్రియలకూ సంబంధించినవి వచ్చాయి. చరిత్ర, కళాది రంగాలకు సంబంధించినవీ వచ్చాయి.

సాహిత్య విమర్శ

శ్రీ మొగిలి నాగభూషణశర్మగారి "తెలుగు నవలావికాసం" ఎందరు ఆక్షేపించినా. తెలుగు నవలల విషయంలో శాస్త్రీయమైన, సాకల్యమైన వివేచనాత్మక విమర్శగ్రంథం. ఈ గ్రంథంలో ఈయన నూరేళ్ల తెలుగు నవలను చారిత్రిక, జాతీయ, సాంఘిక మనో విశ్లేషణాత్మక దశలతో వింగడించి చర్చించారు. ఐదవ ప్రకరణాన్ని నవలా శిల్పంకోసమే ప్రత్యేకించారు. ప్రముఖులైన పన్నెండుగురు నవలాకారుల ఉత్తమమని తాను భావించిన నవలలను సమగ్రంగా చర్చించారు. ఈయన విషయైకదృష్టి, నిష్పక్షపాతబుద్ధీ, తులిత పద్ధతి, నిర్ణయాన్ని పాఠకులకు వదిలే పద్ధతి చాలబాగున్నాయి.

శ్రీ కాశూరి హనుమంతరావుగారి "సాహితీ జగత్తు" ఉత్తమ విమర్శ వ్యాస సంపుటి. దీనిలో ఈయన ప్రాచ్యపాశ్చాత్య వాఙ్మయ విద్వత్త ప్రతి పుటలోను కనిపిస్తుంది. ఈయన ప్రాచీనులనూ మెచ్చగలడు, నవీనులనూ హర్షించగలడు. తులనాత్మక పరిశీలనతో తులితదృష్టితో, ఎదిరిని నొప్పించకుండా విమర్శించగలడు, తనభావం విస్పష్టంగా చెప్పగలడు.

డాక్టర్ చల్లారాధాకృష్ణశర్మగారి "తెలుగు విందు" కొన్ని విషయాలలో అగ్రగణ్యం. ఈ వ్యాసకదంబంలోని తెలుగు తమిళ భాషల సంబంధాన్ని గురించి, తెలుగు తమిళాలకు విదేశ మిషనరీల సేవ, పాల్కురికి సోమనాథుని తమిళభాషా పరిచయం మున్నగు విషయాల వ్యాసాలు చాల విజ్ఞాన దాయకాలు.

డాక్టర్ కోవెల సుప్రసన్నాచార్యుల "సాహిత్య వివేచన" ఆధునిక కవితా రీతులను చాలవరకు సమగ్రంగా తెలుసుకొనడానికి ఉత్తమ కరదీపిక. దీనిలోని ఎనిమిది వ్యాసాలు ఉత్తమ మయినవి. ఆచార్యులవారు ప్రాచీనులపై కొంచెం కన్నెర్ర జేసినా, ఇష్టులపై కొంచెం చేయి విదిలించినా, తద్భిన్నులపై చేయి బిగబట్టినా, సమకాలిక ఆధునికుల కవితా పరిణామ కథన వివేచనములలో నవ్యమార్గం అనుసరించి మనో వికాసం కలిగించారు.

భాషాపరిశోధన-విమర్శ

భాషావిషయికమయిన పరిశోధన విమర్శలో మనం ఎప్పటికప్పుడు క్రొత్త పోకడలు పోతున్నాము. అటు పాశ్చాత్యాధునిక లింగ్విస్టిక్స్ సంప్రదాయాలను, ఇటు పాణినీయాది వైయాకరణుల సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్నాము. ఆధునిక భాషా శాస్త్రంలో తెలుగులో ఉన్నన్ని గ్రంథాలు మరే భారతీయ భాషలోను లేవు. సారస్వతాది ఇతర వ్యాకరణాలలో కృషిచేసినవారు వ్రాసిన గ్రంథాలు మనకు ఉన్నాయి. ఈ సంవత్సరము ఈ పరిశోధన విమర్శలు విస్తరిల్లాయి.

ఈ భాషాపరిశోధన విమర్శరంగములో ప్రథమ గణ్యమయినది, డాక్టరు అక్కిరాజు రమాపతిరావు గారి "వ్యవహారిక భాషా వికాసం." ఈయన ఈ గ్రంథంలో వ్యవహార భాషోద్యమ చరిత్రను వివరించడమే కాక నేడు శిక్షణకు వ్యవహారిక భాష ఎలా ఉపాదేయమో నిరూపించారు. రావుసాహెబు గిడుగు రామమూర్తి పంతులు మొదలయిన వారి ప్రయత్నాలు వారి ప్రతిపక్షుల ఎత్తుల పై ఫల్యం నిష్పక్షపాతంగా వివరించబడింది.

ఈ రంగంలో అత్యపూర్వమైన పరిశోధన వ్యాససంపుటి నా "నుడి—నానుడి." భాషాశాస్త్ర చర్చకు పదాల పుట్టుపూర్వాల పరిజ్ఞానానికి ఒక్కభాషల జ్ఞానమే చాలదు. ఆంత్రోపాలజీ, సోషియాలజీ, చరిత్ర మొదలయినవెన్నో అవసరం. ఈ విషయాన్ని నిరూపిస్తూ, పదాల, పదబంధాల పుట్టుక తెలుసుకొనడానికి మొదటిసారిగ ప్రయత్నించినవాడిని నేను. దీనిని ఎన్లార్జు చేసి ఈ సంవత్సరము, విశాలాంధ్రవారు ప్రచురించారు. ఈ ధోరణిలో మహాశబ్దకోశం వ్రాయాలన్నది నా వాంఛ. స్వవిషయం దొర్లినందుకు క్షంతవ్యుడను.

మూడవది డాక్టర్ బూదరాజు రాధాకృష్ణగారి ప్రాచీనాంధ్ర శాసనాలు. ఇది ప్రాచీన శాసన భాషను శాస్త్రీయంగా చర్చించడమే కాక దానికొక వ్యాకరణాన్ని రూపొందించింది. పరిశోధకులకు భాషాభిమానులకు చాల ప్రయోజనకరం.

కళా విమర్శ

ఈ సంవత్సరం లలితకళల రంగంలో విశిష్టమయిన రెండు గ్రంథాలు సాటిలేనివి వచ్చాయి. భారత కళా పరిషత్తు, హైదరాబాద్ వారు ప్రచురించిన "కళ" మూడవ సంపుటి. దీనిలో సోమేశ్వరుని "అభిలషితరత్న చింతామణి" భోజుని, "సమరాంగణ సూత్రధారం" మున్నగు ప్రాచీన సంస్కృత గ్రంథాల విషయాల అనువాదాలే కాక ఆంధ్రలో ప్రాగైతిహాసికకాల కళ మొదలు నేటి వరకువున్న కళలు, చరిత్ర, నూతన కళా విమర్శ వ్యాసాలు చాల ఉన్నాయి. ఇలాటి కృషి దేశంలో మరెక్కడా జరగడంలేదని ఈ పరిషత్తు వారు అంటున్నారు. ఈ 'కళ' సంపాదకుడు శ్రీ చెలసాని ప్రసాదరావుగారూ, అతనికి అండగావున్న శ్రీ రాంభట్ల కృష్ణమూర్తిగారూ అభినందనీయులు.

రెండవ పుస్తకం "తూర్పుగోదావరి జిల్లాలో నృత్యకళ." దీనిని శ్రీ నటరాజ రామకృష్ణగారు ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిజిల్లాల నృత్యరీతుల చరిత్రా వ్రాయదలచి తొలిమెట్టుగా ఆరంభించారు. ఈ ప్రయత్నం కూడ భారత దేశంలో మరెక్కడ జరుగ లేదు.

ఈ సంవత్సరం విమర్శరంగంలో విచిత్రం ఒక కాయితాల వ్యాపారి శ్రీ గోలి ఈశ్వరయ్య తన సంస్థ రజతోత్సవం చేసుకొంటూ వివిధ విషయాలపై విద్వాంసులతో ఉత్తమ వ్యాసాలు వ్రాయించి 'శారదామంజీరం' అనే పేరున బృహత్సంపుటిగా ప్రచురించడం. దీనికి ప్రముఖ విద్వత్కవులు శతావధాని శ్రీ యన్. సి. వేంకటాచార్యులు, డాక్టర్ అమరేశం రాజేశ్వర శర్మ సంపాదకులు.

ప్రాచీన సంప్రదాయంలో వచ్చిన వ్యాఖ్యలలో శ్రీ తాపీ ధర్మారావు గారి విజయ విలాసం హృదయోల్లాస వ్యాఖ్య పేర్కొనదగింది. దీనికి కేంద్ర సాహిత్య అకాడెమీ ఉత్తమ తెలుగు పుస్తకంగా బహుమతి యిచ్చింది.

శివభారతాన్ని సమాలోచిస్తూ, శ్రీ సర్వేశాయి తిరుమలరావు గారి "శివ భారత దర్శనము" అన్న ఉద్గ్రంథం అనంతపురం నుంచి వెలువడింది.

ఇతర శాస్త్రాల గ్రంథాలూ చాలా వచ్చాయి. వాటిలో పేర్కొనదగింది, "వైద్యక శారీరక శబ్దకోశము". దీని సంపాదకులు వైద్యరత్న పండిత గోపాలాచార్యుల శిష్యులు శ్రీ వేటూరు శంకరశాస్త్రి, ముదిగొండ గోపాలరావు గార్లు. ఇది ఆధునిక పాశ్చాత్య వైద్యక పారిభాషిక పదాలకూ సంస్కృత పర్యాయాలు, ప్రయోజనకరమైనవి ఉన్నాయి.

అకాడెమీల సేవ

ఈ సంవత్సరం అకాడెమీలు చేసిన సేవను చెప్పకపోతే సాహిత్య రంగంలో జరిగిన కృషి పరిశీలన సమగ్రం కాదు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఈ సంవత్సరం ప్రాచీన ప్రబంధాల పదకోశాలు, చేనేత వృత్తి మాండలిక పదకోశం మరికొన్ని రెఫరెన్సు పుస్తకాలు ప్రచురించింది. సంగీత నాట్యకళ అకాడెమీ 'రాఘవ సంస్మరణ' సంచిక ప్రచురించింది. లలితకళా అకాడెమీ ఆంధ్రప్రదేశ్ దేవాలయాలలోని నాట్య భంగిమల ప్రతి రూపాలు ప్రదర్శించడానికి సన్నాహం చేస్తున్నది. ఇదివరకు 'లేపాక్షి' వర్ణ చిత్రాల సంపుటి ప్రదర్శించిన కీర్తి దీనికే దక్కింది.

తెలుగు అకాడెమీ ప్రతిజిల్లా మాండలికాల సర్వే చేయిస్తూ ఈ సంవత్సరం కరీంనగర్ జిల్లా మాండలికాల బులెటిన్ ప్రచురించింది. దీనిలో ప్రజా జీవితంలోని వివిధ రంగాలలోని వివిధ వృత్తుల వారితో మాట్లాడి టేప్ రికార్డు చేసిన అంశాల క్రోడీకరణ యిది. క్రోడీకరణ ఒక యజ్ఞంవంటిది. ఇంతేకాక ఈ తెలుగు అకాడెమీ ఈ సంవత్సరం మూడు ఇంటర్మీడియేట్ తెలుగు పాఠ్య పుస్తకాలను, 26 బి. ఎస్. సి, ఐదు బి కాం. 24 బి. ఎ. మొత్తం 58 పాఠ్య గ్రంథాలు ప్రచురించింది.

ముగింపు

ఇలా సింహావలోకనం చేస్తే నా వరకు నాకు 1971 సంవత్సరం అసంతృప్తి కలిగించకపోగా, కథానికా విషయంలోను, విమర్శ రంగంలోను చాల సంతృప్తి కలిగించింది. గొప్ప కథలను ప్రపంచ ప్రమాణాలతో చూచినా ప్రసాదించింది. ఈ వైఖరులు 72లో మరింత ఎదగ గలవనే నమ్మకం నాకు ఉంది.

ఈ సంచికలోని రచయితలు

శ్రీ పి.వి. నరసింహారావు, ముఖ్యమంత్రి
శ్రీ ముదిగంటి జగ్గన్నశాస్త్రి
శ్రీ కామరాజుగడ్డ రామచంద్రరావు, న్యాయశాఖ, సెక్రటేరియట్, హైదరాబాదు
డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావు, డైరెక్టరు, తెలుగు అకాడమీ, హైదరాబాదు
శ్రీ సుధామ, మలక్‌పేట, హైదరాబాదు
శ్రీ తిరుమల రామచంద్ర, 69 ఆదర్శనగర్, హైదరాబాదు
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సమాచారశాఖ, హైదరాబాదు
శ్రీ "అభిమన్య", మునిసిపల్ కాలనీ, హైదరాబాదు
శ్రీ వాకాటి పాండురంగారావు, కృషిభవన్, న్యూ ఢిల్లీ
శ్రీ పుల్లాభట్ల వెంకటేశ్వర్లు, ఖమ్మం కాలేజి, ఖమ్మం
శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం.ఎల్.సి. చిత్తూరు
శ్రీ పువ్వుల చలపతిరావు, రాయవరం, కొత్తగూడెం కాలరీస్, ఖమ్మంజిల్లా

మహాభారతము

తెలపుగంటూరు లక్ష్మణశాస్త్రి

కౌశి :— మహాత్మా ! నీవు ఉపన్యసించిన మోక్షధర్మమును విని మిక్కిలి సంతోషించితిని. మోక్షమునందు నాకు దృఢమగు ప్రీతి యేర్పడినది. నీవు చెప్పినదంతయు న్యాయ యుక్తముగానే యున్నది. నీకు తెలియని ధార్మిక విషయములు లేవని తోచుచున్నది.

మాతా-పితృ సేవా ప్రభావము

ఆ మాటలు విని ధర్మవ్యాధుడు, బ్రాహ్మణోత్తమా ! నేను ప్రత్యక్షముగా నాచరించు ధర్మమును నీకు చూపించెదను. దాని ప్రభావము చేతనే నాకు ఈ సిద్ధి కలిగినది. ఆ ధర్మమునుగూడ చూతువుగాని మా యింటిలోనికి రమ్ము. మా తలిదండ్రులను చూడుము" అని కౌశికుని లోపలికి తోడ్కొనిపోయి తలిదండ్రులను చూపించెను. వారు స్వచ్ఛమగు సుందర భవనములో నొక యాసనమునందు సుఖముగా భుజించి కూర్చొనియుండిరి. అది యొక దేవతా భవనమువలె అతి పవిత్రముగానుండెను. అందొక వైపు బంగారపు శయ్య పరవబడియుండెను వేరొకవైపున కూర్చొనుటకు ఆసనముండెను. ఆ చోటు చందన—ధూపాదులచేత సుగంధితమైయుండెను. వారిరువురు శ్వేతవస్త్రములు ధరించియుండిరి. గంధపుష్పాదులచేత వారు పూజింపబడియుండిరి. అట్టి తల్లిదండ్రులను చూడగనే ధర్మవ్యాధుడు తన శిరస్సును వారి పాదములపైన ఉంచి సాష్టాంగముగా నమస్కరించెను. అదిచూచి తల్లిదండ్రులు ఇట్లనిరి :— "నాయనా ! ధర్మజ్ఞా ! లెమ్ము. నిన్ను ధర్మము అన్నివైపుల రక్షించుగాక. నీ సేవచేతను, పరిశుద్ధ ప్రవర్తనచేతను మేమిరువురము మిక్కిలి ప్రీతి చెందితిమి. చల్లగా చాలకాలము జీవించియుండుము. పుత్రా ! నీవు ఉత్తమ గతిని, తపస్సును, జ్ఞానమును, శ్రేష్ఠ బుద్ధిని సంపాదించితివి, నీవు నిత్యము నియమానుసారముగా మాకు పూజలు సేవలు, సత్కారములు జరుపుచుండుటచేత నీవు సత్పుత్రుడవైతివి మమ్ము విడిచి నీకు ఇతర దేవతలులేరు. మనస్సును పవిత్రముగాను, వశవర్తిగాను నుంచుకొనియున్నావు గనుక నీవు బ్రాహ్మణోచితమగు శమ—దమాదిగుణ సంపన్నుడవైయున్నావు. మేమేకాక, మన పితృ పితామహాదులు గూడ నీ వలన తరించిరి. మా సేవ వినా నీ బుద్ధికి మరియొకటి గోచరించదు. పరశురాముడు పూర్వము తల్లిదండ్రులకు చేసిన సేవకన్న నధిక శుశ్రూష నీవు మాకు చేసితివి."

తరువాత ధర్మవ్యాధుడు తల్లిదండ్రులకు కౌశికుని చూపించి యాతడి సంగతి యంతయు చెప్పగా వారతనిని పూజించి సత్కరించిరి. అప్పుడు కౌశికుడు నా యిరువురు పరస్పరము కుశల ప్రశ్నములను చేసికొనిరి. అప్పుడు ధర్మవ్యాధుడు కౌశికునితో నిట్లనెను :—

"మహాత్మా ! తల్లిదండ్రులే నాకు ముఖ్యదేవతలు. దేవతలకు చేయవలసిన పూజా సత్కారములన్నియు వీరికే నేను చేయుచుందును. ముప్పదిమూడు మంది దేవతలు (8 వసువులు, 11 రుద్రులు, 12 ఆదిత్యులు, 1 ఇంద్రుడు, 1 ప్రజాపతి) సమస్త లోకములకు పూజనీయులైనట్లే నాకు వీరు పూజ్యులు. దేవతలకు ద్విజులు కానుకలను ఇచ్చునట్లే నేను వీరికి సమర్పించుచుందును. వీరే నాకు పరదైవతములు కనుక పుష్ప ఫలాదులచేత వరిని సంతుష్టులనుజేయుచుందును. నాకు త్రేతాగ్నులు—సర్వయజ్ఞములు చతుర్వేదములు అన్నియు వీరే. ఈ నా తల్లిదండ్రులకు నేను భార్యా—పుత్ర-పరివార సహితముగా నిత్యము పూజలు సలుపుచుందును. సేవలు చేయుచుందును. నేను స్వయముగా వీరికి స్నానము-పాద ప్రక్షాళనము చేయించి ఆహారము నిచ్చుచుందును. వీరికి అనుకూలముగా నేను మాట్లాడుచు నెప్పుడుగూడ అప్రియమును చెప్పను. వీరికి ప్రియమగు పని, అది అధర్మమైనను, మాతాపితృ సేవయే పరమ ధర్మమని భావించిచేసెదను. అభివృద్ధిని పొందగోరు పురుషునకు అయిదుగురే గురువులు. వారు, "తల్లి తండ్రి, అగ్ని, పరమాత్మ, చదువుచెప్పిన గురువు. ఈయైదుగురు గురువులను సదా సేవించువానికి అగ్నిహోత్రాదులన్నియు సంపన్నములగును. గృహస్థాశ్రమములో నున్నవానికి ఇంతకన్న మించిన ధర్మము మరియొకటిలేదు. ఇదియే సనాతన ధర్మము.

కౌశికునకు ఉపదేశము

బ్రాహ్మణోత్తమా ! తల్లిదండ్రుల సేవయే నా తపస్సు. దాని ప్రభావమువలన నాకు దివ్యదృష్టి కలిగినది దానిచేత నిన్ను పతివ్రత యిక్కడికి పంపిన విషయమును కనుగొనగలిగితిని,

కౌశి :- సత్పురుషుడా ! ఆమె మాటల యందలి విశ్వాసము చేతనే 'నీవు సద్గుణవంతుడవు తపశ్శాలివి' అని తెలిసికొని నీకడకు వచ్చితిని.

వ్యా :- ఆమె తన పాతివ్రత్య ప్రభావముచేతనే నావిషయ మంతయు తెలిసికొన గలిగెను. నీయందలి యనుగ్రహము చేత నీ కీ విషయములన్నియు నేను చెప్పితిని. ఇప్పుడు నీకొక హితమును బోధించెదను. నీవు తల్లిదండ్రులను నిర్లక్ష్యము చేసితివి. వారియాజ్ఞ తీసికొనకయే నీవు వేదాధ్యయనార్థమై యిల్లు విడిచి వెళ్లిపోయితివి. ఇట్లు నీవు గొప్ప అనుచిత కార్యము చేసితివి. నీ వియోగ దుఃఖము చేత పాపము వారు అంధులైరి. వారిని సంతోషపరచుటకు నీవిప్పుడు ఇంటికిపొమ్ము. దానిచేత నీ ధర్మము నష్టముకాదు. నీవు తపశ్శాలివి, ధర్మాత్ముడవు, గొప్ప మహిమగలవాడవని యింతగా చెప్పుచున్నాను. నీ యీ ధర్మమంతయు తల్లిదండ్రులకు సేవచేయని దోషముచేత వ్యర్థమయ్యెను. అందుచేత వెంటనేపోయి వారిని సేవించి సంతోషపరచుము. నా మాటకు వ్యతిరేకముగా చేయకుము. నీకు మేలు కలుగును.

కౌశి :- ధర్మాత్ముడా ! నీవుచెప్పినదంతయు సత్యము. చాల చాల సంతుష్టుడనైతిని. అట్లే చేయుదును.

వ్యా :- బ్రాహ్మణా ! నీవు దేవ సమానుడవు. ఎందుకనగా, నీవు సనాతనము దివ్యమునగు ధర్మమునందు నిష్ఠ గలవాడవు. ఇంద్రియ నిగ్రహము గలవారికి గూడ నిట్టి ధర్మము దుర్లభము. కనుక వెంటనేపోయి మాతాపితరులను సేవించుము. దానికి మించిన ధర్మము మరియొకటిలేదు.

కౌశి :- నా భాగ్యవశముచేతనే యిచ్చటికివచ్చి నిన్ను దర్శించితిని. ధర్మమును బోధించు నీ వంటి మహాత్ములు లభించరు. వేయిమందిలోను నొకడు ధర్మజ్ఞుడు ఉండునో ఉండడో. నీ సత్య ప్రవృత్తిచేత నేను చాల ప్రీతుడనైతిని. నరకములో పడుచున్న నన్ను ఉద్ధరించితివి. నీ యుపదేశమును తప్పక పాటించెదను. పూర్వము స్వర్గము నుండి పతితుడగుచున్న యయాతిమహారాజును అతని దౌహిత్రులు (కూతురి కొడుకులు) ఉద్ధరించినట్లే నేడు నన్ను కాపాడితివి. నీ మాట ప్రకారము మాతాపితృ శుశ్రూష చేసెదను. నీవంటి మహనీయులే యిట్టి ధర్మాధర్మ విచారము తెలిపెదరు. శూద్ర యోనిలో జన్మించియు నీవు ఇట్టి గొప్ప ధర్మమును తెలిసికొనినావు. నాకు చాల ఆశ్చర్యమైనది. నిక్కముగా నీవు శూద్రుడవు కావు. ఇట్లు నీవు పుట్టుటకేదో యొక విశేష కారణము ఉండి యుండును. ఎట్టి కర్మలచేత నీవు శూద్రుడవై పుట్టితివో దయయుంచి నాకు చెప్పుము.

ధర్మవ్యాధుని పూర్వ జన్మకథ

వ్యా :- బ్రాహ్మణోత్తమా ! నేను పూర్వ జన్మమునందొక ఉత్తమ బ్రాహ్మణ పుత్రుడనై వేదాధ్యయన తత్పరుడనుగా నుంటిని. సర్వశాస్త్రములందు పండితుడను గాను, కుశలుడనుగాను నుంటిని. నా దోషము చేతనే యీ జన్మనందితిని. అప్పుడొక క్షత్రియ రాజుతో నాకు స్నేహముండెను. ఆ సంబంధముతో ధనుర్వేదము నేర్చుకొంటిని. బాణ విద్యలో నతి కుశలుడనైతిని. ఒకనాడా రాజు యోధులతోను, మంత్రులతోను కలిసి వేటకుపోయి ఒక ముని యాశ్రమమువద్ద ననేక మృగములను వధించెను. అప్పుడతని సాంగత్యములోనున్న నేను గూడ నొక ఘోరమగు బాణము విడిచితిని. అది తాకి యా ముని క్రింద పడి గాయముల బాధచేత 'అయ్యో ! ఏ పాపమెరుగని నన్నెవరిట్లు కొట్టిరి' అని ఆర్తనాదముచేయుచు నా యడవి ప్రతిధ్వనించునట్లు అరచెను. అతడొక మృగమని తలచి నేను కొట్టి యుంటిని. ఆ యరపు విని వెంటనే పోయి చూచునరి కొక ముని నా దెబ్బచేత పడియుండెను. అట్టి చెడపని చేసినందున నా మనస్సు చాల వ్యథ చెందెను. 'భగవన్ ! తెలియక తప్పు చేసిన నన్ను క్షమింపు' మని యతనిని వేడుకొంటిని. అది విని యా ముని అతి క్రుద్ధుడై 'క్రూర బ్రాహ్మణా ! నీవు శూద్రయోనియందు వ్యాధుడవుగా పుట్టుదువు గాక' యని శపించెను. అనేక విధములుగా నేను ప్రార్థించగా నా ముని 'నా మాట పొల్లుపోదు నీకు ఆజన్మ తప్పదు. ఐనను నేను క్రూర స్వభావుడను కాను గనుక నీ యెడల ప్రసన్నుడనైతిని. నీవట్లు పుట్టి కూడ ధర్మజ్ఞుడవై తల్లిదండ్రులను సేవించు భాగ్యము గలవాడవయ్యెదవు. దాని చేత నీకు సిద్ధి, మహిమ యేర్పడును. పూర్వజన్మ స్మృతి నీకుండును. చివరకు స్వర్గమునకు పోయెదవు. శాపాంతమునందు తిరిగి బ్రాహ్మణుడవయ్యెదవు.' అనెను. దానితో నేను సంతుష్టుడనై యతని శరీరములో గ్రుచ్చుకొనిన బాణమును ఊడ పెరికి అతనిని ఆశ్రమమునకు చేర్చితిని. అతడు చావలేదు. ద్విజోత్తమా ! నా పూర్వ జన్మ కథ యంతయు చెప్పితిని. ఈ జన్మ ముగిసిన తరువాత స్వర్గమునకు పోయెదను.

కౌశి :- ఈ విధముగనే మనుష్యుడు సుఖ దుఃఖములను అనుభవించుచుండును. కనుక నీవు చింతించకుము. నీవు అనన్యసాధ్యమగునంత గొప్పగా మాతాపితృ సేవచేసి దానిద్వారా పూర్వజన్మ జ్ఞానము గలవాడవైతివి. లోక సమాచారము నంతయు నెరిగి యున్నావు. నీ కిప్పుడేర్పడిన మాంస విక్రయజాతి దోషము పూర్వజన్మ కర్మల ఫలమువలన గలిగినది. కొంత కాలముదాక ఈ విధముగనే యుండుము. తిరిగి బ్రాహ్మణుడ వగుదువు. నేనైతే యిప్పుడే నిన్ను బ్రాహ్మణునిగా తలచెదను. ఎవడు బ్రాహ్మణ జాతిలో జన్మించియు నరక కూపములో బడజేయు పాప కర్మములలో తగుల్కొని దుష్కర్మలు చేయుచు నాస్తికుడై యుండునో వాడు శూద్రుడే యగునని నా విశ్వాసము. ఎవడు శూద్ర జాతిలో పుట్టియు 'శమ-దమ-సత్య-ధర్మ' ములు పాలించుచుండునో యతనిని బ్రాహ్మణునిగానే

తలచెదను. మానవుడు సత్ప్రవర్తనల ద్వారా మాత్రమే ద్విజుడగును. కర్మ దోషముచేతనే దుర్గతికి పాలగును. నీ కర్మ దోషములన్నియు నశించినవి. నీకు ఏలాటి చింతయు నక్కరలేదు. లోక వృత్తమును సమగ్రముగా తెలిసికొని, సర్వదా ధర్మపరాయణుడగు నీ వంటి జ్ఞాని యెప్పుడు గూడ దుఃఖము చెందడు.

వ్యాధుడు:— జ్ఞానులు తమ బుద్ధి వైభవముచేత మానసిక దుఃఖములను, ఔషధ సేవనముద్వారా శారీరక దుఃఖములను అణచెదరు. జ్ఞానమునకు గల శక్తి యే యిది. బుద్ధిమంతుడు బాలకునివలె శోక—మోహములను చెందడు. మందబుద్ధులు ఇష్టానిష్ట వస్తువుల లాభములచేత మానసికముగా సుఖదుఃఖములను అనుభవించెదరు. జంతువులన్నియు సత్త్వ రజస్—తమో గుణముల ప్రభావముచే లభించిన వస్తువుల సంయోగ వియోగములను పొందుట స్వాభావికము. అది శోక కారణము కాజాలదు. అనిష్టము కలిగినప్పుడు దానిని తొలగించుకొనుటకు ప్రయత్నించును. అది కలుగునని తొలుతనే తెలిసినచో, అది రాకుండుటకు ఉపాయములను చేయుచుండును. కేవలము దుఃఖించుచు కూర్చొనుటచేత సంతాపము దప్ప వానికి మిగులునది యేమియు నుండదు. జ్ఞానముచేతనే తృప్తి నందువాడు సుఖదుఃఖములను పరిత్యజించి సర్వదాసుఖిగా నుండును. మూర్ఖుడు అసంతుష్టితో నుండును. అసంతోషమునకు అంతముండదు. కనుక సంతుష్టియే పరమ సుఖము. జ్ఞానయోగముచేత పరమాత్మ సాక్షాత్కారము పొందిన వారికి ఎప్పుడు గూడ దుఃఖము ఉండదు. దుఃఖము ఘోరమగు విషము వంటిది కనుక దుఃఖపడ గూడదు. అది బాలకుని ఉగ్రసర్పమువలె అజ్ఞానిని చంపును. పరాక్రమము ప్రదర్శించవలసినప్పుడు దుఃఖపడినచో నట్టి తేజోహీనునకు ఏపురుషార్థముగూడ లభించదు. చేసిన కర్మముల ఫలము నవశ్యముగా ననుభవించవలసినదే. ఊరక దుఃఖపడుచు కూర్చుండినచో నెట్టి మేలుగూడ కలుగదు. దుఃఖనివారణకు ఉపాయమును వెదకుచుండవలెను. దానిచేత దుఃఖము నివారింపబడి వ్యసనములపాలు కాడు. 'ప్రాపంచిక వస్తువులు అనిత్యము' లని భావించి నిత్యమగు పరబ్రహ్మ వస్తువు నాశ్రయించిన జ్ఞానికి ఎప్పుడు గూడ దుఃఖము కలుగదు. బ్రాహ్మణా! నేను అంత్యకాలమునకై యెదురుచూచు చున్నాను కనుక నెప్పుడు గూడ శోకములో తగులుకొనను. ఉత్సాహముతోనే యుండెదను. సద్విచారముచేత నాకీ మేలు కలిగినది.

కౌశి:— ధర్మవ్యాధా! నీవు పరమజ్ఞాన సంపన్నుడవు. నీ బుద్ధి అతి విశాలమైనది. ధర్మతత్త్వమును తెలిసి జ్ఞానానందములో సంతృప్తుడవై యున్నావు. కనుక నీకీ వ్యాధత్వము కలిగినందుకు విచారపడుదును. ఇక నేను పోయెదను. అనుమతి యిమ్ము. నీకు శుభమగుగాక. ఎల్లప్పుడు ధర్మము నిన్ను రక్షించుగాక. ధర్మాచరణమునందు భ్రమ-ప్రమాదములు లేక మెలగుచుండుము."

ఆ మాటలు విని ధర్మవ్యాధుడు 'అట్లే చేసెదను. నీ వింక పోయిరమ్ము' అని కౌశికునకు చెప్పెను. కౌశికుడు ధర్మవ్యాధునకు ప్రదక్షిణ నమస్కారములు చేసి వెడలిపోయి తన తల్లిదండ్రులకు సేవచేసెను. వారు ప్రసన్నులై కౌశికుని ప్రశంసించిరి.

యుధిష్ఠిరమహారాజా! ధర్మమును గూర్చిన విశేషము లన్నియు నీకు చెప్పితిని." అని మార్కండేయ మహాముని చెప్పగా యుధిష్ఠిరుడు "మహామునీ! నీవు చెప్పిన ధర్మోపాఖ్యానములు విని మిక్కిలి సంతుష్టుడనైతిని. నీ నోట ధర్మములు వినుచుండగా నెంతయో ఆనందమగుచున్నది. నాకింక తృప్తి దీరకున్నది. పూర్వము అగ్నిదేవుడు ఎందుచేత జలమునందు ప్రవేశించెను? అగ్ని దృశ్యుడగుటచేత 'అంగిరస్' అను మునీశ్వరుడు ఎందుకు స్వయముగా నగ్నిరూపము వహించి దేవతలకు హవిస్సును అందజేసెను? అగ్నిదేవుడొక్కడే గదా! అతడు వివిధ రూపములను వహించి భిన్నభిన్న కార్యములనెట్లు చేయును? కుమారస్వామి ఉత్పత్తి యెట్లుఅయ్యెను? అతడగ్నిపుత్రుడెట్లయ్యెను? భగవంతుడగు శంకరునివలనను, గంగాదేవి వలనను, కృత్తికలవలనను అతనిజన్మ యెట్లు కలిగెను?" అని యడిగెను. ఆ మాటకు మార్కండేయు డిట్లుచెప్పదొడగెను:—

'అంగిరస్-బృహస్పతుల'-జన్మ వృత్తాంతము

"పూర్వము అంగిరసుడు తనకు అగ్నికన్న నెక్కువ తేజస్సు కలుగవలెనని తపస్సుచేసి సఫలుడై సర్వప్రపంచమును ప్రకాశింపజేయ జొచ్చెను. అప్పుడు అగ్నిగూడ తపస్సు చేయుచుండెను. అంగిరసుని తేజస్సుచేత అగ్ని మలినుడయ్యెను. తానట్లగుటకు కారణము అగ్నికి తెలియకుండెను. చాల సేపు చింతించి యగ్ని 'తనకన్న అధిక తేజశ్శాలియగు నగ్నిని బ్రహ్మ సృష్టించెను. నేను నా తపస్సులో మగ్నుడనై నా అగ్నిత్వమును గోల్పోయితి' నని చింతించెను. 'నేను తిరిగి అగ్ని నెట్లగుదు' నని తలపోసి, సమస్త లోకములను మహా తేజస్సుతో తపింపజేయుచున్న అంగిరసుని చూచి భయముతో మెల్లగా నతనిని సమీపించెను అప్పుడంగిరసుడు అగ్నితో 'నీవు వెంటనే తిరిగి పూర్వ తేజస్సును పొందుము. స్థావర జంగమాత్మకములగు మూడు లోకములలోను నీవే అగ్నివని ప్రసిద్ధినందియున్నావు. బ్రహ్మదేవుడు నిన్నే తొలుత అగ్నిగా సృష్టించెను. కనుక నీవు త్వరగా స్వస్థానమునుపొంది అంధకారమును నశింపజేయుము' అని చెప్పెను. అది విని అగ్ని 'మహామునీ! నీవు అగ్నివగుటచేత లోకమునందు నా కీర్తి నశించెను. జనులు నిన్నే అగ్నిగా తలచెదరుకాని నన్ను కాదు. కనుక నా యగ్నిత్వమును నీయందుంచెదను. నీవు మొదటి అగ్నిగా నుండుము. నేను 'ప్రాజా


సత్యుడు' అనుపేరుగల రెండవ అగ్నిగా నయ్యెదను'అని చెప్పెను. ఆ మాటకు అంగిరసుడు 'అగ్నిదేవా! ప్రజలను స్వర్గలోకము నకు చేర్చు పుణ్య కర్మమును (దేవతలకు హవిస్సును కొనిపోవు పని) చేయుచు అంధకారమును నివారించు అగ్నిపదవిని నీవే అధిష్ఠించుము. నన్ను నీ జ్యేష్ఠ పుత్రునిగా స్వీకరించుము' అని యనెను. అగ్నిదేవుడు అంగీకరించెను. దేవతలందరు 'అగ్ని పుత్రుడు అంగిరసుడని' తెలిసి తత్కారణమును అంగిరసునడిగి తెలిసికొని పోయిరి. 'ధర్మరాజా! వేదములలో చెప్పబడిన విధముగా నానా కర్మల ద్వారా భిన్న భిన్న ప్రయోజనములను గలిగించు వివిధాగ్నులను గూర్చి చెప్పెదను విను' అని మార్కండేయుడు చెప్పదొడగెను.

అంగిరసుని సంతతి వర్ణనము

"బ్రహ్మ సంతతిలో మూడవ తరమువాడగు అంగిరసునకు 'శుభ' యను భార్య యుండెను. ఆ సుభాదేవి గర్భము నుండి 'బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనస్, బృహన్మంత్ర, బృహద్భాస, బృహస్పతి' నామకులగు నేడుగురు పుత్రులు పుట్టిరి. ఈ యేడుగురికన్న జ్యేష్ఠురాలు 'భానుమతి' పుట్టెను. ఆమె పగటికి అభిమాన దేవత కనుక ఆమెకు 'భానుమతి—అనగా సూర్యవతి' యనుపేరు వచ్చెను. అంగిరసుని రెండవ కూతురు 'రాగ' అనుపేరు గలది. ఆ రాగాదేవియందు సమస్త ప్రాణులకు అనురాగము ఉండెను గనుక ఆ పేరు ఆమెకు సార్థక మయ్యెను. ఆమె రాత్రికి అభిమాన దేవత. మూడవ కూతురు 'సినీవాలి' (చతుర్దశితో గూడిన అమావాస్యకు సినీవాలి యని పేరు) ఆమె అతి కృశాంగి గనుక ఒకప్పుడు కనపడుచు నొకప్పుడు కనపడకయుండును కనుక ఆమెను 'దృశ్యాదృశ్య' నామముచేత లోకులు పిలుచుచుందురు. భగవంతుడగు పరమశివుడామెను లలాటమునందు ధరించియుండును గనుక నామెకు 'రుద్రసుత' యనుపేరుగూడ ప్రసిద్ధమయ్యెను. నాల్గవ కూతురు 'అర్చిష్మతి' పూర్ణచంద్రునితో కూడియుండుటచే నామెను 'పూర్ణిమ' యనికూడ నందురు. ఆమె తన తేజస్సుచేత సర్వ వస్తువులను స్పష్టముగా ప్రకాశింపజేయును. అంగిరసుని యైదవ కూతురి పేరు 'హవిష్మతి' (పాడ్యమితో గూడిన పూర్ణిమ) దీనికి 'రాక' యని కూడ పేరు కనకనే 'రాకాచంద్రుడు' అను ప్రసిద్ధియున్నది. ఆమె సన్నిధిలోనే హవిస్సులచేత దేవతలను గూర్చి యజ్ఞములు చేయబడును. ఆరవ కన్య 'మహిష్మతి'యనునది [చతుర్దశితో గూడిన పూర్ణిమ యిదియే] ఈమెకు 'అనుమతి' యను పేరుకూడ కలదు. అంగిరసుని యేడవ పుత్రి 'మహామతి' [పాడ్యమితో గూడిన అమావాస్య] ఆమె సోమయాగాదులలో ప్రకటితురాలై యుండును. భగవతియగు అమావాస్యను చూచి లోకులు 'కుహూ—కుహూ' అని ధ్వనించుచు చకితులగుదురు. కనుక ఈ యేడవ పుత్రికి 'కుహూ' అని కూడ పేరు కలదు. దానియందు చంద్రుని ఒక్క కళ మాత్రము సూక్ష్మముగా మిగిలి యుండును. అదియే శుద్ధ అమావాస్య యగును.

"ధర్మరాజా! అంగిరసుని యేడవ పుత్రుడగు బృహస్పతి [అంగిరసుడు] కి 'చాంద్రమసి' [తార] యను భార్యయుండెను. ఆమెకు ఆరుగురు అగ్నులును, ఒక పుత్రికయు పుట్టిరి. 'దర్శ పూర్ణమాసము' మున్నగు యజ్ఞములలో మొట్టమొదట నెయ్యి ఆహుతి చేయబడు నగ్ని బృహస్పతికి ప్రథమ పుత్రుడు. ఆ యగ్నికి 'శంయు' అనిపేరు. అతనికి 'చాతుర్మాస్య-అశ్వమేధ' యాగములలో ప్రథమపూజ జరుగును. శంయునకు 'సత్య'యను భార్య కలదు. ఆమె ధర్ముని కూతురు. ఆమె గర్భము నుండి శంయునకు అగ్నియంశములో నొక కొడుకు, ముగ్గురు కన్యకలు పుట్టిరి. ఆ పుత్రునకు 'భరద్వాజుడు' అని పేరు. అగ్నిష్టోమాది యజ్ఞములలో మొదటి ఆజ్యాహుతి యివ్వబడును. శంయునకు నింకొక భార్యయుండి 'భరతుడు'అను రెండవ కొడుకు పుట్టెను. ఆ పుత్రునకు 'ఊర్జ' అను నగ్ని పేరుగూడా యుండెను. 'పౌర్ణమాస' యాగములలో నీ యగ్నికే మొదటి ఆజ్యాహుతి యివ్వబడును. శంయునకు మరి ముగ్గురు కన్యకలు గలిగిరి. వారి పాలనము వారి యన్నయగు భరతుడే చేయుచుండెను. భరతునకు [ఊర్జునకు] 'భరతుడు' అను పేరుతోనే యొక పుత్రుడు 'భరతి' యనునొక పుత్రిక పుట్టిరి. ప్రజాపతి యగు 'భరత' నామకాగ్నికి [పెద్ద భరతుడు] 'పావకుడు' అను వాడు గూడ పుట్టెను. అతడు మిక్కిలి పూజ్యుడగుటచేత 'మహాన్' అని ప్రసిద్ధుడయ్యెను.

"శంయు యొక్క జ్యేష్ఠ పుత్రుడగు భరద్వాజునకు 'వీర' యను పేరుగల భార్యయుండెను. ఆ వీరాదేవికి 'వీరుడు' అను పుత్రుడు కలిగెను. ఈ వీరునకు సోమునితో సమానముగా ఆజ్యభాగమివ్వవలెనని బ్రాహ్మణులు చెప్పిరి. ఎందుకనగా, 'అగ్నీషోమాభ్యాం ఉపాంశుయష్ట వ్యావజాముత్వాయ' అను శ్రుతి వాక్యములో సోమునకు హోమము చేయునప్పుడు మంత్రమును 'ఉపాంశు' స్వరము [మెల్లగా]తో నుచ్చరించుచు ఆజ్యభాగము అగ్నిలో విడువవలెననియున్నది. భరద్వాజ పుత్రుడగు వీరుడు సోమునితో సమానుడని చెప్పుటచేత నతనికి హోమముచేయునప్పుడు గూడ మంత్రమును 'ఉపాంశు' స్వరములోనే యుచ్చరింపవలెనని భావము. ఇతనికి సోముని తరువాత ద్వితీయ హవిర్భాగ మీయబడును. ఈ వీరునకు 'రథప్రభు—రథధ్వాన—కుంభరేతస్' అని మరి మూడు పేర్లు గలవు. (సశేషము)



బృహత్శిలాయుగపు దీర్ఘ చతురస్రాకార నివాసస్థలం. (పెదబంకూరు)

ఆంధ్రప్రదేశ్


పురావస్తు శాఖ త్రవ్వకాలలో బం


మన ప్రాచీన నాగరికతా

పైన మూయబడిన నీటిపారుదల సౌకర్యం : శాతవాహనయుగం.
(పెదబంకూరు)



పెదబంకూరు త్రవ్వకాలలో దొరికిన నా





గజ పృష్ఠాకార దేవాలయ శిథిలాలు (పెదబంకూరు)


యల్పడిన

చిహ్నాలు

గోల్కొండవద్ద బయల్పడిన కట్టడపు శిథిలాలు.



ాలు



గుడ్డిదీపం

'అభిమన్యు'

శ్రీనివాసరావు జిల్లా మొత్తంలో పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తి: లాయర్‌గా ఎంత పలుకుబడివుందో, ఆయన మంచితనానికి దానికి మించిన గౌరవముంది! ఆ గౌరవమూ కేవలం క్లయింట్లకే పరిమిత మయింది కాదు! వివిధ శాఖల్లో పని జేసే ప్రభుత్వోద్యోగులూ ఇతర రంగాల్లోని ప్రముఖ వ్యక్తులూ శ్రీనివాసరావుపట్ల మర్యాద చూపుతుంటారు! అందుకు కారణం, ఆయన ఆర్జించిన లక్షలూ కాదు, గుంటూరులోనే కాక, హైదరాబాదులో సంపాదించిన ఆస్తిపాస్తులూ కావు అందరిలోనూ తలలోని నాలికలా మసలుకునే స్వభావం శ్రీనివాసరావుది. సాహిత్యంపట్లా, తదితరకళల పట్లా అభిరుచి గలవాడు రచయిత కాకపోయినా, సద్విమర్శకునికి ఉండాల్సిన లక్షణాలను పుణికి పుచ్చుకున్నాడు. రంధ్రాన్వేషణ కన్న, ప్రోత్సహించే సహృదయత పెంపొందించుకోవటంతో. శ్రీనివాసరావు ఆట్టే శత్రువుల్ని సృష్టించుకోలేదు. కవిగాని, గాయకుడుగాని, లేక ఏ కళాకారుడైనా గానీ సమర్దుడయితే, స్వశక్తితో రాణిస్తాడు. లోకం గుర్తిస్తుంది! అలాటప్పుడు ఆదిలోనే గుండె పగలగొట్టి నిరుత్సాహ పరచటం అనవసరమనీ, కళకు ద్రోహం చెయ్యటమనీ శ్రీనివాసరావు నమ్మకం! ఏమాత్రం సృజనాత్మక శక్తి ఒక వ్యక్తిలో గోచరించినా, దాన్ని సక్రమ పద్ధతిలో ఆవిష్కరింప చెయటానికి కళాభిమానులు కృషి చేయాలి! పక్షపాత దృష్టితో విమర్శజేసి, వ్యక్తిలోని సృజనాత్మక శక్తిని నశింప జేయటానికి కొందరు పడే శ్రమ శ్రీనివాసరావు హృదయాన్ని గాయ పరుస్తుంటుంది! కొన్ని సందర్భాల్లో అలాంటి వ్యక్తుల్ని సౌమ్యతతో ఎదుర్కొన్నాడు కూడ! కనీసం ఆవ్యక్తుల్ని కూడ శత్రుస్థానంలో ఊహించుకోలేడు శ్రీనివాసరావు!

సాహిత్య సమావేశాలకు అధ్యక్షత వహించటమంటే ఆయనకెంతో సరదా! చమత్కారం ఆయన ప్రసంగానికి ఊపిరి వంటిది! ఆంధ్రాంగ్లములలో ప్రవీణుడు కాబట్టీ, వృత్తిరీత్యా లాయర్ అవటంచేత, శ్రీనివాసరావు అధ్యక్షోపన్యాసాలు ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేవి.

నాటక ప్రదర్శనలకు ప్రధాన అతిధిగా శ్రీనివాసరావు ఉంటేనే నిండుగా వుంటుందని నాటక సమాజాలవారికి మహామోజు! బ్రతిమిలాడించుకోకుండా అంగీకరించేవాడు! అలాగని, పాత్రదారుల్ని ఆకాశానికెత్తేవాడు కాదు. నిర్మాణాత్మకమైన సలహాలిచ్చి, వాళ్ల ప్రేమాభిమానాలను చూరగొన్నాడు.

అలాంటి శ్రీనివాసరావు వయస్సు ప్రస్తుతం యాభై. జీవితంలో మూడుభాగాలు గడచిపోయాయి! గడిచిపోయిన జీవితం ఎంత ఉదాత్తమైనదో అంత క్లిష్టమైనదీను ఆయన సామాజిక జీవితం ఉజ్వలంగా వెలిగిందని తెలిసిన వాళ్లనుకుంటారు. వ్యక్తిగత జీవితంలో చీకటి తెరలున్నాయని చాల కొద్ది మందికి తెలుసు! శ్రీనివాసరావు మానసికస్థితి అంత సులభంగా అర్థమయ్యేది కాదు! ఇతరులు తన బాధలు పంచుకోకూడదని శ్రీనివాసరావు ఉద్దేశం! పంచుకుని ఎవ్వరూ చేయగలిగింది లేదు!

పాతికేళ్ల వయస్సులో లాయర్‌గా ప్రాక్టీను ప్రారంభించాడు శ్రీనివాసరావు. కేసు స్టడీచేసి, గెలవటానికి అవకాశాలున్నదీ లేనిదీ క్లయింట్సుకు ముందుగానే తేల్చి చెప్పటం ఆయన ఆచారం! చాలమంది క్లయింట్సుకు శ్రీనివాసరావు పద్ధతి బాగా నచ్చింది! జయాపజయాలు దైవాధీనాలనీ శ్రీనివాసరావు కేసు చేపట్టితే 'న్యాయం' జరిగి తీరుతుందనీ క్లయింట్లకు అచంచలమైన విశ్వాసం ఏర్పడింది! కేసుల్లో ఓడిపోయి, డబ్బు నష్టపోయిన వాళ్లుకూడ విచారించే వాళ్లుకాదు. న్యాయం తమపక్షాన లేదనీ తృప్తిపడి, సంతోషించేవాళ్లు. అంచేత శ్రీనివాసరావు అనతి కాలంలోనే పేరు ప్రఖ్యాతులతో పాటు, డబ్బుకూడ విరివిగా సంపాదించాడు. డబ్బును ఖర్చు చేయటంలోనూ ఆయనకు నియమాలున్నాయి! సామాజిక ప్రయోజనానికి ఎవరు ఏ రూపంలో కృషిజేస్తున్నా, కోరిన వెంటనే ధన సహాయం జేసేవాడు. ఎక్కడైనా 'స్వార్థం' ఉందని పసికట్టితే మాత్రం, అలాంటి వ్యక్తుల్నికానీ, సంస్థలనుకానీ దగ్గరికి చేరనిచ్చేవాడు కాదు. సుఖంగా జీవితం గడపటానికి కావల్సిన అన్ని హంగులూ ఏర్పరచుకున్నాడు. దీపం ఉండగానే ఇల్లు చక్క దిద్దుకోవాలనే తాపత్రయంతో అన్యాయార్జితానికి పాల్పడకుండా, న్యాయానికి కట్టుబడి జీవితమంతా శ్రమపడాలనే తత్వంతో నికరాదాయంతోటే సరిపెట్టుకునే వాడు. ఎంత సరిపెట్టుకున్నా, వృత్తి రీత్యా ధనం పుష్కలంగానే చేరింది!

'జీవితం' అంటే శ్రీనివాసరావుది అని తోటి వాళ్ళు, కాని వాళ్ళు ముచ్చటపడిన మాట నిజం. బంధు వర్గంలో ఒక ప్రత్యేక గౌరవ స్థానాన్ని పొందిన మాటా అంతకన్నా నిజం. కానీ, శ్రీనివాసరావు జీవితం కూడ పరిపూర్ణమైంది కాదని, జీవితం పరిపూర్ణత సాధించుకోవాలంటే, మనస్సును చిత్రవధచేసే సమస్యలు తారసిల్లాలనీ ఒక్క శ్రీనివాసరావుకే తెలుసు.

ప్రాక్టీసు పెట్టిన రెండేళ్ళకు శ్రీనివాసరావుకు వివాహమయింది! తర్వాత రెండేళ్ళకు పుత్రోదయమైంది! పుత్రోదయంతో పాటు ఆయన గుండెల్లో ఉదయించింది సంతోషం కాదు! అపారమైన దిగులు! భార్య శాంతి ముఖంలో గూడు కట్టుకున్న దుఃఖాన్ని చూచినప్పుడు శ్రీనివాసరావు హృదయం కత్తి పీటతో తరిగినట్లయింది!

మనిషి జీవితంలోని ఆనందాన్ని ముక్కలుచేసి, అహంకారాన్ని నిర్మూలనం చేయగల అద్వితీయశక్తి ఒకటుందని శ్రీనివాసరావు మొదటిసారిగా గ్రహించాడు. తన మంచితనం మీద, హృదయ నిష్కల్మషత్వం మీద శ్రీనివాసరావుకున్న కొండంత విశ్వాసం కరిగిపోయింది. లేకపోతే పుట్టిన కొడుకు అంధుడుగా పుట్టాలా?

ఒంటికి పుట్టిన అవయవాన్ని అసహ్యించుకోలేనట్లే, పుట్టిన బిడ్డ గుడ్డివాడైనా అనురాగం పెంపొందక తప్పలేదు. శాంతి, శ్రీనివాసరావులు కంటికి రెప్పలా కాపాడుతూ పెంచుకున్నారు. ఒక్క దృష్టిదోషం తప్పితే బిడ్డలో మరేలాంటి అవలక్షణం లేదు. పసిమి రంగులో బొద్దుగా వుండేవాడు రవి. నిద్రపోతుండే సమయంలో బంతి పువ్వులాంటి రవి అందాన్ని చూచుకొని మురిసి పోతుండేది శాంతి! వాడు లేచి లేవగానే అశాంతితో వాపోయేది. అనుక్షణం నీడలా కనిపెట్టుకు నుండాలి! అసలే దురదృష్టవంతుడు! ఏ క్షణంలో ఏ హాని జరిగినా జరుగవచ్చు! అప్పటి దుఃఖానికి అంతుండదు! ఓ గుడ్డివాణ్ణి సాకటానికి ఎంత శ్రద్ధ కావాలో, ఎలాంటి లక్ష్యం వుండాలో దంపతులిరువురికీ అవగాహనయిపోయింది!

శ్రీనివాసరావు దక్షత వల్లనయితేనేమి, శాంతి పెంపకంలో ప్రత్యేకత వల్లనయితేనేమి, రవి మేలిమి బంగారంలాంటి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. మానవుని మనోవికాసానికి అంధత్వం అడ్డురాదని రుజువు చేశాడు. తల్లిదండ్రుల అసంతృప్తిని గ్రహించి దాన్ని తొలగించదలచు కున్నట్లుగా, ఎం.ఏ. లిటరేచర్‌తో డిస్టింక్షన్‌లో పాసయి వెనువెంటనే లెక్చరర్ ఉద్యోగంలో చేరాడు.

శ్రీనివాసరావుకు అప్పటి వరకూ అవ్యక్తమైన నిరాశ, నిర్లిప్తత తప్ప వేధించుకుతిన్న సమస్యంటూ లేదు. రవి ఉద్యోగంలో చేరటంతో సమస్య ఎదురైంది! సమస్య అతడు ఉద్యోగం చెయ్యటంతో కాదు! కాలేజీకి ఎలా పోయివస్తాడనీ కాదు! రవి జీవితానికి తోడు ఎవరు? జీవిత మన్నతరువాత కుంటిదైనా, గుడ్డిదైనా తోడు లేకుండా దొర్లటం కష్టం! అసహజం! అంధత్వం కోర్కెల్ని నిరోధించవచ్చునేమో కాని పూర్తిగా చంపేయలేదు! ప్రకృతిని చూచి పులకించలేక పోవచ్చు! ప్రకృతి వర్ణనలు చదివి, విని మధురానుభూతికి లోను కావటం తప్పనిసరి! స్త్రీ సౌందర్యాన్ని అంచనా వేయలేక పోయినా, సాంగత్యాన్ని వాంఛించటానికి తగిన వాతావరణంలో పెరిగాడు. జీవితంలోని మధురిమ రవికి కావాలి! దాన్ని చేకూర్చ వలసిన బాధ్యత తండ్రిగా శ్రీనివాసరావుది! డబ్బుంది, భవనాలున్నాయి! విద్య ఉంది, ఉద్యోగం ఉంది! లేనిదల్లా దృష్టి. ఆ ఒక్క లోపం చాలు జీవితం మోడువారటానికి.

ఎంత ఆప్తులనడిగినా కాదనిపించు కోవటం తప్ప ఫలితం శూన్యమని, అసలు యాచించటమే అవివేకమని కూడ భావించాడు శ్రీనివాసరావు!

శ్రీనివాసరావుకు ఒక్కతే చెల్లెలు—భారతి. భారతి భర్త నెల్లూరులో కిరసనాయిల్ ఏజంటు. ఆయన పేరు పరమేశం. పరమేశం ప్రయోజకుడు కాదని నెల్లూరు టౌనంతా తెలుసు. బంధువులకు తెలుసు. శ్రీనివాసరావు తండ్రికి కూడా తెలుసు. అయితేనేం? కిరసనాయిలు ఏజన్సీ సంపాదించి పెట్టి స్వర్గస్థుడైనాడు పరమేశం తండ్రి. రెండు చేతులా సంపాదించి కుప్ప పోస్తున్నాడు. ఆ కుప్ప పెరుగుతున్న కొద్దీ పరమేశానికి తప్పతెలివి ఎక్కువ కాసాగింది! చిన్న చిన్న చిల్లర వారను బాకీల్లు అప్పులివ్వటం, లెక్క రాసుకోక పోవటం అలవాటు చేసుకున్నాడు. ఎవరైనా శ్రేయోభిలాషులు వ్యాపారస్థుడికి అలాంటి అతి మంచితనం చెరుపని మందలిస్తే, వాళ్ళ మొహంమీద ఓ చిరునవ్వు గుప్పించేవాడు. ఏమైతేనేం, పరమేశం శని మహాదశలో వున్నాడు. మూడంతస్తుల బిల్డింగ్ కట్టించి, అంతస్తుకోరంగు వేయించాడు. గృహప్రవేశ ఉత్సవం దేవుడి పెండ్లిలా జరిగింది! ఇక అమ్మాయి పెండ్లి ఎంత ఘనంగా జరుపబోతాడోనని పరమేశం తెలివి తేటలు తెలిసిన వాళ్ళు చాల సంబరపడారు. అప్పటి వరకూ బతుకుతుంటే వారం రోజులు డి.పి.కి లోటుండదని ఉబ్బొంగి పోయిన ఫుట్‌పాత్ నివాసులు అనేకం!

పరమేశం భారతిల ఏకైక గారాబు బిడ్డ చంద్రిక! పేరుకు తగ్గ రూపు. రూపానికి తగ్గ గుణం అమరినయి! చదువు సంధ్యల్లోనూ వెనుక బడిన తరగతి కాదు. బి.ఏ. ప్యాసయింది! విప్పిన చీర మళ్ళీ విప్పేది కాదు! కాలేజీలో అందరి కళ్ళూ చంద్రిక మీదే! దగ్గరికి పోతే కిరసనాయిల్ వాసన అని గేలిచేస్తుండే వాళ్ళు కుర్రాళ్ళు! అబ్బురమైన తన సౌందర్యానికి మురిసి పోతుండేది చంద్రిక! మగ పిల్లలు మాత్రం విడిచి పడుకుంటు తనని కసిగా నవ్వుతుండే వాళ్ళు. అలాంటి చంద్రికను రవికి అర్పించమని కోరటం దుస్సాహసం అనుకున్నాడు శ్రీనివాసరావు. భారతి చెల్లెలే కావచ్చు! తనమీద ప్రేమాభిమానాలు తరగనివి కావచ్చు! కాని, ఓ గుడ్డివాడికి కూతుర్నిచ్చి గొంతు కోస్తుందా? చెల్లెలు మెత్తబడినా పరమేశం ఒంటికాలిమీద లేవడూ? మొహం వాచేట్లు చీవాట్లు పెడతాడు. రవి కోసం ఎంతటి అవమానాన్నయినా భరించగలడు. కాని, పని అనుకూలం కానప్పుడు, శుష్కంగా అభిమానాన్ని కోల్పోవటంలో అర్థం లేదు. శ్రీనివాసరావు ఎంతో లాజికల్‌గా ఆలోచించాడు. చెల్లెల్ని తన స్థానంలో ఊహించుకుని ఆలోచించాడు. అంధుడైన కొడుకు భవిష్యత్తును గురించే తనింత పరితాపం పొందుతున్నాడు. అప్సరస లాంటి బిడ్డను అంధుడికి ముడి పెట్టాలంటే తల్లి దండ్రుల హృదయం ఎంత ఘోషిస్తుందో, అంచనా వేసి అనుభూతి పొందాడు శ్రీనివాసరావు. ఏది ఏమైనా చెల్లెల్ని అర్థించ కూడదనే నిర్ణయానికి రావటానికి చాలా శ్రమపడ వలసి వచ్చింది!

సరిగా ఆ రోజుల్లోనే పరమేశానికి శని మహర్దశ దాటిపోయి, నిజమైన శని పట్టుకుంది! శని తన ప్రతాపం చూపించాడు. ఓశుభోదయాన తేలిన విషయ మేమిటంటే, పరమేశం అప్పుల్లో

మునిగి పోయాడని! ఏజన్సీ ఊడిపోయింది! బ్యాంక్ ఎక్కౌంట్ క్లోజ్ చేశాడు! మూడు రంగుల భవనాన్ని గుట్టు చప్పుడు కాకుండా అమ్మేసి, రూపాయికి పావలాల చొప్పున బాకీలు తీర్చటంలో మిగిలింది నిష్ప్రయోజకుడనే బిరుదు! చదువు ఎక్కువగా అబ్బని పరమేశానికి ప్రపంచం సెంట్రల్ జైలులాగ అర్ధాన్నంగా తోచింది! పోనీ ఏదో, అప్రాచ్యపు పని చేసి జైలుకు పోవటమే ఉత్తమమేమోననే ఊహకూడ రాంపోలేదు. కాని, తన్ను నమ్ముకున్న భార్యా—పెళ్లికి ఆరాటపడుతున్న కూతురు—వాళ్లే జైలుకు పోగలరు? స్వర్గంలో విహరించినా, స్మశానంలో కాపురం పెట్టినా వాళ్లకు తనూ తనకువాళ్లే తోడూ, దిక్కూ! భార్య, బిడను దిక్కులేని వాళ్లను చేయటానికి మనస్కరించదు. పువ్వులమ్మిన ఊళ్లోనే కట్టెలమ్ముకోవడానికి సిద్ధపడ్డాడు పరమేశం! చంద్రికచేత ఉద్యోగం చేయించటం ఇష్టం లేదు. వివాహం చెయ్యటానికి శక్తి లేదు. ఈ జన్మలో మళ్లీ తనిమహర్దశ పట్టుందనే ఆశ అంటే కన్నా లేదు. ఐపోయింది! భారతి మెళ్లోవున్న మంగళ సూత్రం కూడ కూటి కోసం పరస్కారమైంది! క్రమంగా పస్తులు ప్రారంభమైనవి.

శ్రీనివాసరావు చెల్లెలి విషాదస్థితి తెల్సుకున్నాడు. ఏదో చెయ్యాలని మనస్సులో తపన కలిగింది! వాళ్లు అంగీకరిస్తే ఓ లక్ష రూపాయలిచ్చి ఆదుకోవాలన్న సంకల్పంతో నెల్లూరుకు వెళ్లేడు శ్రీనివాసరావు. అతని గుండె చెరువయింది! నోరు మూగవోయింది! అయినా మాట్లాడక తప్పలేదు! ప్రయత్నించి ఒక సానుభూతి వాక్యం పలికాడోలేదో, పరమేశం కళ్లు శ్రావణ మేఘంలా వర్షించాయి! భారతి నేలకు అంటుకు పోయింది! చంద్రిక తన అందాన్ని దాచుకోవటానికి పడిన వ్యథను గమనించాడు శ్రీనివాసరావు! గుండెల్లో సముద్రం కల్లోలంగా వుంది! శరీరం హోమగుండంలో పడేసినట్లుగా వుంది! ఏం మాటాడినా కూలిపోయేట్లున్నారు చెల్లెలూ, బావ. తమలాగే శిథిలమైపోనివ్వమన్నట్లుగా వుంది వాళ్ల వాలకం. మరోమాట లేకుండా తిరిగి వచ్చేశాడు శ్రీనివాసరావు.

మేనమామ ఎందుకు వచ్చి వెళ్లాడో చదువుకున్న చంద్రిక సులభంగానే ఊహించ గలిగింది! పరిస్థితులను ఎదుర్కోవటానికి మానవుడు అశక్తుడు! పరిస్థితిని బాగుపరచు కోవటంలో అభిమానం అడుపడ్డే, ఫలితం శూన్యం! మనిషి తన వివేకాన్ని ఆపత్సమయంలో నైనా వినియోగించుకోక పోతే, పశువేనయ మని పిస్తుంది. నిజమే! మొన్న మొన్నటి వరకూ బావను వివాహం చేసుకోవాలనే అభిప్రాయం లేదు తనకు! చూస్తూచూస్తూ ఓ గుడ్డివాడి! భార్యకాగల విశాలహృదయం తనకు లేకపోయి వుండవచ్చు! తన ఐశ్వర్యంకూడ కొంత కారణం కావచ్చు! కానీ, తమ దశ మారిపోయింది! పూటగడిస్తే చాలు!

తల్లిదండ్రులకు చెప్పకుండా శ్రీనివాసరావుకు ఉత్తరం వ్రాసింది చంద్రిక. బావను వివాహం చేసుకోవటానికి సుముఖంగా వున్నాననీ, తమ దీనస్థితి మాత్రమే తన్నీ చర్యకు ప్రోత్సాహపరచ లేదనీ, తమ కుటుంబం ఉన్నత స్థితిలో ఉన్నప్పుడూ, పతనావస్థలోకి జారినప్పుడూ బావకు తననిమ్మని అడగలేక పోవటంలో మీ మనక్లేశాన్ని అర్థం చేసుకున్నాననీ, వివరంగా వ్రాసింది!

శ్రీనివాసరావు దానికి జవాబు వ్రాశాడు. ఉత్తరం చదువుకుని చంద్రిక ఆశ్చర్య పడ్డది! పరమేశం, భారతికూడ వెంటనే కలవర పడినా, నిదానంగా ఆలోచించి పరిస్థితుల్ని సమాధాన పరుచుకున్నారు. అన్నయ్య చాల మంచిపని చేశాడు! కష్టపడి సంపాదించిన రెండు లక్షల రొక్కాన్ని దేశరక్షణ నిధికి సమర్పించటానికి ఎంత త్యాగబుద్ధి కావాలి! తమ సంపదంతా పరుల పాలైంది! గడ్డిపోచ విలువ చేసే మంచికార్యం ఒక్కటి చేయలేదు. కనీసం కన్నబిడ్డ కళ్యాణం చెయ్యలేక పోయిన నష్టజాతకులు! తమకన్న అన్నయ్య అనేక రెట్లు ఉత్తముడు! అందుకనే సర్వోత్తమైన పని చేశాడు!

శ్రీనివాసరావు దాతృత్వాన్ని గురించి పరమేశంలోనూ ఉదాత్త భావమే కలిగింది! డబ్బువిలువ గ్రహించ లేకపోయిన మూర్ఖుడు తను. తను అనుభవించలేదు, ఏ సత్కార్యానికీ వినియోగపడక డబ్బంతా వ్యర్థమైపోయింది.

దంపతులు తమ ఆమోదాన్ని శ్రీనివాసరావుకు తెలిపారు: చంద్రిక సంపూర్ణంగా ఇష్టపడుతున్నది కాబట్టి రవికి ఇచ్చి వివాహం చెయ్యటంలో తమకభ్యంతరం లేదని స్పష్టంగా రాశాడు.

చెల్లెలు లక్షరూపాయల సహాయాన్ని అందుకున్నా అంత సంతోషించి ఉండకపోయేవాడు శ్రీనివాసరావు. రవి ఒక ఇంటి వాడుకాబోతున్నాడు. దాంపత్య జీవితం నెరప బోతున్నాడు! ఇక నుంచి రవి అంధుడు కాదు! నిజంగా రవే! ఏ ప్రలోభం వల్ల ఒప్పుకుంటేనేమీ, చంద్రిక ఔదార్యాన్ని మెచ్చుకుని తీరాలి; ఒక మనిషి జీవితంలో చీకటిని ఛేదించి, దీపం వెలిగించటం కంటే ఉత్కృష్ట కార్యం ఏముంటుంది! ముఖ్యంగా తన ఆవేదనను గుర్తించింది! తన నిస్సహాయ స్థితిని ఊహించి వుంటుంది! లేకపోతే ఇలాంటి శుభపరిణామం సంభవించడం సాధ్యమా! కల్లోనైనా ఆశించని అపూర్వ పరిణామం! చంద్రికకు తను జన్మాజన్మాలకు ఋణపడి వుంటాడు.

అనుకున్న తర్వాత పదిహేను రోజులలోపే రవితో చంద్రిక వివాహం అయింది! ఉభయుల ఖర్చు తానే భరించి, పెళ్లి ఘనంగా జరిపాడని పించుకున్నాడు శ్రీనివాసరావు.

రవి చంద్రికల దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగిపోతోంది. శ్రీనివాసరావు ప్రాక్టీసు చేయాలనే శ్రద్ధ తగ్గిపోయింది. సాధ్యమైనంత నిరాడంబర జీవితం గడుపుతున్నాడు! కొడుకు కోడలుకు తన వల్ల ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్త వహిస్తున్నాడు. వాళ్లకి అనుకూలమైన సమయాల్లోనే కాఫీ, భోజనం వగైరా అవసరాల్ని తీర్చుకోవటానికి శ్రీనివాసరావు అభిమానపడలేదు. వాళ్ల హృదయాలకి ఎంత చేరువగా పోగలిగితే తనకంత మేలు, తన శేషజీవితం వాళ్ల ఆదరాభిమానాలతో ముడిపడి వుంది! మనిషి ఒక దశలో కొంత స్వేచ్ఛను వదులుకోక

తప్పదు. జీవితంలో ఏదో నష్టపోతున్నట్లు కుమిలిపోవటం చాల మంది వృద్ధులకు పరిపాటి! కానీ, అది కేవలం వాళ్ల అవివేకం మాత్రమే.

అడపాదడపా సాహిత్య కార్యక్రమాలకు, నాటక ప్రదర్శనలకు హాజరవుతూవుంటే మనసు కెంతో ఉల్లాసంగా ఉంటోంది! రానురాను కోర్టుకు వెళ్లాలనే ధ్యాసే సన్నగిల్లిపోయింది. తండ్రి అవసరాలను గమనించి రవి అప్పుడప్పుడూ ఇస్తుంటే, ఐదూ, పదీ ఆనందంగాను, తృప్తిగాను, స్వీకరిస్తున్నాడు శ్రీనివాసరావు. కోరుకున్న జీవితం లభ్యమైనందుకు అదృష్టాన్ని కొనియాడుకో లేదు! పదే పదే చంద్రికకు మనసులోనే కృతజ్ఞతలు తెలపుకుంటున్నాడు!

ఆర్నెల్లు గడిచాయి! ఓరోజు రాత్రి పదిగంటల సమయంలో రవి, చంద్రిక ఘర్షణ పడటం లీలగావిన్నాడు శ్రీనివాసరావు. శ్రీనివాసరావు మనసుచలించింది! నిశ్చల తటాకంలో నీటి పెడ విసిరినట్లు గిల గిల కొట్టుకుంది హృదయం.

మెల్లగా లేచి వరండాలోకి వెళ్లాడు. అక్కడకి వాళ్ల మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి. వాళ్ల వాదనలోని తీవ్రతను బట్టి, దంపతులమధ్య తుఫాను చెలరేగినట్లు అర్థమైంది శ్రీనివాసరావుకు. ఆయితే కొంత కాలం నుంచి కొడుకు కోడలు మధ్య అనురాగం విరిగిపోయిందన్నమాట! ఇంత తొందరలోనే మళ్లీ అశాంతి —మరో కొత్త సమస్య తనకు!

'ఇదిగో చంద్రికా !! ఆఖరుసారిగా చెబుతున్నాను. నీవూ ఏదో ఉద్యోగంలో చేరు...

'బావా! నీవెన్ని సార్లు చెప్పినా, ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం నాకు కనిపించటంలేదు...

'ఇప్పుడు మనకున్నది ఈ ఇల్లు ఒక్కటే! నేనూ నా ఉద్యోగం! ఇవే మనకు ఆధారం!'

'ఈ ఆధారం చాలదా?'

'నీవు పొరబడుతున్నావు!'

'లేదు...'

'చంద్రికా...!' విసుగుతో కూడిన ఆవేశం వ్యక్తపరిచాడు రవి. అక్కడ చంద్రిక సంగతేమో కాని, వరండాలో నిల్చున్న శ్రీనివాసరావు గుండె లవిసిపోయాయి.

'ఏమిటి బావా నీ ఆవేశం! ఉద్యోగం చెయ్యమని నన్నెందుకింత వత్తిడి చేస్తున్నావో అర్థంకావటం లేదు...' అంది చంద్రిక గోముగా.

'నీవు బాధ పడతావని ఇన్నాళ్లూ చెప్పలేదు చంద్రికా!'

'బావా!'

'నేను అంధుణ్ణి!'

'ఇందులో దాపరికం ఏ ముంది బావా?'

'నా జీవితం క్షణక్షణగండం నూరేళ్లాయుషు లాంటిది! కళ్లున్న వాళ్లే సాయంత్రానికి ఇల్లు చేరతారని నమ్మకం లేని రోజులు. ఇక నాలాంటివాడి జీవితం ఎంత ప్రమాదకరమైందో నువ్వే ఊహించు ...'

'బావా! ఎంత చెడ్డ ఆలోచన చేస్తున్నావు? అసలిటువంటి ఆలోచన నీ బుర్రకెలా తట్టిందసలు!'

'ఇద్దరివ్యక్తుల మధ్య అనురాగం, అనుబంధం ఏర్పడినప్పుడు, పరస్పరం శ్రేయస్సును కూడ కాంక్షించటం ధర్మం! నీలాగా నేనూ నా ధర్మాన్ని నిర్వర్తించలేను! మార్గాన్ని ఆదేశించడం మాత్రమే నాకు చేతనయిన పని...

'బావా! నీ భయం, నీ ఆందోళన నాకు అర్థమైనాయి! మరి నామొర కూడా విను...'

'అదేమిటి?'

'స్త్రీగా నాలో ఎలాంటి ప్రత్యేకరాలేదు బావా! స్త్రీకుండవలసిన గుణాలన్నీ సహజంగా నాలోనూ వున్నాయి! ఒక ప్రత్యేక పరిస్థితిలో నిన్ను వివాహంచేసుకోవటానికి అంగీకరించినా, హృదయంలో మాలిన్యంలేదు! జీవితాన్నొక నాటకం చేసుకోవాలని తాపత్రయంలేదు. నిన్ను ఏవిధంగానూ మభ్యపెట్టాలనే దుర్బుద్ధిలేదు. జీవితాన్ని జీవించాలనే మనిషి కుండాల్సిన సగటుకోరికే నన్ని వివాహానికి ప్రోద్బల పరిచింది! జీవితంలో అవాంతరాలు మనకు చెప్పిరావు. వచ్చినప్పుడు శక్తికొలదీ ఎదుర్కొంటాం. ఒకప్పుడు పరిస్థితులను జయించనూవచ్చు! మరో సమయంలో నలిగిపోనూ వచ్చు! ఇది బావా జీవితంపట్ల నా దృక్పథం! ఉద్యోగం చెయ్యమని నన్ను వేధించకు...'

'చంద్రికా! మళ్లీ మళ్లీ నా అంధత్వాన్ని నానోటితోనే జ్ఞాపకం చేయించటం ఎందుకు? నన్ను జీవితాంతం వరకూ నమ్ముకోవటం, గాలిలో దీపాన్ని ఆరిపోవద్దని శాశించటం వంటిది!'

'బావా! అనవసరంగా నిన్ను నీవు కించపరచుకుంటున్నావు. నాగుండెల్ని కోస్తున్నావు...'

'చంద్రికా!'

'స్త్రీకి భర్త దీపం లాంటివాడు అది గుడ్డిగా వెలిగినా—గంభీరంగా వెలిగినా దీపమే! దీపం దీపమే!'

'అయితే నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో!'

'బావా!'

'నన్ను అనవసరంగా వాగించకు...'

'బావా!'

'వెళ్లవతలకు...'

' బావా !!!'

' నాతో మాట్లాడకు...'

ఇక వినలేక గబగబా ఇవతలకి వచ్చేశాడు శ్రీనివాసరావు. తలపోటుగావుంది! ఆలోచించటానికి కూడ ఆస్కారం లేని వ్యర్థ సమస్య వాళ్ళది! అల్పమైన సమస్య! ఎవరైనా వింటే నవ్వుకుంటారు. రవే చంద్రికను సరిగ్గా అర్థంచేసుకోలేదనిపించింది శ్రీనివాసరావుకు. తన లోపాన్ని భూతద్దంలో పెట్టి చూసుకుంటున్నాడు రవి. తన భయంలో కొంత నిజంవున్నా, పట్టుదల వహించవలసినంత భయంకరమైన సత్యంకాదది! పోనీ చంద్రికయినా, 'సరే' నంటే సమస్యే ఉండదుగా! తానూ తర్కానికి దిగింది! ఫలితం దంపతుల మధ్య అగాధం!

రోజులు గడుస్తున్న కొద్దీ రవి చంద్రికల మధ్యముభావం అధికంకాసాగింది! శ్రీనివాసరావు వాళ్ళకన్న మిన్నగా పరితపించిపోతున్నాడు! ఇద్దరూ ఒకదారి కొచ్చేవరకు తనకు నిద్రరాదు. కాదు! కంటికి నిద్రను కరువు జేయాలి! జీవితంలో తనకిది ఆఖరు సమస్యకావాలి!

ఆరోజు ఆదివారం దినచర్యలో అత్రుత పడాల్సిన అవసరం లేని రోజు! రేడియో వింటూకూర్చున్నాడు రవి. కాఫీ తీసుకొచ్చి చేతి కందించింది చంద్రిక. ఆసమయానికే శ్రీనివాసరావు వాళ్ళ దగ్గరికి చేరాడు. ఖాళీకప్పుకోసం వేచివుంది చంద్రిక.

'అలా కూర్చోమ్మా!' అన్నాడు శ్రీనివాసరావు తనూ సోఫాలో కూర్చుంటూ.

ఉలిక్కి పడ్డాడు రవి.

చంద్రిక రవి పక్కనే కొంచం ఎడంగా కూర్చుంది.

' రవీ! ' అన్నాడు శ్రీనివాసరావు మృదువుగా.

ఊ! కొట్టాడు రవి.


' మీరిద్దరూ శత్రువుల్లా మసలు కోవటం, నాకు నచ్చలేదు! మీ మధ్య శత్రుత్వాన్ని పెంచటం నాకసలే యిష్టంలేదు...'

'నాన్నా !'

' మీ సమస్య చాలా అల్పమైంది! మీ అపార్థాలవల్ల అనల్పమైకూర్చుంది! నేను పరిష్కారం చెప్పాలని వచ్చాను. మీరు ఉభయులూ కట్టుబడివుండాలి! లేకపోతే ఇక్కడ నా ఉనికి నిష్ప్రయోజనం!'

' నాన్నా!' రవి గొంతు జీరపోయింది.

' అంతేమరి! రెండు చల్లని గుండెల్లో మంటలెందుకు ప్రజ్వరిల్లాలో నాకు బోధ పడటంలేదు! మీ తెలివి తక్కువే దానికి కారణమని నా అభిప్రాయం! చంద్రిక చెప్పినట్లు జీవితాన్ని జీవించటం నేర్చుకోండి! మనకై మనం సమస్యల్ని సృష్టించుకుంటే జీవితం అంధకారం నీ ఆలోచనా మంచిదే! కానీ, భార్యను శాసించ వలసినంత మంచిది కాదు! దాంపత్య సుఖంలో నిప్పులు చెరుగుకో వలసినంత మంచిదికాదు! చంద్రికను అర్థం జేసుకో! ఇంతే నేను చెప్పగలిగింది...' చాల సూటిగా, గుండెలకు హత్తుకునేలా చెప్పాడు శ్రీనివాసరావు. అప్రయత్నంగానే రవి కుడిచెయ్యి పక్కనున్న చంద్రిక చేతికోసం వెదికింది! శ్రీనివాసరావు తృప్తిగా ఊపిరి పీల్చుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. తన 'గుడ్డిదీపం' వైపు ప్రేమగా చూచింది చంద్రిక. *



భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా ఆగస్టు 14 వ తేదీ అర్ధరాత్రి న్యూఢిల్లీలో పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించినప్పటి చిత్రం

అది కొండ- ఇది అద్దం

– వాకాటి పాండు రంగారావు

'సంభవామి యుగే యుగే' అని వాగ్దానం చేసిన ఆ భగవంతుడు కలికావతారం ఎత్తుతాడని నేను హామీ ఇవ్వలేను. కాని కల్కిగా అవతరిస్తే ఆయన తప్పకుండా మన గోదావరి జిల్లాలలో ఏ కోనసీమలోనో ఉదయిస్తాడని మట్టుకు చెప్పవచ్చు. అంతటి అందమైన సీమ అది.

పందలాది మైళ్ళమేర విస్తరించిన ఆ వరిపొలాలు, ఆ అరటితోటలు, ఆ కొబ్బరిచెట్లు కనులకు విందు చేస్తాయి. సింహం దర్శిమధ్యమ అయిన సుందరీమణి వలె, ఆ అందాల ఆకుపచ్చదనం మధ్య ఒంపులు తిరుగుతూ వెళ్ళే ఏ రోడ్డు మీదయినా ఓ పందమైళ్ళు వెళ్ళండి: కళ్ళూ మనసూ తెరుచుకువెళ్ళండి. ఆ అనుభూతి అనుభవైకవేద్యం.

ఇంత అందం మధ్య చటుక్కున మెరుస్తుంది చైతన్యం. చైతన్యం, ఉత్సాహం దీక్ష, సంతోషం, ఆశయం—లాంటి రూపం లేని గుణాలన్నిటికి కలిపి ఒక సాకారమైన సాక్ష్యం వుంది. దాని పేరు "ఆదర్శమహిళా మండలి". అది ఏలూరుకు 125 కిలోమీటర్ల దూరంలో, పండిత విల్లూరు అనే గ్రామంలో వుంది. రోజులో ఎప్పుడు వెళ్ళినా, ఏడాదిలో ఏరోజు వెళ్ళినా కళకళలాడుతూ వుంటుంది ఆ మండలి భవనం. అంతకు ముందునుండి ఆ గ్రామ జీవనానికి క్రొత్త అర్థం ఇస్తూ వచ్చిన ఆ మండలి ఆ భవనంలోకి 1967లో వచ్చింది. కుట్టుపని, బుట్టలుఅల్లడం, స్వెటర్లు వగైరా అల్లడం, పసిపిల్లలకు బాల్‌వాడి, గ్రంథాలయం, భజనమండలి, పెరటితోట పెంపకం ధాన్యపునిల్వ కోళ్ళ పెంపకం వంటి విషయాలలో శిక్షణ ఇట్లా ఎన్నో అంగాలు, ఎన్నో అంశాలు, ఎంతో సందడి, ఎంతో ప్రయోజనం.

వెయ్యిళ్ళున్న ఆ వూళ్ళోని మహిళలలో 150 మంది ఈ మండలి సభ్యురాండ్రు. వారిలో వంద మందికి పైగా అక్షరాస్యులు, అందరూ కాద్దో గొప్పో కలవాళ్ళే. అయినా కోతల సమయాలలో పనులుచేసి డబ్బు సంపాదిస్తారు. ఆ డబ్బుని తమ మండలికి ఇస్తారు. ఈమాట వింటే ఎంత ఆశ్చర్యం, ఎంత ఆనందం! ఆ సభ్యురాండ్రు తాము కుట్టిన చొక్కాలు వగైరాలు, అల్లిన ప్లాస్టిక్‌సంచులు, బుట్టలు మొదలయిన వాటిని ఆ చుట్టుప్రక్కల అంతర్వేది, ఆచంట మొదలయిన చోట్ల పుణ్యదినాలనాడు తీసుకువెళ్ళి దుకాణంపెట్టి అమ్మతారు.



మహిళామండలి భవనం

ఇంతటి ఉత్సాహపుఝరికి అధిష్ఠానదేవత శ్రీమతి బొబ్బా రామలక్ష్మమ్మ. ఆమె చల్లని పర్యవేక్షణ క్రింద అధికారుల సాయంలో పండిత విల్లూరులోని ప్రవహిస్తున్న చైతన్య స్రవంతి గురించి ఇట్లాగా అక్కడక్కడ వున్న ఎన్నో స్రవంతుల గురించి మన పత్రికలు చెప్పవు. ఎందుచేత?

అదుగో. ఆకాశాన్ని అందుకోచూచే కొబ్బరిచెట్లను తలదన్నే గోపురం. అది ఆచంట మల్లేశ్వరుడి ఆలయం. భక్తి ప్రపత్తులకు ఆలవాలమైన ఆ చోట, ఆ గుడిలోపల ఒక కొత్త వెలుగు కిరణం, వాళ్ళందరూ రైతులు, అనుభవజ్ఞులు. అయినా వ్యవసాయశాస్త్రం రోజురోజుకు మారిపోతున్న ఈ కాలంలో తాజా విజ్ఞానాన్ని అందుకోవాలి; అందుండి ఐశ్వర్యాన్ని పిండుకోవాలి. అందుకనే ఆ రైతులకొక శిక్షణతరగతి. వ్యవసాయంలో అతి క్రొత్త విషయాలను వారికి చెప్పడానికని శ్రీరామాంజనేయులు, ఆయన సహోద్యోగులు చార్టులు, పోస్టర్లు, క్షేత్రదర్శనాలు—అన్నివిధాల కృషి చేస్తున్నారు. రామాంజనేయులు అంటే గోపన్నపాలెం (ఏలూరు) రైతుశిక్షణా కేంద్రం ప్రధాన అధికారి. వారు చెప్పే 'ఐడియా'లను అతిశ్రద్ధగా ఆలకించి, వాటిని రేపు వెళ్ళి తమ తమ పొలాలలో ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకోవాలని తహతహలాడుతున్న ఆ పాతిక మంది రైతులు విద్యావంతులే. వాళ్ళకేమి కావాలో వాళ్ళకు తెలుసు. ప్రభుత్వము చేస్తున్న వాటిలో ఏదయినా లోపంవుంటే వాళ్ళు స్పష్టంగా సకారణంగా చెప్పగలరు. కావాలంటే వారిలో ఒకడయిన శ్రీ ఇ సుబ్రహ్మణ్యాన్ని అడగండి. ఆయన ఎం. ఎస్. సి పట్టపుచ్చుకున్నాడు!

విద్యావంతులైన రైతులు. విజ్ఞానానికై తహ తహలాడే రైతులు. విమర్శించడానికి వెనుకాడని రైతులు. మన ప్రజాస్వామ్యానికి ప్రాణాలు వాళ్ళుకారా? వీళ్ళ గురించి, ఈ పురుషులలో పుణ్యపురుషుల గురించి మన దిన వార మాసప్రతికా విలేకరులు రాయరేం? Why?

విశాఖపట్నం వెళ్తే, సముద్రపు ఒడ్డుకు వెళ్ళకుండా వుండరు గద. ఆ బీచిలో ఒకభాగం పచ్చగా. రంగురంగుల పూల



పండిత పిల్లూరు మహిళామండలి కార్యక్రమాలు

మొక్కలతో శుభ్రంగా, ముస్తాబు అవుతూఅవుతూ వున్న పెళ్ళికూతురిలా వుంటుంది. ఆ అలంకరణ అంతా ఎవరిదనుకుంటున్నారు? ''మున్సిపాలిటీవారి సహకారంతో మేము చేపట్టాము ఈ కార్యక్రమాన్ని'' అని చెబుతారు, ఆ జిల్లా వ్యవసాయశాఖాధికారి టి. కోటేశ్వరరావుగారు. ఆయనను చూస్తే ప్రభుత్వపు ఫైళ్ళమధ్య రెడ్‌టేప్‌ల పద్మవ్యూహం నడుమ ఇంతటి ఉత్సాహం ఎట్లా బ్రతికివుంది చెప్మా అనిపిస్తుంది. ఆయన అసిస్టెంటు శ్రీ ఆర్. ప్రభాకర్‌ను చూచినా అంతే .. "ఇంటికొక కొబ్బరిచెట్టు అన్నది మా నినాదం'' అంటాడాయన. అంతేకాదు. వాళ్ళందరి మనసుల లోనూ ఎన్నో సమస్యలను ఎదుర్కొని వాటన్నిటిని ఆచరణలో పెట్టాలి. ఆ ఆచరణకే ఒక తపస్సు. ఆ తపస్సు నుండి లభించబోయేదే మనం అందరమూ కలలుగనే భారతదేశం.

విశాఖపట్నానికి ఎనిమిదిమైళ్ళల్లో వున్న బక్కనపాలెం వెళ్ళండి. 'నిర్దాణమైన పల్లె. దయలేని ఎర్రటి గరుకునేల. ఆ ఎడారి మధ్య ఒయాసిస్సులో యువకరైతు శిక్షణకేంద్రం రూపొందుతూంది. తరగతులకు అధ్యాపకుల నివాసానికి, విద్యార్థుల నివాసానికి, కార్యాలయానికి—ఇట్లా చకచక భవనాలు లేచిపోతున్నాయి. ఆ ప్రక్కనే బావి. బావినుండి పంప్. పంప్‌నుండి ఏనుగు తొండంలోపడే ఆ నీటిధారతో తన దాహాన్ని తీర్చుతున్న ఆ నేల తల్లి వేరుశెనగ, అరటివంటివికాక ఎన్నో రకాల కూరగాయలను ఇస్తూంది. ఆ కూరగాయలు విశాఖ సూపరబజార్‌లోకి వస్తాయి. ఆంధ్రదేశపు యువకరైతుల పాలిట పెన్నిధి కాబోతున్న ఈ శిక్షణా కేంద్రానికి ఆస్ట్రేలియావారు ఎనిమిది లక్షల రూపాయలు ఇచ్చారు.

ఇవన్నీ చెప్పి ''చేయవలసినపని ఇంకా ఎంతో వుంది..—'' అన్నారు కోటేశ్వరరావు. అవును మరి. ప్రగతి అంటే మాటలా?

ఆ కోటేశ్వరరావుతోబాటే సింహాచలం వెళ్తే గ్రామసేవక్ శ్రీ వసంతరావును కలపగలరు, వసంతరావుకు బోలెడు పనులు. రైతులను కలవాలి, ఎరువుల గురించి కనుక్కోవాలి, క్రొత్తగా పండించబోతున్న 'క్యూ' 'జయంట్ క్యూ' రకాల అనాసమొక్కల మాగోగులు చూడాలి. ఆ భూమి, ఆ కొండచరియ అంతా దేవస్థానం వారిది: వారితో మంచిచెడ్డా మాట్లాడాలి. స్టేట్‌బ్యాంక్‌వారు సన్నకారురైతుల కిచ్చే ఋణాల గురించిన చర్చలు చేయాల్సిన పనులు వుంటాయి, ఇక్కడకూడా 'క్రొత్తగాలి' వీస్తూంది. వరాహ నరసింహస్వామి వారికి ఆ చందనకాపే ఇష్టమో, అక్కడి కొండ సంపెంగపూలే ఇష్టమో లేక 'క్యూ' అనాసపళ్ళే ఇష్టమో తేల్చుకోవడం కష్టమే మరి... ఆ స్వామివారి అవస్థ గుర్తించి. ''విశాఖపట్నం బీచి ఒడ్డున నాటిన కొబ్బరిమొక్కలన్నీ మా నర్సరీలోనివేనండీ... అవి 'మలయన్ సెమిటాల్' రకాలు .. వాటిని మేమే మన రాష్ట్రమంతటికీ సరఫరా చేస్తున్నాము,'' అంటారు అనకాపల్లిలోని జిల్లా వ్యవసాయాధికారి శ్రీ సీతారామరావుగారు. వారివెంట వెళ్ళి ఆ నర్సరీలోని కొబ్బరి మొక్కలనూ, వివిధ రకాల కూరగాయల మొక్కలనూ చూస్తుంటే, సీతారామారావుగారూ ఆయన సహాయకులూ చెప్పే వివరాలు వింటుంటే 'అబ్బో' అనిపిస్తుంది.

ఆ ప్రక్కనే వున్న చెఱకు పరిశోధనా కేంద్రానికి వెళ్ళితే చెఱకు చరిత్రలోకి అడుగు పెట్టినట్లయింది. ఆ కేంద్రం ఒకటికాదు రెండుకాదు అరవైఏళ్ళ నుండి చెఱకు పైరుకు చేసిన సేవలు ఏమిటో దేశమంతటికీ తెలుసు. అప్పుడా కేంద్రానికి ప్రధాన అధికారిగా వున్న శ్రీ ఎం. లక్ష్మీకాంతంగారి పేరు చెబితేచాలు చెఱకు మొక్క మరికొంత ఎక్కువ పంచదార నిచ్చేస్తుంది. అంతటి దిట్ట ఆయన, అంతటి అనుభవం ఆయనది. ఆయన సహచరులందరిలోనూ అదేశ్రద్ధ, అదేదీక్ష ఆ వందా పైచిలుకు ఎకరాల మేర తిరిగి చూచితే వారి నేటికృషి రేపటి చెఱకు కృషికి ఎంత మేలుచేయగలదో తెలియగలదు. అది అనకాపల్లిలోని చెఱకు రైతులకు బెల్లం వ్యాపారులకు ఇదివరకేతెలుసు అని ఆ పరిశోధనా కేంద్రంలో అడుగిడగానే స్వాగతం చెప్పే పొడుగాటి 'కో_419' స్తంభంచెబుతుంది. 'కో_419' అనేది రైతు జనాదరణ పొందిన ఒక చెఱకు రకం. ఆ స్తంభాన్ని ఆ వూరి వ్యాపారులు తమ కృతజ్ఞతకు సూచకంగా ఆ కేంద్రానికి ఇచ్చారు: ప్రతీ 'సీజన్' లోనూ లక్షా పదివేల టన్నుల బెల్లందాక అమ్మే చిన్న వూరిలోని వ్యాపారులు తమ రాబడిలో కొంత భాగాన్ని విడిగా సమీకరించి ఆ నిధిలో విద్యాసంస్థలను నడపడమే గాక సాహిత్యపు గోష్ఠుల నేర్పాటు చేయడం, ప్రముఖ సాహితీ పరులను పిలిపించడం చేస్తుంటారు.

"లక్ష్మీకాంతం చెఱకుకేంద్రం—కో 419 బెల్లం—కృతజ్ఞతా స్తంభం—కాదంబా వ్యాపారం—కలదు కలదు సాహిత్యం—" అంటూ అబ్‌స్ట్రాక్ట్ బొమ్మగీస్తే అది అనకాపల్లికాదూ?

ఇంత అందమైన బొమ్మను, జీవం వున్న బొమ్మను మనజర్నలిస్టులు, గీచి చూపరు. కారణం? ఆ కొస నుండి ఈ కొసకొస్తే నాగార్జునసాగరం. అంటే నవశకానికి ఆరంభం. జవహర్లాల్ అన్నట్లు ఈ యుగానికి ఆలయం. ఆ శ్రామిక వనిత ఎవరో చెప్పినట్లు 'దీపం'.

ఎండి బీటలు వారిన ఆ శిలామయమైన భూమి నేడు కళకళలాడుతూ పచ్చగా పైరులతో నిండివున్నది అన్నా. వాలి వడలిన

మొక్కలు నిటారుగా గర్వంగా ఈ నాడు నిలచినవన్నా, లేని నీటి కోసం అలమటించి నిస్సహాయులుగా వుండిన ఆ జిల్లాల రైతు జనం ఈ రోజు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారన్నా—అసలు ఆ ప్రాంతపు భౌతికస్వరూపం, అక్కడి ప్రజల జీవన సరళి మారిపోయినవన్నా నాగార్జునసాగర్ కుడి (జవహర్) కాలువ, ఎడమ (లాల్‌బహదూర్) కాలువలు తెచ్చిపోసిన ప్రాణమే! ఎడమ కాలువ క్రింది భూమికి క్రొత్తక్రొత్త పంటల రుచులు నేర్పిస్తున్న నర్సరావ్ పేటలోని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ ఎం. కోటేశ్వర రావు తాము చేస్తున్న ప్రయోగాలు అమలుపరుస్తున్న ప్రణాళికలు. ప్రవేశపెడుతున్న క్రొత్తపైర్లు, సస్యపరివర్తనాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అనర్గళంగా చెప్పేస్తుంటే—మనకు ప్రగతిమూర్తి విశ్వరూపంలో ఒక అంశం గోచరించినట్లవుతుంది.

అయ్యో! ఇట్లా చూచినకొద్దీ చూడవలసినవి ఎన్నో వున్నాయి. విన్న కొద్దీ వినవలసినవి, విన్పించవలసినవివున్నాయి. కాని మనకు అట్లా చూపించవలసినవారు విన్పించవలసినవారు తమ పత్రికలను, తమ టేప్ రికార్డర్లను, తమ కెమేరాలను ఇంకాఇంకా బాగా ఉపయోగించుకోవాలి. ఆరుపేజీలలో ఆరుపేజీలూ రాజకీయాలతోనే నింపేసే వారికి. ఇక మనుష్యుల గురించి, ప్రాణం ఆశ, దుఃఖం, ఉత్సాహం, భయంవున్న వ్యక్తుల గురించి చెప్పడానికి చోటు ఎక్కడ వుండగలదు?

Man is always interested in another man అన్నది పత్రికారచనలో మొదటి పాఠం. వ్యక్తిని వదలివేసి ఊళ్ళ గురించి మాట్లాడితే విసుగుపుట్టక తప్పదు. మామూలు ఊక దంపుడైతే అన్పించక తప్పదు. సత్తెనపల్లిలో వెంకయ్య గురించి వివరంగా చెప్పండి, సింహాచలం కొండమీద ఎరకయ్య శ్రద్ధగా వింటాడు అట్లా కాక, అంకెలతో, నిర్వచనాలతో, సమాసాలతో, 'పెద్ద' వారి అభిభాషణలతో మీరు చెప్పబూనితే ఎవరూ నిజంగా పట్టించుకోరు. ఎంచేతనో మరి ఇంత ప్రాథమికమైన విషయాన్ని మన విలేఖరులు పట్టించుకోరు. "వి. ఐ. పి" లే కాదు "వి. ఓ. పి." (వెరి ఆర్డినరీ పర్సన్స్) కూడా పత్రికల మొదటి పుటలమీద, పతాక శీర్షికలలో కనపడదగిన వారేనని మన సంపాదకులు భావించడంలేదు. అంచేత జీవ తో తొణికిసలాడ వలసిన mass media లు చల్లగా జీవచ్ఛవాల్లా వుంటాయి.

అంటే అంతా జ్యోతిర్మయమని కాదు. చీకటి వుంది. చచ్చేంత చీకటివుంది. కాని అక్కడొకటి అక్కడొకటిగా చిన్నచిన్న దీపాలు వెల్గించారు; వెల్గిస్తూవున్నారు. వాటినిచూడండి. ఆ వెలుగు గురించి చెప్పండి. అందంగా ఆసక్తిదాయకంగా చెప్పండి. ఆ వెలుగును వెయ్యిపెట్టి గుణించండి. ఈ కాలంలో ఈ దశాబ్దాలలో బ్రతకడం అన్నది మన అదృష్టం. మన దేశానికి మనం ఈ మాత్రం చేయగల్గితే అది మనకు గర్వకారణం కాదూ!

స్వాతంత్ర్యోద్యమము తెలుగు నవలా వికాసము

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు

(గతసంచిక తరువాయి)

తెలుగు నవలారంగంలో నూతనాధ్యాయాన్ని ప్రవేశపెట్టి, తెలుగు పాఠకులకు మరో ఉత్సుకతను కలిగించి అత్యుత్తమమైన నవలలనెన్నింటినో అందించిన మహామహులు విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, గుడిపాటి వేంకటచలం. ఈ మూర్తిత్రయం రచనలతో తెలుగు ప్రజలు మిక్కిలి ప్రభావితులైనారు. ఈ ముగ్గురు తమ సమకాలిక జాతీయోద్యమాలను, సాంఘిక ఆర్థిక పరిస్థితుల్ని చిత్రిస్తూ రమణీయమైన రచనలనెన్నింటినో చేసేరు. వీరిపైన ఆంగ్ల నవలా సాహిత్యంలోని కాల్పనికోద్యమం, హేతువాద సిద్ధాంతాల ప్రభావం కనుపిస్తుంది.

కాల్పనికోద్యమ ప్రభావంతో రచనలు ప్రారంభించిన విశ్వనాథ అగ్రగామియై, పాశ్చాత్యసంపర్కమైన హేతువాదానికి ప్రతిద్వందిగా మన భారతీయ ఆధ్యాత్మికవాదాన్ని నిలిపి, ఆ వాదాన్ని సహేతుకంగా, సోపపత్తికంగా సమర్థిస్తూ పెక్కు నవలలు వ్రాసి, మరుగుపడివున్న ఆర్ష సాంప్రదాయంలోని పవిత్రతను, విశిష్టతను తన యుక్తి చాతుర్యంతో, సమర్థించిన మహా రచయిత. సర్వాంధ్ర సాహిత్య నవలా వికాసంలో ఆయన మధ్యాహ్న మార్తాండుడు. ఆయన చేతిలో తెలుగు నవల వెలుగు ముద్రణతో వెలుగొందుతూ పరాకాష్ఠనందుకొని, తెలుగు ప్రభలు దేశంనలుమూలల ప్రసరిస్తున్నాయి. నవలాప్రక్రియ ఆయన చేతిలో పరుసవేది అయింది.

విశ్వనాథుని సృష్టిసర్వస్వాన్ని వ్యాఖ్యానం చేయగల అనంత శక్తియుక్తులున్నాయి. ఆశక్తితో సర్వవిషయాలను అవగతం చేసుకొని నవలా రచనలో ముందుకు విజృంభించినాడు. ఆయన చేతి నుండి వెలువడిన అసంఖ్యాక నవలల్లో ఏకవీర, వేయిపడగలు, మాబాబు, చెలియలికట్ట, విష్ణుశర్మ ఇంగ్లీషుచదువు, మిక్కిలి ప్రశస్తమైనవి.

కాల్పనికోద్యమం ప్రభావంతో వచ్చిన నవల ఏకవీర, దీనిలో ధర్మానికి, ప్రేమకు జరిగిన సంఘర్షణ ముఖ్య ఇతివృత్తం. వీరభూపతి, కుట్టాన్, ఏకవీర, మీనాక్షి ప్రేమోదంతాలు, విరహవేదనలు, ఇందులో ప్రతిభావంతంగా చిత్రితమైనాయి. ఇక మాబాబు నవల కరుణరస ప్రధానమైన ఉత్తమరచన. 'చెలియలికట్ట'లోని వస్తువు మన వివాహ వ్యవస్థకు సంబంధించినది రంగడు, సీతారామయ్య, రత్నావళి, బైరాగి అందులోని ముఖ్య పాత్రలు. 'విష్ణుశర్మ ఇంగ్లీషుచదువు' విశ్వనాథ మానవాతీత ఊహాలకు, భావశబలతకు పతాక. ఆయన అమరలేఖిని నుండి వెలువడిన అసంఖ్యాక నవలల్లో వేయి పడగలు వేయి పుటల నాక్రమించిన మహత్తరమైన నవల. అది ఆయన మహాసృష్టి. దీనిలో ఆయన మూడుతరాల కథను తీసికొని మన హైందవ సంఘంలోని చాతుర్వర్ణ్య వ్యవస్థను, వర్ణాశ్రమధర్మాన్ని, పాశ్చాత్య సంపర్కంతో ఆ వ్యవస్థకు కలిగిన నష్టాలను వర్ణించాడు. దీనిలో గత రెండు వందల సంవత్సరాలలోను మన సంఘంలో వచ్చిన మార్పులను, ప్రతిభావంతంగా చిత్రించి చూపేడు. ఇది ప్రాత కొత్తల మేలుకలయిక. ధర్మారావు యీ రెండు వ్యవస్థలకు సంగమ స్థానం. ధర్మారావు ఈ నవలకు నాయకుడు. ఆయనచుట్టూ కథంతా నడిచింది. ఈ నవల వల్ల మనకు ఆంగ్ల పరిపాలనలో సంభవించిన కష్టనష్టాలన్నీ అవగతమౌతాయి. నవలలోని కేశవరావు మన విద్యలను, కళలను, నాగరికతను పునరుద్ధరించటానికి పుట్టినకారణ జన్ముడు. ఇక రంగారావు పాశ్చాత్యనాగరికతా వ్యామోహంతో పతనమై సర్వభ్రష్టుడైన జమీందారు. రాఘవరావు గాంధీమహాత్ముని అడుగుజాడలలో నడిచి జాతీయోద్యమంలో పాల్గొని తన సర్వస్వాన్ని కోలుపోయిన ఉత్తమ దేశభక్తుడు. గాంధీమహాత్ముని హరిజనోద్ధరణను, ఖద్దరు ప్రచారాన్ని, మద్యపాన నిషేధోద్యమాన్ని నడిపిన జాతీయవాది. ఉత్తమ దేశభక్తుడు. త్యాగధనుడు.

ఇందలి గిరిక, గణాచారి, రంగాజమ్మ, కృష్ణప్పనాయుడు హరప్పనాయుడు, రుక్మిణమ్మారావు పరమోత్కృష్టమైన మానవ ధర్మాన్ని ప్రతిపాదించే మహామహులు.

సనాతనమైన ఈ దేశంలో ఎన్ని మార్పులు సంభవించినా 'పతివ్రతకు' హానిరాదు. ఈ పతివ్రతామతల్లుల నాశ్రయించే సర్వభారతీయ ధర్మం, జాతీయభావాలు ప్రవర్ధమానమౌతూ

వుంటాయని ఆయన యీ నవలలో ప్రతిభావంతంగా చిత్రించి చూపేడు. ఈ వేయిపడగలు ఆంధ్రప్రజా జీవితానికి ప్రతిబింబంగా సృష్టింపబడిన ఉత్తమనవల.

రెండవ వాడైన బాపిరాజు దృష్టిలో, సృష్టి అంతా కళాత్మక మైంది. సృజనాత్మకం, సౌందర్యోపాసనతో నిండిన ఆయన నవలల్లో నారాయణరావు, తుఫాను, కోనంగి, గోనగన్నారెడ్డి, హిమబిందు పేర్కొనదగినవి. ఈయన రచనల్లో జాతీయోద్యమం, ఆంధ్రత్వం ప్రస్ఫుటంగా గోచరిస్తూ వుంటాయి అన్ని రంగాల్లోను సంస్కరణను ఆశించే ప్రముఖ రచయిత ఆయన. తన జీవితాన్ని ఈ మహత్తర సాహిత్య సృష్టికి అంకితంచేసి, తనజన్మను ధన్యం చేసుకొన్న ప్రముఖుడాయన. ఆయన స్వయంగా జాతీయవాది. దేశభక్తుడు.

నారాయణరావు నవలలోని 'నారాయణరావు' తుఫానులోని త్యాగయిత్రి, శార్వరీభూషణుని పాత్రలను ఎంతో చక్కగా ఆయన తీర్చిదిద్దాడు. కోనంగి మన జాతీయోద్యమానికి, జాతీయ భావాలకు విశేషం.

ఆంధ్రదేశంలోని సర్వవిషయాలు ఆయన రచనల్లో ఇతివృత్తాలై కనుపిస్తుంటాయి.

మూడవవాడయిన చలం సృష్టించిన నవలలన్ని ఆంధ్రదేశంలో ఒక పెద్ద గాలిదుమారాన్ని లేపాయి. ఆయనకు కీర్తితోపాటు, అపకీర్తిని పుష్కలంగా తెచ్చి పెట్టాయి. ఆయన తన నవలల్లో వాడిన భాష, భావాలు అనితరసాధ్యమైనవి. మిక్కిలి తీవ్రమైనవి.

మన సాంఘిక ఆచార వ్యవహారాలను, తీవ్రంగా విమర్శించి, నిర్భయంగా అందులోవున్న లోటు, తిరుగుబాటు తత్వాన్ని ఎంతో సామర్థ్యంతో ప్రచారంచేసి, దాంతో సాహిత్యంలో గొప్ప ప్రగతిని సాధించాడు. స్త్రీలలో దాగివున్న నిగూఢమైన శక్తిని ఆయన గుర్తించినంతగా మరే యితర రచయిత గుర్తించలేదు. స్త్రీ శక్తిని ఆయన బహిరంగపరచినట్లు మరెవ్వరు బహిరంగపరచలేదు.

మన వివాహ వ్యవస్థపైన ఆయన విప్లవ ధ్వజం ఎత్తి స్త్రీ పురుషుల మధ్యవున్న అడ్డుగోడలను తొలగించి, స్వేచ్ఛా తత్వాన్ని బలపరుస్తూ మైదానం, దైవమిచ్చిన భార్య, శశిరేఖ, బ్రాహ్మణీకం మొదలైన నవలలనెన్నింటినో వ్రాసేడు. పతితలన్నా, అనాథలన్నా ఆయనకెంతో అభిమానం. ఆ అభిమానంతో వారి హృదయంల్లో అట్టడుగున దాగివున్న రహస్యాలనెన్నింటినో వెలికితీసి బహిరంగ పరచాడు. ఎవరి పొగడ్తలకు, తెగడ్తలకు భయపడక తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చిన సాహసికనవలా రచయిత ఆయన.

పై ముగ్గురు రచయితలు తెలుగు నవలా సాహిత్యం పైన తమ విభిన్న రచనలతో చెరగరాని ముద్రవేసి తమ ప్రత్యేక వ్యక్తిత్వాలను ప్రదర్శించుకున్నారు.

పై తరానికి చెందిన మరి కొందరు ప్రతిభావంతులైన నవలా కారులున్నారు. వారిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, ముని మాణిక్యం నరసింహారావులు పేర్కొన దగినవారు.

సుబ్రహ్మణ్యశాస్త్రి 'మధురానురాగం', 'స్మశానవాటిక' 'రక్షాబంధం' ఎన్నదగిన నవలలు. ఇవికోనసీమ వాతావరణాన్ని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబింపజేస్తూ వుంటాయి

మొక్కపాటి 'బారిష్టరు పార్వతీశం' 'ఏకోదరులు' రెండు మిక్కిలి ప్రశస్తమైన నవలలు. బారిష్టరు పార్వతీశం నవల చక్కని హాస్యరసంతో నిండిన ఉత్తమ రచన. ఇది యావదాంధ్రుల మనఃఫలకాలపైన చెరగని ముద్ర వేసింది. ఏకోదరులు కరుణ రస ప్రధానమైన చక్కని రచన.

నరసింహశాస్త్రి 'నారాయణభట్టు' రుద్రమదేవి, మల్లారెడ్డి, మూడు నవలలు ఆంధ్రదేశంలో ప్రశస్తమైన చాళుక్య, కాకతీయ రెడ్డిరాజ్యాలకు ప్రాతినిధ్యం వహించే చారిత్రాత్మక నవలలు.

మునిమాణిక్యం గృహసంబంధమైన ఇతివృత్తాన్ని గ్రహించి, భార్యా భర్తల మధ్య ఉన్న ప్రేమ కలాపాలను, కష్టసుఖాలను. హృద్యమంగా సులభ శైలిలో, అందరికి అందుబాటులో వుండేట్లు వ్రాసి సమాజంలో చైతన్యాన్ని కలిగించేడు. దీక్షితులు నవల కరుణ రస ప్రధానమైన మంచి రచన. ప్రపంచమే తనదిగా భావించి అందరి కొరకు జీవించిన వ్యక్తి దీక్షితులు.

ఈ తరానికి చెందిన మరో రచయిత పిలకా గణపతిశాస్త్రి ఆయన 'మనాంబిక' నాయక రాజుల కాలంనాటి చరిత్రను ఆధారంగా తీసికొని మలచబడింది.

ఈ తరంలోను బెంగాలీ, అరవ, మహారాష్ట్ర, ఆంగ్లభాషల నుండి ఎన్నో నవలలు అనువదింపబడి ప్రచారణనుపొందాయి.

1930–47 సంవత్సరాలమధ్య తెలుగు నవల మరో మలుపుతిరిగి మరికొంత ముందుకు పోయింది. ఉప్పుసత్యాగ్రహోద్యమం, ద్వితీయ ప్రపంచ సంగ్రామం, క్విట్ ఇండియా ఉద్యమాలవంటి జాతీయ సమస్యలతో పాటు యం. యన్. రాయ్ మానవతా వాదం గూడ ఈ తరం రచయితలను ప్రభావితుల్ని చేశాయి. దానితో పాటు అమెరికా, ఐరోపాఖండాలలో మానసిక శాస్త్రాన్ని, అతి వాస్తవికో పరిస్థితులను ఆధారం చేసికొని ఎందరో ప్రముఖులు పెక్కు నవలలు వ్రాసి ఆయా దేశాలల్లో జగద్విఖ్యాతులైనారు.

పై ఉద్యమాల ప్రభావంతో గోపీచంద్. జి. వి. కృష్ణరావు, బుచ్చిబాబు, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి ఉత్పల లక్ష్మణరావు మొదలైన వారు సంఘాన్ని వ్యక్తులను భిన్నదృక్కోణం నుంచి పరిశీలించి, పరామర్శించి విభిన్న మానవ మానసిక ప్రవృత్తులను యథాతథంగా చిత్రిస్తూ రచనలు చేయసాగేరు.

ఈ రచయితల్లో అగ్రగణ్యుడు గోపీచంద్ ఈయన హేతువాద దృక్పథంతో 'పరివర్తన', అసమర్థుని జీవితయాత్ర' అనే నవలలను వ్రాసి కృతకృత్యుడైనాడు మనిషికి ఎన్నివున్నా ఆతని సంపూర్ణ విజయానికి 'మనస్తత్వమే', అతిముఖ్యమైనదని

'అసమర్థుని జీవితయాత్ర'లో సీతారామారావు పాత్రను ఆధారంగా తీసుకొని నిరూపించాడు. ఈ నవల మన తెలుగు నవలా వికాసానికి మంచిగీటు రాయియై భాసించింది.

గోపీచంద్, రాయ్ తాత్విక సిద్ధాంతాన్ని, అరవిందుల ఆధ్యాత్మిక చింతనను ప్రతిబింబింపజేస్తూ సంఘాన్ని మరో దృక్కోణం నుంచి పరామర్శిస్తూ కొన్ని ఉత్తమ నవలలు వ్రాసేరు

స్త్రీ యొక్క సంపూర్ణత్వాన్ని గ్రహించి, పిల్లతెమ్మెర, గడియపడని తలుపులు మెరపుల మరకలు వంటి ఉదాత్తమైన నవలలను వ్రాసేరు.

గడియపడని తలుపులలోని 'కోటీశ్వరమ్మ' మెరపుల మరకలలోని 'ఉషారాణి' పిల్లతెమ్మెరలలోని 'శమంతకమణి' మొదలైన వారిలో ఆయన సంపూర్ణంగా స్త్రీత్వాన్ని దర్శించ గలిగేరు.

జి వి కృష్ణారావు 'కీలుబొమ్మలు' నవలలో తెలుగు గ్రామసీమలలోని రాజకీయ పక్షాలను, వాటికి బలియైపోయే అమాయకుల్ని అభాగుల్ని, వారి చిత్రవిచిత్రమైన మానసిక ప్రవృత్తుల్ని ఎంతో చక్కగా వివరించాడు. ఈ నవలలోని డాక్టర్ పాత్ర మిక్కిలి విచిత్రమైంది. ఈ పాత్రను గురించి ఎన్నో తర్జనభర్జనలు జరిగాయి. 'చివరకుమిగిలేది' అనే నవలా రచనతో బుచ్చిబాబుకు తెలుగు నవలా సాహిత్యంలో ఒక ప్రముఖ స్థానం లభించింది ఈ నవలలోని కథానాయకుడు 'దయానిధి'. ఇతడు జీవితరంగంలో అడుగడుగునా పెక్కు అసందిగ్ధ పరిస్థితుల నెదుర్కొంటూ, ఎన్నో ఒడుదుడుకులతో జీవయాత్ర సాగించి, తల్లిశీలాన్ని గురించిన అపనిందతో సతమతమైపోతూ పెక్కు మానసిక వ్యధలకు గురి అవుతాడు. చివరకు విజయవంతంగా ఒక ఒడ్డుకు చేరగలుగుతాడు. చివరకు మిగిలేదేమిటి? అనే ప్రశ్న ఎప్పుడూ అతణ్ణి వెంటాడుతుంది. ఆ ప్రశ్న ప్రశ్నగానే నిలచిపోయింది.

జీవితాన్ని గురించి వ్యక్తులను గురించి బుచ్చిబాబు వ్యక్తం చేసిన భావాలు మిక్కిలి విలువైనవి. గనుకనే ఆయన ప్రభావం ఎందరో యువ రచయితలపైన పడింది.

బుచ్చిబాబు వలెనే తెలుగు పాఠక లోకాన్ని బాగా ఆకర్షించిన మరోవ్యక్తి రాచకొండ విశ్వనాథశాస్త్రి. ఆయన వ్రాసిన 'అల్పజీవి' తెలుగు నవలా సాహిత్యంలో ధ్రువతారయై భాసిస్తోంది. ఈ నవలలోని సుబ్బయ్య జీవితం చాల విచిత్రమైంది. అల్పజీవియైన సుబ్బయ్య ఒక పంతులమ్మ సహాయంతో తాను చిక్కుకున్న విషవలయం నుంచి సురక్షితంగా బయట పడటం ప్రతిభావంతంగా చిత్రితమైంది. కలం చేపట్టిన నాటినుండి, నేటివరకు అసంఖ్యాకంగా రచనలుచేసి సంఘ ప్రగతికి తోడ్పడిన ఘనుడు కొడవటిగంటి కుటుంబరావు. ఆయన సృష్టించిన పాత్రలన్నీ మనకు సంఘంలో ప్రతిచోట అనుక్షణం ప్రత్యక్షమౌతూనే వుంటాయి ఆయన వ్రాసిన 'చదువు' అనే నవల అశేషప్రజానీకాన్ని ఆకర్షించి, ఆనంద పరవశుల్ని చేసింది.

ఉప్పల లక్ష్మణరావు వ్రాసిన 'అతడు-ఆమె' నవల విలక్షణమైన మంచికథకు నిదర్శనం. స్త్రీ పురుషులిద్దరూ తమ స్వగతాల ద్వారా దాంపత్య జీవితంలోని కష్టసుఖాల్ని వ్యక్తం చేసుకుంటారు. ఈ నవల స్వీయ చరిత్రవలె నడుస్తుంది.

ఈ దశలో తెలుగు నవలావికాస పరిధి బహుముఖీనమై మిక్కిలి విస్తృతి జెందింది. రచనా సంవిధానంలో, ఇతివృత్త సేకరణలో, సంభాషణలు నడపడంలో, వర్ణనలు చేయడంలో, మానవ మానసిక ప్రవృత్తుల్ని చిత్రించటంలో రచయితలు దూర దృష్టిని ప్రదర్శించి రచనలు చేయసాగేరు-దాదాపు అన్ని నవలల్లోను జాతీయతాభావం ప్రస్ఫుటంగా కనుపిస్తుంది.

ఇంతవరకూ భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించకముందు జరిగిన నవలాప్రగతిని గురించి చర్చించుకున్నాం. ఇప్పుడు స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట మన తెలుగు నవలా వికాసంలో వచ్చిన మార్పులను గురించిన విషయాన్ని కొంత ముచ్చటిస్తాను.

పైన పేర్కొనిన నవలా రచయితల్లో ఇప్పటికీ చాలా మంది పుంఖాను పుంఖంగా రచనలు చేస్తూనే వున్నారు. వారితో పాటు కొత్తవారు కొందరు ఈ సాహిత్య క్షేత్రంలో ప్రవేశించి, భిన్న దృక్పథాలతో విభిన్న సమస్యలను ఇతివృత్తాలుగా స్వీకరించి, రచనలు చేయసాగేరు.

దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం లభించిన తరువాత ఎన్నో మార్పులు వచ్చాయి. అంతకు ముందున్న పరిస్థితులు తారుమారైపోయాయి వెనుకటితరం రచయితలు ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించటానికి, స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరచటానికి ప్రజలలో జాతీయ భావాలను రేకెత్తించి, కార్యోన్ముఖులను చేయటానికి, సాంఘిక దురాచారాలను రూపుమాపటానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రచనలు చేసారు. ఆ ప్రభావంతో సంఘంలో కొంత మార్పు వచ్చినా, స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఆశించినంత ఫలితం కనుపించలేదు. దానితో ప్రజలు రచయితలు విసిగిపోయినారు. మరల తమకు కలిగిన నిరాశను నిస్పృహను ప్రతిబింబింపజేస్తూ రచయితలు రచనలు చేయదొడగేరు.

కాంగ్రెసు పార్టీకి ప్రతిద్వంద్విగా దేశంలో ఎన్నో పార్టీలు బయలుదేరాయి. ఆయా పార్టీల సిద్ధాంతాలను, ఆశయాలను అనుసరించి ఎన్నోరచనలు వెలువడ్డాయి.

వాటిలో ముఖ్యంగా పేర్కొనదగిన రచనలు చేసినవారు మహీధర రామమోహనరావు. ఈయన సామ్యవాద సిద్ధాంతాన్ని బలపరుస్తూ 'రథచక్రాలు', 'ఓనమాలు' అనే నవలలు వ్రాశాడు. వీటిలో ఆయన రైతుకూలీల దైనందిన జీవిత సమస్యలను, వారు అడుగడుగున పొందే బాధలను ప్రతిభావంతంగా చిత్రించాడు. ఇందలి రచనాశైలి అంతఉదాత్తంగా లేకపోయినా, తాను చెప్పదలచుకొన్న విషయాన్ని హృదయానికి హత్తుక పోయేలా చిత్రించాడు.

గంగినేని వెంకటేశ్వరరావు "వైకుంఠపాళిలో కల్లోలం" అనే నవలను వ్రాసి, మన పౌరాణిక నమ్మకాలను, మూఢ

విశ్వాసాలను వ్యంగ్యంగా విమర్శిస్తూ నేటిమానవుడు తనకు గల అతీతమైన మేధాసంపత్తితో, విజ్ఞానశాస్త్ర సహాయంతో ప్రకృతి పైన, దేవతలపైనా సాధించిన మహత్తర విజయాలను వ్యక్తం చేశాడు.

1947-48 సంవత్సరాలలో తెలంగాణా ప్రాంతంలో చెలరేగిన అల్లకల్లోలాలను, రజాకార్ల దౌర్జన్యాలను చిత్రిస్తూ వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజలమనిషి' అనే నవలను వ్రాసి ఆ నాటి ప్రజా ఉద్యమ స్వరూపాన్ని, తెలంగాణా ప్రాంతం ప్రజలు అనుభవించిన కడగండ్లను రూపుకట్టినట్లు చిత్రించాడు. ఈ నవలలోని గంగులు పాత్ర మిక్కిలి ఉదాత్తమైంది. ఇతడు తన సర్వస్వాన్ని ప్రజల కొరకు అర్పించిన త్యాగధనుడు. ఈ కోవకు చెందిన మరొక నవల కవిరాజమూర్తి 'మైగలీబుహుం' అనేది సామ్యవాద సిద్ధాంతాన్ని, సోషలిస్టు ఉద్యమాన్ని, రజాకార్లు తెలంగాణాలో జరిపిన దుండగాలను ఆయన చక్కగా వర్ణించి చూపేడు.

1950 వ సంవత్సరం తరువాత ఈ నవలా సాహిత్యం, ప్రజల ఆదరణను, అభిమానాన్ని ఎంతో చూరగొన్నది. దీనికిగల ముఖ్యకారణం ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, విశాలాంధ్ర ఆంధ్ర జ్యోతి వంటి ప్రముఖ పత్రికలు, ప్రచురణ సంస్థలు పెక్కుపోటీలను నిర్వహించి, ఉత్తమ నవలకు బహుమతులిచ్చి రచయితలనెందరినో గౌరవించాయి.

పారిశ్రామిక ప్రగతి, రైతుకూలీల అభ్యున్నతి, పంచవర్ష ప్రణాళికలు, పొదుపు ఉద్యమం, కుటుంబనియంత్రణం, జాతీయ మశూచి నిర్మూలనం, పంచాయితీరాజ్ వంటి నూతన సమస్యలతో పాటు, అనాది కాలంనుంచి వస్తూన్న ప్రేమ, వివాహం, వర్ణాశ్రమ ధర్మాలు, హరిజన సమస్య, వ్యవసాయకూలీల సమస్య, సవతి తల్లులు, ఉమ్మడి సంసారపు విచిత్రాలను ఇతివృత్తాలుగా స్వీకరించి, ఆర్థిక, రాజకీయ సాంఘిక రంగాలలో స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట వచ్చిన అసంతృప్తిని ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలలో సంభవించిన దైనందిన జీవిత సమస్యల్ని, గుమస్తాలు, ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు, వారి దుర్భర జీవితాలు, ఉద్యోగ సమస్యలు అధికారులు, వారి దర్పాలు అన్నినవలల్లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. రచయితలు ఈ విషయాలను వివరిస్తూ ఎన్నో నవలలు అసంఖ్యాకంగా వ్రాసి ఆంధ్రభారతిగళంలో అలంకారాలుగా అర్పించి, తమ భక్తి ప్రపత్తులను వెల్లడించుకున్నారు.

గ్రామాలనుంచి జీవనోపాధికొరకు పట్నాలకు వచ్చిన అమాయకులు పడే బాధలను వర్ణిస్తూ వ్రాసిన బలివాడ కాంతారావు దగాపడిన తమ్ముడు, పోరంకి దక్షిణామూర్తి 'వెలుగు వెన్నెల గోదారి' అనేవి ముఖ్యమైనవి.

జన్మచేత తెలుగువాడు కాకపోయినా నటరాజన్ (శారద) అనే పేరుతో తెలుగుదేశంలోని మధ్యతరగతి కుటుంబాలలోని బాధలనుచిత్రిస్తూ 'మంచీ-చెడూ' 'అపస్వరాలు' అనే ఉత్తమ నవలల్ని వ్రాసి తెలుగు జీవితాన్ని ప్రభావితం చేసేడు. వాసమూర్తి 'అబల, అల్పజీవులు; పోతుకూచి సాంబశివరావు ఉదయకిరణాలు, అన్వేషణ, మధ్యవర్గ ప్రజల కష్టసుఖాలను పరిశీలన చేస్తూ, వారి సమస్యలలోని యదార్థాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. ఈ కోవకే చెందిన మరి రెండు నవలలు పిలిసెట్టి శ్రీరామమూర్తి రచియించిన 'దత్తత' మమత అనేవి. భాస్కరభట్ల కృష్ణారావు 'యుగసంధి' కొడాలి రచియించిన 'తారుమారు' హీరాలాల్ మోరియా గుడిమెట్లు' వ్యక్తి వికాసానికి ప్రాధాన్యతనిచ్చి వ్రాసిన ఉత్తమ నవలలు.

వర్తమాన రచయితలో ముళ్లపూడి వేంకటరమణ వ్రాసిన 'రక్తసంబంధం' 'రాజకీయ బేతాళపంచవింశతి', 'ఋణానందలహరి' మిక్కిలి ఉత్తమమైనవి. ఈ నవలల్లో ఆయన అధికార దర్పంతో పెత్తందార్లు చేసే అన్యాయాలను, అక్రమాలను రాజకీయపార్టీలలో ఉన్న అవకతవకలను, అతి సూక్ష్మదృష్టితో విమర్శించి ఏ వ్యక్తి మనస్సుకు నొప్పి కలుగకుండా వ్యంగ్య ధోరణిలో హాస్యరసం జాలువారేట్లు రచనలుచేసి ఆంధ్రపాఠకుల మెదడుకు మంచి పని కల్పించాడు.

కందుకూరు లింగరాజు మరొక ఉత్తమ రచయిత. ఆయన సంఘాన్ని వ్యక్తులను పరిశీలించి 'దిగనిమెట్లు' అనే నవలను వ్రాసేడు. ఆయన శైలి, భాష ఒక ప్రత్యేకమైన పంథాలో వుండి పాఠకుల్ని చివరంటా చదివింపగలుగుతాయి.

ధనికొండ హనుమంతరావు శృంగార రసప్రధానమైన నవలలనెన్నింటినో వ్రాసేడు. రంగధాం, ఆడివిష్ణు తెలుగు జీవితాన్ని తెలుగు దనాన్ని ప్రతిబింబింపజేస్తూ చాలా నవలలు వ్రాసేరు. సి. ఆశ్వద్ధ వ్రాసిన మూసినతలుపులు ఇటీవల వెలువడ్డ నవలల్లో చాలామంచిది. ఈనాడు తెలుగుదేశంలో పురుషులతో పాటు స్త్రీలు ముందంజవేసి అనేక నవలలు వ్రాసి మంచిపేరు ప్రతిష్ఠలను సముపార్జించుకొంటున్నారు. స్త్రీలు తమస్వంత సమస్యల్ని మనసులో నిగూఢంగా దాగివున్న భావాలను పురుషులకన్న ఎంతోచక్కగా వివరించి చెప్పగలరన్న భావాన్ని ఈ నాటి రచయిత్రులు యదార్థం చేసి చూపెడుతున్నారు.

చలం కూతురు సౌరీస్ అనావీర్ అనే నవలను వ్రాసి స్త్రీ మనస్సులో దాగివుండే అనేక సమస్యలను వ్యక్తంచేసింది. ఇల్లిందుల సరస్వతీదేవి 'పండుగ బహుమానం' అనేనవల నేటి మన సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా భాసిస్తోంది. అలాగే పి. శ్రీదేవి వ్రాసిన 'కాలాతీత వ్యక్తులు' అశేష ఆంధ్రప్రజల ఆదరాభిమానాల్ని చూరగొన్న ఉత్తమ శ్రేణినవలల్లో ఒకటి. దీనిలో ఆమె పెక్కు నూతన భావాలను, సిద్ధాంతాలను లేవదీసి వాటికి చక్కని సమన్వయంచేసింది. ఈనాటి తెలుగు వారపత్రికల్లో ప్రముఖంగా దర్శన మిచ్చేరచయిత్రులు ముప్పాళ రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి మొదలైన వారు ముఖ్యులు.

ముప్పాళ రంగనాయకమ్మ బలిపీఠం, కృష్ణవేణి, కూలిన గోడల వంటి ఉత్తమ శ్రేణి రచనలుచేసి పెక్కు సంస్థల వద్దన బహుమతులనందుకొన్న రచయిత్రి. ఆమె వ్రాసిన బలిపీఠం నవల వర్ణాంతర వివాహాలను, అందలి సాధక బాధకాలను ఎంతో ప్రతిభావంతంగా చిత్రించింది. ఈ నవలలోని 'అరుణ' పాత్ర

అద్భుతమైంది. తాత్కాలిక దేశాలతో జరిగే వర్ణాంతర వివాహాలలో సంభవించే చిక్కులను విడమరచి చూపించి, వాటివల్ల సంభవించే అనర్థాలను నిశిత దృష్టితో పరిశీలించి చూపింది.

కోడూరి కౌసల్యా దేవి చక్రభ్రమణం, శంఖుతీర్థం, శాంతినికేతనంవంటి ఉత్తమనవలలను వ్రాసి ఆంధ్రస్త్రీల మనస్తత్వాన్ని అతి వాస్తవిక దృష్టితో పరిశీలించి చిత్రించింది.

"పతనం" అనే నవలను హెచ్. కావేరిబాయి వ్రాసింది. ఇది మంచి నవలల్లో ఒకటి "తంజావూరిపతనం" అనే నవలను మల్లాదివసుంధర, తంజావూరి నాయక రాజుల చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని వ్రాసింది. దీనికి ఆంధ్ర విశ్వవిద్యాలయ బహుమతి గూడ లభించింది. ఇది చారిత్రిక నవలలకు మేలుబంతి.

కొమ్మూరి వేణుగోపాలరావు, తెన్నేటి నాగేశ్వరరావు, ఎర్రం చంద్రశేఖరం, మధురాంతకం రాజారాం, ఆర్. యస్. సుదర్శనం వంటి ప్రముఖ నవలాకారు లెందరో ఈనాడు మన తెలుగు నవలా సాహిత్య వికాసానికి పుష్టిని తుష్టిని సమకూర్చే ఉత్తమ రచనలు చేస్తున్నారు. అలాగే రచయిత్రులలో శిఖామణి వేంకటరమణ, వాసిరెడ్డి సీతాదేవి, కొలిపాక రమాదేవి, పబ్బరాజు ఇందిరాదేవి మొదలైన వారుగూడ యీ సాహిత్యంలో మంచి ఫలసాయాన్ని తీసి ఆంధ్ర మహాజనుల కందిస్తున్నారు.

వీరేగాక ఇంకా ఎందరో రచయితలు, రచయిత్రులు మన తెలుగు నవలా వికాస ప్రగతికి జాతీయ భావనకు ప్రతిబింబంగా వుండేట్లు అసంఖ్యాకంగా రచనలు చేస్తున్నారు.

అలాగే బాలబాలికల విచిత్రమైన మనస్తత్వాన్ని చిత్రిస్తూ చింతా దీక్షితులు సూరీ, సీత, వెంకి లీలాకుమారి వంటి రచనల నెన్నింటినో చేసి బాలవాఙ్మయ శాఖాభివృద్ధికెంతో సేవచేసేరు. నోరి నరసింహశాస్త్రి 'కర్పూర ద్వీపయాత్ర', కొడవటిగంటి తండ్రికొడుకులు, పిలకా గణపతిశాస్త్రి పువ్వులరాణి పేర్కొనదగిన ఉత్తమ బాలవాఙ్మయ నవలలు.

ఈ స్వల్ప పరిధిలో నాటినుండి నేటివరకు మన తెలుగు నవల వివిధదశలలో, స్వదేశ, విదేశ రచనల ప్రభావంతో ప్రతిభావంతులైన మన రచయితల రచయిత్రులచేతుల్లో పొందిన క్రమ వికాసాన్ని విజ్ఞాత్మకంగా సమీక్షించి జిజ్ఞాసువులకు సమర్పిస్తున్నాను. ★

తెలుగు అకాడమి లక్ష్యాలు

(20వ పుటనుండి)

ఇదిగాక, 1971లో నేషనల్ బుక్ ట్రస్ట్ వారు సంకల్పించిన తెలుగు అనువాదకుల కార్యగోష్ఠిని అకాడమి భవనంలో జరిపించి తెలుగు అకాడమి సర్వ విధాల తోడ్పడినది.

లిపి సదస్సు

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన లిపి సంస్కరణ సంఘం వారు సమర్పించిన నివేదికను పరిశీలించి తెలుగు లిపిని సంస్కరించడానికి తగిన సూచనల నీయవలసినదిగా ప్రభుత్వము 1970 ఆగస్టులో అకాడమిని కోరినది. లిపి సంస్కరణ విషయమై దేశంలో ఉన్న భిన్నాభిప్రాయాలనన్నింటిని సేకరించి ఈ విషయంలో నిష్ణాతులు, అనుభవజ్ఞులు అయిన విద్వాంసుల అభిప్రాయాలను క్రోడీకరించి ఒక నివేదికను సిద్ధం చేయడమేకాక, ఈ విషయానికి ఒక తుది రూపం ఇవ్వడం కోసం 1971 సెప్టెంబరు 4,5 తేదీలలో అకాడమి ఒక సదస్సు ఏర్పాటు చేసినది. ఇందులో ఎందరో విద్వాంసులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. తరువాత సదస్సు నివేదికను ప్రభుత్వ పరిశీలనకు పంపడమైనది.


డిగ్రీస్థాయిలో భాషాధ్యయన కాలాన్ని తగ్గించి ప్రత్యేక విషయాల అధ్యయన కాలాన్ని హెచ్చించవలెనని విద్యావేత్తలు నిర్ణయించినప్పుడు ఇంటర్మీడియట్ స్థాయిలో భారతీయ భాషల అధ్యయన కాలాన్ని మరిరెండు పీరియడ్లు హెచ్చించడం జరిగినది. అదనంగా వచ్చిన కాలాన్ని ఎట్లా సద్వినియోగం చేయవలెనో నిర్ణయించడానికి అకాడమి కళాశాలాధ్యక్షుల, ఉపన్యాసకుల సమావేశమొకటి ఏర్పాటు చేసినది. సమావేశంలో చేసిన సూచనలు ఇంటర్మీడియట్ బోర్డువారి ఆమోదానికి పంపడం జరిగినది.

ఇంటర్మీడియట్ తరగతులకు పాఠ్య విషయాలయిన నవల నాటకాలను నిర్ణయించడంకోసం తెలుగు అకాడమి పోటీలు ఏర్పాటు చేసి, పోటీలలో వచ్చిన పుస్తకాలను నిపుణులచే పరీక్ష చేయించి మంచి పుస్తకాలు ఎన్నిక కావడంలో విశ్వవిద్యాలయాలకు, ఇంటర్మీడియట్ బోర్డువారికి సాయపడుతున్నది.

అంతర్జాతీయ పుస్తక సంవత్సరాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఒక పుస్తక ప్రదర్శనాన్ని హైదరాబాదులో ఏర్పాటు చేయవలెనని తెలుగు అకాడమి సంకల్పించినది. జాతీయ అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థలు, పుస్తక విక్రేతలు ఈ ప్రదర్శనలో పాల్గొనడం జరుగుతుందని ఆశిస్తున్నాము.

పైని పేర్కొన్న విధాలుగా తెలుగు అకాడమి నాలుగేళ్లుగా కృషిచేస్తున్నది. తెలుగు ప్రజల, విద్యార్థుల, అధ్యాపకుల, ఆచార్యుల, విశ్వవిద్యాలయాధికారుల సహాయ సంపత్తి పొంది అకాడమి పనిచేస్తున్నది. ఇతోధికంగా అందరి ఆదరాభిమానాలు లభిస్తూనే ఉంటాయి అనీ అకాడమి ఇంకా కృషి చేయడానికి ఇవి దోహదకారులవుతాయి అనీ మా అందరి విశ్వాసము. విజ్ఞాన శాస్త్రుల బోధన మాతృభాషలో జరగవలెననీ, అది ఆధునిక భాషలో ఉండవలెననీ ఆశించిన మన పెద్దల ఆశలను యథాశక్తిగా తెలుగు అకాడమి ఆచరణలో పెట్టుతున్నది. ★

సీరియల్ :



9

కాపయ్య అన్నమదేవుణ్ణిగూర్చి ఆలోచించుకుంటూ వెడుతున్నాడు. అతడెంత ప్రయత్నించినా అన్నమదేవుణ్ణి మరువలేకున్నాడు ఆ కళ్లే—ఆ నవ్వులే—ఆ మాటలే అన్నమదేవునితో వున్నప్పుడేదో ఒక విధమైన మధురానుభూతి కలిగించి కాపయ్యకు. ఇప్పటికీ అది అతని హృదయంలో ఎక్కడో దాగుడుమూతలాడుతూనేవుంది

అన్నమదేవుణ్ణి విడిచిరావడం వల్ల కాపయ్యకేదో పోగొట్టుకొన్నట్లుంది. అతనిలో ఏదోకొరత ఏర్పడినట్లయింది. ఆ కొరతేమిటో, ఆ లోటేమిటో అతనికి తెలియరాలేదు.

అన్నమదేవుని చూపుల్లోని తళతళలను, అతని నవ్వులలోని నిగనిగలను, అతని మాటల్లోని మధురిమలను మరువలేకపోయాడు కాపయ్య. అతడే తానా ఏమి అని అనుకొన్నాడు.

అన్నమదేవునికి అంత సాన్నిహిత్యమేర్పడుతుందని, ఇద్దరి హృదయాలు అంతగా బంధించబడుతాయని, అతడంటే తనకంత అనురాగమేర్పడుతుందని కాపయ్య ఎన్నడూ అనుకోలేదు. ఏ పూర్వానుబంధమో వారినిద్దరిని ఆలాగా దగ్గరకు తీసింది.

అన్నమదేవుని గూర్చి ఆలోచనలు కాపయ్యకే ఆశ్చర్యాన్ని కలిగించినవి. ఎందుకతడు ఆ యువకుణ్ణి మరువలేకున్నాడో అతనికే అర్థం కాలేదు. అతనిలో ఏదో సమ్మోహనశక్తి వున్నది. ఆ శక్తికి తాను వశుడై పోయాడు.

ఇంకా రెండుదినాలుండి వెళ్లమని అన్నమదేవుడన్నప్పుడు తనకచ్చటుండాలనే అనిపించింది. ఈ కార్యభారంవల్ల త్వరగా రావలసి వచ్చింది. తన హృదయంలో అతడంత చోటెందుకు చేసుకొన్నాడో, తన్నతడంతగా ఎందు కాకట్టుకొన్నాడో కాపయ్యకప్పటికీ అర్థం కాలేదు

ప్రతాపరుద్రనగరం దగ్గర పడింది. కాని అచ్చట అలజడి ఏమీలేకున్నది. అది చాల ప్రశాంతంగావున్నట్లున్నది. ఎందుకా నగరమంత ప్రకాశవంతంగా వున్నది. కాపయ్యకు ఆశ్చర్యం వేసింది. దానితోపాటు ఆదుర్దా గూడ ఎక్కువయింది.

కాపయ్య తన అశ్వాన్ని హెచ్చరించాడు. కొంత జోరుగా వెళ్లసాగాడు అతని వెంటనున్న అశ్వికులు గూడ అతనితోపాటే వేగంగా వెళ్లబూనుకొన్నారు. నగరాన్ని సగ్గరించినకొద్దీ అతని హృదయం వేగంగా కొట్టుకొన్నది. ఏదో ఆవేశాన్ని సూచింపసాగింది.

నగరంమీద శత్రువులేమైనా దాడిజేశారా? నగరాన్ని నాశనం గావించారా? లేకుంటే ఆ పట్టణమెందుకంత నిశ్శబ్దంగా వుంటుంది? అతనిగుండె మరింత వేగంగా కొట్టుకొన్నది. కాపయ్య నగరంలో ప్రవేశించాడు. అచ్చటచ్చటా ఒకరిద్దరున్నారు గాని వారేమీ మాట్లాడలేదు. కాపయ్యను చూస్తూనే కళ్లనీళ్లు బెట్టుకొని తొలగి వెళ్లారు. అది కాపయ్యకు మరింత ఆందోళనను కలిగించింది. కాపయ్య జోరుగా తనకార్యాలయం వైపు వెళ్లాడు ఎదురుపడిన వారెవ్వరూ మాట్లాడలేదు వారి ముఖాలు వెలవెలబోతున్నాయి.

"ఎందుకు వీరంతా ఇలా వున్నారు?" తనలోతానే ప్రశ్నించుకొన్నాడు.

ఎదురుపడిన మరొకరితో, "అందరూ ఎందుకలా వున్నారు? నగరమంతా చిన్నబోయినట్లున్నదెందుకు?" అని ప్రశ్నించాడు.

ఎదురుపడిన ఆ వ్యక్తి భోరుమన్నాడు. ఏమీ చెపలేకపోయాడు. ఏదో ప్రమాదమే జరిగిందనుకొన్నాడు కాపయ్య. అతణ్ణి మాట్లాడించి ప్రయోజనం లేదనుకొని ముందుకు వెళ్లాడు.

కార్యాలయాన్ని దగ్గరిస్తూనే భటుడు కనబడ్డాడు. అతడు గూడ దీనంగానే వున్నాడు. దగ్గరకువచ్చి గుర్రాన్ని పట్టుకొన్నాడు. కాపయ్య ఆదుర్దాతో క్రిందికిదిగి, "ఎందుకందరూ చింతగా వున్నారు? ఏమయింది?" అని ప్రశ్నించాడు. అతని మాటల్లో వేగము, అమితమైన ఆదుర్దా ప్రతిబింబించాయి.

"మన నాయకులు పోయారు" ఆ భటుడిక మాట్లాడ లేక పోయాడు. అతడు వెక్కి-వెక్కి ఏడవసాగాడు. కాపయ్య కతని మాటలేమీ అర్థం కాలేదు.

"ఏ నాయకుడు?" ఆదుర్దాతోను ఆ వేగంతోను ప్రశ్నించాడు కాపయ్య.

"మన ప్రభువు ప్రోలయ్య నాయకులు"

"ఆఁ ప్రోలయ్య నాయకుడా? ఎందుకు? ఏమి జరిగింది?" ప్రశ్న మీద ప్రశ్న వేశాడు కాపయ్య.

"గుండె ఆగి మరణించారు."

"మరణించారా! ఎప్పుడు?" మూడు దినాలయింది. మీ కోసంగూడ ఎదురు చూచారు మీరు రాలేదు ఒక దినమాగి మీరిక రారని దహన క్రియలు గూడ పూర్తి చేసి మీకోసం మనుష్యుల్ని పంపారు.

"వారురాలేదే?"

"వారు దగ్గరితోవలో వెళ్లివుంటారు."

"అన్న మంత్రిగారెచ్చటున్నారు?"

"వారు ఆ గృహంలో వున్నారు."

"దక్కిన వారెచ్చటున్నారు?"

కొందరు నాయకులు నగరంలోనే వున్నారు. చాలమంది నిన్ననే వెళ్లారు.

కాపయ్య కంతా అర్థమయింది అతని గుండె ప్రేలిపోయింది దుఃఖం భరించ లేక పోయాడు వెనువెంటనే అన్న మంత్రి వున్న గృహంలోకెళ్లాడు.

అన్న మంత్రి విచారంగా వున్నాడు

అచ్చటికి వెడుతూనే కాపయ్య నిశ్శబ్దంగా కూచున్నాడు. ఏమి మాట్లాడాలో అతనికి తోచలేదు. కళ్లు చెమ్మగిల్లి కంఠం రుద్ధమయింది. హృదయం నలిగిపోయింది.

"ఎప్పుడు వచ్చింది?" ప్రశ్నించాడు అన్న మంత్రి.

"ఇప్పుడే" అన్నాడు కాపయ్య. ఆ ఒక్కమాట ఎంతో కష్టంతో అన్నాడు.

మరల కొన్ని క్షణాలు ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ తరువాత అన్న మంత్రి, "నీకోసం పంపిన వారు నిన్ను కలుసుకొన్నారా?" అని ప్రశ్నించాడు.

"లేదు" కళ్లనీళ్లు గ్రుక్కు కొంటూ అన్నాడు కాపయ్య.

"వారు దగ్గరిదారిలో వెళ్లారేమో. మనం అనుకోని విధంగా జరిగింది. మన ఉద్యమమే దెబ్బతిన్నది."

కాపయ్య మాట్లాడలేదు

"ప్రోలయ్య మరణిస్తాడని ఎవరూ అనుకోలేదు"

"చాలా అలసి పోయారు. రాత్రింబగళ్లు నిర్విరామంగా పని చేయడం వల్ల, మొన్న పోరాటంలో విజృంభించి పోరాడడం వల్ల గుండె దెబ్బతినివుంటుంది."

"అవును, అతడు మరణించాడంటే గూఢనమ్మకం కలగకుండా వుంది. ఎప్పుడూ ఎదురుగా వుండి మాట్లాడినట్లే వుంటుంది."

"అన్నయ్య పోయారని విని గుండె ఆగినట్లయింది ఇక ఈ ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకొని పోవడమో తెలియడం లేదు. అటు బలమైన శత్రువులు, ఇటు నాయకుడు లేని అమాయక ప్రజలు,"

వారు మాట్లాడుతుంటే కాపయ్య వచ్చాడని విన్న నాయకులచ్చటికి వచ్చారు. కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనాయకుడు గూడ అక్కడికి వచ్చారు.

వారిని చూచి కాపయ్య దుఃఖం మరింత హెచ్చింది.

అప్తులైన వారిని అలాచూచినప్పుడు సాధారణంగా దుఃఖం కట్టలు తెంచుకొనడం సహజం. అచ్చటికి వచ్చిన వారి హృదయాలు గూడ ఒక్కసారి కలుక్కుమన్నవి.

ఆ విషయాన్ని గూర్చే విన్న అందరం యోచించాము. నిన్ను ఆంధ్ర భూమండలాధ్యక్షుణ్ణి గావించి ఉద్యమాన్ని తీవ్రతరంగావించడానికందరూ అంగీకరించారు.

"నన్నా"

"అవును"

"నేనం దుకర్హుణ్ణి గాను. ఎవరినైనా పెద్దల్ని ఉంచండి."

"ఇక పెద్దలెవరున్నారు నీకంటే. యువనాయకులందరూ నిన్నే కోరుకున్నారు" అన్నాడు సింగమ నాయకుడు.

"వారు కోరినప్పటికీ అది చాల భారకరమైన బాధ్యత. అందు వల్ల..."

"ఎంత భారవహమైనా భరించే తీరాలి. ఆంధ్రావనిని విదేశీయుల కబంధ హస్తాలనుంచి విముక్తి గావిస్తామని మన మందరం ప్రతిజ్ఞ పూని వున్నాము"

'అవును భరించితీరాలి' అన్నారు నాయకులు అందరూ.

కాపయ్యకేమి చెప్పడానికి తోచలేదు.

"మా యాశీర్వాదం నీకెన్నడూ వుంటుంది. యువనాయకులందరూ నీకు తోడుగా వుంటారు. అందువల్ల నీవు వెనుకంజ వేయనవసరం లేదు." అన్నాడు కొలని రుద్రదేవుడు.

కాపయ్య ఆలోచిస్తున్నాడు.

అంతలో ఒక భటుడు వచ్చి నమస్కరించాడు.

"ఏమి?" ప్రశ్నించాడచ్చటున్న నాయకులలో ఒకరు.

"చారులు వచ్చివున్నారు ప్రభూ" అన్నాడు భటుడు.

నాయకులొకరి నొకరు చూచుకొన్నారు. వెళ్ళానికి లేచారు. అది గమనించి "మీరేమీ వెళ్లనవసరం లేదు చారుల్ని రమ్మని చెప్పు'' అన్నాడు అన్న మంత్రి. నాయకులందరూ అలాగే కూర్చున్నారు.

చారుల నాయకుడైన పేరన్న వచ్చాడు. అందరికీ నమస్కరించాడు.

"సంగతేమిటి?" ప్రశ్నించాడు అన్నమంత్రి.

"తురుష్క సేనలు మన మీదికి వస్తున్నాయి ప్రభూ"

"తురుష్క సేనలా?" ఎచ్చటనుండి?" ఉద్వేగంతో ప్రశ్నించాడు కాపయ్య నాయకుడు

'ఏకశిలానగరం నుండి'

"అనుకొన్నట్లే జరిగింది". అన్నాడు అనపోతనాయకుడు.

"మనం వెంటనే సంసిద్ధం కావలసివుంటుంది. ప్రోలనీడు మరణించాడని వారికి తెలిసివుంటుంది అందువల్ల మరింత ఉత్సాహంతో వస్తారువారు" అన్నాడు ముమ్మడినాయకుడు

"మన అధ్యక్షుడు మరణించాడని ఇంతవరకు వారికి తెలిసి వుండదు. కాని ఇక మీద తెలుస్తుంది" అన్నాడు అన్నమంత్రి.

"మన దుఃఖం తీరకముందే మరొక గండాన్ని ఎదుర్కొనవలసివస్తున్నది." విచారంతో చెప్పాడు దేవనాయకుడు.

"మరి అలాగే వస్తుంటాయి కష్టాలు. గోరుచుట్టుకే రోకటి పోటు తగులుతుంటుంది. అన్నిటినీ భరించి కర్తవ్యనిర్వహణ గావించాలి ఈ అగ్నిపరీక్షకు తట్టుకొని నిలబడాలి లేకుంటే మనమింతవరకు గావించిన శ్రమంతా వృథా అయిపోతుంది." అన్నమంత్రి అన్నాడు.

"ప్రోలనీడు మరణవార్త, తురుష్కుల దండయాత్ర ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తుందేమో." సందేహాన్ని వెలిబుచ్చాడు అనపోతనాయకుడు.

"తప్పనిసరిగా భయభ్రాంతుల్ని గావిస్తుంది. అందువల్లనే మనం సిద్ధమై కాపయ్యనాయకుని అధ్వర్యాన వెంటనే విజృంభిస్తే ప్రజలకు ధైర్యం కలుగుతుంది." అన్నాడు అన్నమంత్రి.

అతని సలహా అందరికి నచ్చింది.

"మరచాను నీవు వెళ్ళివచ్చిన పని ఏమయింది?" కాపయ్యను ప్రశ్నించాడు అన్నమంత్రి.

"హోయసలరాజు మొదట సోమదేవ రాజుకు సాయం గావించడానికి అతను చూచి సులానుమీద తిరుగుబాటు చేయడానికి సమ్మతించాడు సోమదేవరాజు, దేవగిరి కంపిలి సేనలు మనమీదకు రాకుండా అడుకొంటానన్నాడు. కనుక ఇకిప్పుడు ఆ సైన్యాలు మనమీదకు వస్తాయనే భయంలేదు" అన్నాడు కాపయ్య.

"అయితే ఓరుగల్లు సేనల్ని ఓడించడం సులభమే" కొలని రుద్రదేవుడన్నాడు.

"మనమనుకొన్నంత సులభం కాకపోవచ్చు ఈమారు హెచ్చుసైన్యం పంపబడవచ్చు. అందువల్ల మనం చాల జాగ్రత్తగా వుండాలి." అన్నాడు అన్నమంత్రి.

"ఎంత సైన్యమైనా ఎదుర్కొని తీరాలిగదా!" సింగమ నాయకుడన్నాడు.

"వేమారెడ్డి వున్నాడా?" ప్రశ్నించాడు కాపయ్య.


"వచ్చి వెళ్ళిపోయాడు నీవు వస్తూనే వర్తమానం పంపమన్నాడు" అని అన్నాడు అనపోతనాయకుడు

"వెంటనే వేమారెడ్డిని సోమదేవరాజుకు సాయంగా పంపాలి. అలా పంపితే వారు కృష్ణాతుంగభద్రల మధ్య నున్న కోటల్ని పట్టుకుని ఆ ప్రాంతాన్ని విముక్తి నందిస్తారు." అన్నాడు కాపయ్య. "అది మంచిదే. అప్పుడు మనమీదికి వస్తున్న సేనలు అటువైపుకు మళ్ళించబడవచ్చు. లేకుంటే దేవగిరి, కంపిలి సేనలు మనమీదికి రాకుండా వారు అడ్డగించగలుగుతారు?" అన్నమంత్రి అన్నాడు.

"అలా అయితే వెంటనే వేమారెడ్డికి మీ అనుమతి పంపండి అన్నాడు అనపోతనాయుడు కాపయ్యనుచూచి.

"అలాగే పంపుతాను. ఇక మనం ఆలస్యం చేయడానికి వీలులేదు. సైన్యాన్నంతటినీ సమాయత్తంగావించండి." అంటూ లేచాడు కాపయ్యనాయకుడు. అతనితోపాటు అందరూ లేచారు.

(సశేషం)



1



4



2

నగరంలో వార్తా చిత్రాలు

1 రవీంద్ర భారతిలో ఆగస్టు 23వ తేదీన రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి ప్రకాశం శతజయంత్యుత్సవాలను ప్రారంభించారు.

2 జూబిలీహాల్లో ఆగస్టు 23వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు "ప్రకాశం ప్రదర్శన" ను ప్రారంభించారు.

3 శ్రీకృష్ణ చైతన్య అంతర్జాతీయ సంఘ సభ్యులు ఆగస్టు 8వ తేదీన గవర్నరును కలిశారు.

4 భారత స్వాతంత్ర్య రజతోత్సవసందర్భంగా ఆగస్టు 14 అర్ధరాత్రి జరిగిన శాసనసభా సమావేశంలో గవర్నరు ప్రసంగించారు.

5 ఆగస్టు 15వ తేదీన నగరంలో జరిగిన సాంస్కృతిక ఊరేగింపు దృశ్యం.



3



5




1

నగరంలో వార్తా చిత్రాలు

1. స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భంగా జూబ్లీ హాల్లో ఏర్పాటుచేసిన ప్రదర్శన దృశ్యం.
2. రవాణాశాఖామాత్యులు శ్రీ కె. ప్రభాకరరెడ్డి లాల్‌దర్వాజా వద్ద మహంకాళి జాతర సందర్భంగా ప్రసంగించారు.
3. ఆగస్టు 27వ తేదీన ద. భా. హిందీ ప్రచారసభవారి హిందీ పత్రికానికి గవర్నరు ప్రారంభోత్సవం చేశారు.
4. కేంద్ర ప్రభుత్వ టూరిజం మంత్రిణి శ్రీమతి సరోజినీ మహిషి ఆగస్టు 25న హైదరాబాదు వచ్చారు.
5. విద్యాశాఖామాత్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి ఆగస్టు 8న సాహిత్య అకాడమీ ప్రచురణలను ఆవిష్కరించారు.

2





3

4




5






1



3


4



నగరంలో వార్తా చిత్రాలు

1. సంస్కృత విశ్వవిద్యాలయం గురించిన గోష్ఠిని గవర్నరు ఆగస్టు 13 వ తేదీన ప్రారంభించారు.
2. ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఎ. భగవంతరావు జూబ్లీహాల్లో ఆగస్టు 12 న ఆం. ప్ర గ్రంథాలయ మహాసభను ప్రారంభించారు.
3. రవాణా శాఖా మాత్యులు శ్రీ కె. ప్రభాకరరెడ్డి ఆగస్టు 8న హైదరాబాదు పౌర సంక్షేమ కమిటీ (అబిడ్స్ శాఖ) కి ప్రారంభోత్సవం చేశారు.
4. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యదర్శి శ్రీ కె. కె. దాస్ ఆగస్టు 17 న హైదరాబాదులో ప్రదర్శన-శిక్షణ కేంద్రం ప్రారంభించారు.

2



సమ్మె ఎందుకు

పువ్వుల చలపతిరావు

ఐదవ రంగము

(తెర లేచేసరికి ఆఫీసులో బల్లలు, కుర్చీలను, రంగడు గుడతో తుడుస్తుంటాడు. నర్సయ్య ఫ్లవర్ బాటిల్ తీసుకువచ్చి టేబిల్‌కు మధ్యన ఉంచుతాడు)

రంగయ్య :— నర్సయ్యా పెద్దపెద్ద దొర్లంతా వస్తారటగా? ఎవరెవరు? ఎందుకొస్తున్నట్టు...?

నర్సయ్య :— అసలు సమ్మెలనేవి జరక్కుండా వుండాలని, అందుకు దొరలంతా కలిసి ఇక్కడ సమావేశమౌతున్నార్రా రంగడూ

రంగడు :— దొర్లంతాంటే? పోలీసు బందోబస్తు కూడా వుందే?

నర్సయ్య :— ఏమనుకున్నావుమరి?

లేబరు మినిష్టరు! చీఫ్‌లేబరు కమీషనరు!
మేనేజింగు డైరెక్టరు! జనరల్ మేనేజరు!
పర్సనల్ మేనేజరు! కలెక్టరు!
సమ్మె నాయకులు శ్యామలరావు, కిష్టయ్య!
యతీంద్రుని ఆశ్రమంనుంచి, యతీంద్రులు
డాక్టరు వకీలుమొదలైన వారంతా వస్తారు.

(గోడ గడియారం గం. 9—00 కొడుతుంది. దూరంనుండి దగ్గరగా వస్తున్న మోటరు కార్ల చప్పుళ్లు మధమధ్య హారన్లు ఒక దాని వెనుక ఒకటి వినిపించి క్రమేపి ఆగిపోతాయి.)

రంగడు :— (ఆత్రుతగా) దొర్లంతా వచ్చేసినట్టున్నారు.

నర్సయ్య :— (హడావిడిగా నిష్క్రమించుతాడు.)

(పైన చెప్పిన వారంతా ఒక్కొక్కరు, తలో ఫైలుచేతిలో పట్టుకొని ప్రవేశించి కుర్చీల మీద కూర్చుంటారు.)

కొద్ది క్షణాలు లలిత సంగీతం వినిపిస్తుంది.

జనరల్ మేనేజరు :— (కుర్చీలో నుండి లేచి) క్రిందటి వారము జరిగిన సర్వసభ్య సమావేశము తరువాత, ఇప్పుడు జరుగుతున్న ఈ సమావేశంలో గౌరవనీయులైన కార్మికమంత్రి గారు కూడా పాల్గొనడంతో—సమస్యలన్నీ శాంతియుతంగా పరిష్కరించ బడగలవని ఆశిస్తున్నాం. అంతేగాకుండా యీ సమావేశం ద్వారా సమ్మెలనేవి లేకుండా చేయగలమనే విశ్వాసం ఉంది కనుక—కార్మిక శ్రేయస్సును కోరే కార్మిక మంత్రిగారు తమ మహోన్నత సలహాలను ఈ సమావేశములో వినిపించగలరని ఆశిస్తున్నాము.

కార్మికమంత్రి :— ఈ దేశం మనది అనే అభిప్రాయము గాఢంగా ఏర్పడినంత మాత్రంతో చాలదు. ఈ పరిశ్రమ నాది—నేను చేస్తున్న ప్రతి ఒక్క పని మనదేశానికి చెందుతుందనే దశకు ప్రతి వారు రావాలి అంతవరకూ సమ్మెలు—ఘర్షణలు తప్పవు. కార్మికులకు, యజమానులకు మధ్య రగుల్కొనే ఘర్షణ పరిణామమే చివరకు సమ్మెగా మారుతుంది. దీనికి మూల కారణములు రెండు.

ఒకటి— ఏ కార్మికుడైతే ఉత్పత్తిని సాధించి లాభాన్ని చూపెడుతున్నాడో, ఆ లాభం తనది కాదనే నిరాశను కార్మికునకు చూపించడము.

రెండవది— వుత్పత్తిపై వచ్చే లాభాలు వాటిపై అర్హత తమకే చెందుతుందని యజమానులు అనుకోవడం వలన, యిట్టి ఘర్షణ పుట్టుకొస్తుంది. అంటే వుత్పత్తి—ఘర్షణ, ఒక దాని ప్రక్కన ఒకటి పెరుగుతున్నాయి. ఈ రెండు అవినాభావసంబంధములేని కార్మిక యజమానుల మధ్యనుండే పుడుతూన్నవి కనుక యీ రెండు విభిన్న శక్తులను కలిపి శాంతియుత మార్గం ఏర్పరచాలంటే యతీంద్రుని మెమోరాండంలో సూచించిన సూత్రం ఒక్కటే శరణ్యం. అట్టి సూత్రం ప్రకారం యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం యివ్వాలి. అప్పుడు కార్మికులు వుత్పత్తి చేసే ప్రతిచిన్న వస్తువుమీద నుండి వచ్చే లాభం, తను పొందగల్గుతున్నాననే నిజమైన అభిప్రాయము ఏర్పడి సమ్మెలనేవి

నిర్మూలమౌతాయి. అప్పుడే పరిశ్రమలు నిర్మలంగా, చురుకుగా పనిచేస్తాయి. అందుకుగాను లేబరు కమీషనరు గారూ! (లేచి నిలబడతారు) యాజమాన్యంలో కార్మికుల ప్రాతినిధ్యం ఏవిధంగా ఉండాలని మీ అభిప్రాయం?

లేబరు కమీషనరు:— ఒకవంతు ప్రభుత్వానికి — ఒకవంతు మేనేజ్‌మెంటుకు, మరియొక వంతు కార్మికులకువుంటే బాగుంటుంది (కూర్చుంటాడు).

కార్మిక మంత్రి:— మీ అభిప్రాయమేమిటి మేనేజింగు డైరెక్టరు గారూ?

మే. డైరెక్టరు — మొత్తం సభ్యత్వంలో కార్మిక ప్రతినిధులు యిద్దరు వుంటే చాలు.

లేబరు కమీషనరు — రిజిష్టరు అయిన యూనియన్‌లున్నప్పుడు?

జనరల్ మేనేజర్;— ఎన్ని యూనియన్‌లున్నప్పటికీ— రికగ్నైజు అయిన యూనియన్‌కు మాత్రమే రెండు స్థానాలు యిస్తే సరిపోతుంది.

పర్సనల్ మేనేజరు:— ఆ యిద్దరైనా — ఆఫీసర్సు నుండి ఒకరు, కార్మికులనుండి ఒకరు వుంటే సరిపోతుంది.

కలెక్టరు:— అలా కాకుండా— పార్టీలవారీగా రిప్రజంటేషన్ వుంటే బాగుంటుంది.

శ్యామలరావు:— పార్టీలవారీ ఎందుకు? అధిక సంఖ్యగల మా యూనియన్‌కే (రికగ్నైజు యూనియన్) పూర్తి రిప్రజంటేషన్ ఇవ్వాలి.

కిష్టయ్య:— మొత్తం పనివారలకు నాయకత్వం వహించేది మా యూనియన్ గనక దానికే ఇవ్వండి.

వకీలు:— ఏ యూనియన్‌లకు చెందని ప్రజాప్రతినిధులకు కూడా ప్రాతినిధ్యం యివ్వాలి.

యతీంద్రుడు:— నిజానికి చూస్తే యీ రిప్రజంటేషన్ చాలదు మీరు చెబుతున్న నిష్పత్తుల ప్రకారము అయితే ముందు ముందు పార్టీలలో విభేదాలు హెచ్చి, మరింత అశాంతికి గురి కావలసి, ఇప్పుడు సమ్మె అని పిలువబడే రూపానికి బదులు, మరో విషరూపం ధరిస్తుంది. ఇప్పుడు మీరు వేస్తున్న భాగాలు ఏ మాత్రము క్షేమదాయకముకాదు. ప్రభుత్వానికి యజమానులకు కలిపి రెండు భాగాలైతే కార్మికులకు ఒకభాగం అవుతుంది. అది సరైన పద్ధతికాదు. ఎందుచేతనంటే ప్రభుత్వమే పరిశ్రమపై యాజమాన్యము వహిస్తున్నప్పుడు ప్రభుత్వము వేరు, యాజమాన్యం వేరు ఎన్నటికి కాదు. మొత్తం ప్రాతినిధ్యంలో సగ భాగం కార్మికులకు, సగ భాగం యజమానులకు యిచ్చినప్పుడే నిజమైన రిప్రజంటేషన్ యేర్పడి, సమాన బాధ్యత కలుగుతుంది.

కార్మిక మంత్రి:— అర్థ భాగం కార్మికులకు యిచ్చినప్పుడు అనేక పార్టీల కార్మికులనుండి కార్మిక ప్రతినిధులు రావడం ఎలా వీలవుతుంది?

లేబరు కమీషనరు:— ఒక్కొక్క యూనియన్‌నుండి ప్రతినిధులను తీసుకుంటే?

డాక్టరు:— ప్రభుత్వము యాజమాన్యము తరపున ఆరుగురు ప్రతినిధులుంటే—కార్మికుల తరపున ఆరుగురుండవలసిందే. కార్మిక శ్రేయస్సు కోసమై పనిచేస్తున్న ఎన్ని యూనియనులు ఉన్నప్పటికి—బ్యాలెట్ పద్ధతిలో వారిని కార్మికులు ఎన్నుకోవలసి ఉంటుంది. అప్పుడు కార్మికుల యిష్టంతో వచ్చినవారే అందుకు అర్హులౌతారు.

లేబరు కమీషనరు:— అప్పుడు మాత్రం నానాజాతి సమితికాదా? కార్మిక సమస్యలన్నీ ఒక త్రాటిమీదకు తీసుకొచ్చి, కార్మికుల శ్రేయస్సు కొరకు పనిచేస్తారని నమ్మకమెలాగ?

డాక్టరు:— రకరకాల ఆశయాలుగల యూనియన్‌ల నుండి ప్రతినిధుల వచ్చినప్పటికి కార్మిక లాభాలను పంచిపెట్టవలసినప్పుడు వ్యక్తిగత అభిప్రాయాలుగాని, పార్టీల ఆశయాలు గాని నెరవేర్చుకోవాలనే అభిప్రాయాలకు చోటుండదు ఎందుచేతనంటారా? ఉత్పత్తిమీద వచ్చిన ఫలితమేదైనే ఉందో అది తిన్నగా కార్మికులకే చెందుతుంది గాని, యూనియనులకు మాత్రం కాదు. అందుచేత సమాన దృష్టి అలవడుతుంది.

లేబరు మినిష్టరు:— డాక్టరుగారు చెప్పినట్టు — బ్యాలెట్టు ద్వారా కార్మికులనుండి ప్రతినిధులు రావాలి. దాన్నిబట్టి మనకు కనుపించే యథార్థ దృశ్యం ఏమిటంటే—ఎన్ని యూనియన్‌లు నడుస్తున్నప్పటికీ నిజమైన కార్మికుల సేవకులను, కార్మికులే వంపుతున్నారు గనుక కార్మిక ప్రతినిధులందరూ కలిసి ఒక రిప్రజెంటేషన్, యాజమాన్యము ప్రభుత్వముల తరపున ఒక రిప్రజెంటేషన్ అవుతుంది. అదే యీక్వల్ రిప్రజెంటేషన్ అంటే—సమాన భాగస్వామ్యమన్నమాట. ఇప్పుడు కార్మికులకు కలిగిన సమాన భాగస్వామ్యము వలన ప్రతి కార్మికునికి అరమయ్యేది ఒక్కటే పరిశ్రమ నాది, నా పరిశ్రమమీదనే ఉత్పత్తి ఆధారపడివున్నది అని తెలుస్తుంది. అంటే ఉత్పత్తినిబట్టి పొందే లాభం తనదని గుర్తించగలుగుతాడు. ఈ భావము కార్మికునిలో కలిగిన నాడు సమ్మెలు వుండవు. బహు నాయకత్వాలు ఉండవు

కార్మికులకు సమాన భాగస్వామ్యం యివ్వడం వలన కార్మిక శ్రేయస్సు మన్నహోతస్థాయిని అందుకుంటుంది. దేశ పురోభివృద్ధి అంచెలవారీగా ముందుకు పోగలుగుతుందని ఆశిస్తున్నాను. ఇందుకు తమ అందరి అంగీకారాన్ని తెలియబర్చవలసిందిగా కోరుతున్నాను.

(అందరూ హర్షధ్వనులు చేసి, చేతులు ఎత్తుతారు.)

మేనేజింగు డైరెక్టరు:_ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కాలమునుండి నేటివరకు వస్తున్న సమ్మె జ్యాడ్యాన్ని సమూలంగా నిర్మూలించే శాంతియుత మార్గాన్ని కనిపెట్ట గలిగాము. అదే కార్మికునికి యాజమాన్యంతో సమాన భాగస్వామ్యం యివ్వడం, కష్టించి సాధించిన అధికోత్పత్తిపై వచ్చిన లాభాన్ని కూడా కార్మికుడు అనుభవించే ధైర్యాన్ని పొందగలుగుతున్నాడు. అట్టి ఈ సిద్ధాంతాన్ని ముందుగా అమలు జరుపుతున్నందుకు మనమెంతో గర్వపడవలసియున్నది.

(హర్షధ్వనులు, తెరపడుతుంది.)

ఆరవ రంగము.

(సైరన్ కూత వినిపిస్తూ ఎగుసాయిలో వచ్చేటప్పటికి యంత్రాల రణగొణధ్వని వినిపిస్తూంటుంది. కొన్ని కార్మిక కంఠాలు కూడ అప్పుడప్పుడు సన్నసన్నగా వినిపిస్తాయి. ఇంతలో తెరలేస్తుంది. బోర్డు ఆఫ్ డైరక్టర్సు కూర్చొని ఉంటారు.)

[illegible]న్ (లేబర్ మినిష్టర్):_ ప్రియమైన కమిటీ సభ్యులారా, కారుమేఘాలు తొలగిపోయాయి. ఆకాశం ప్రశాంతంగా ఉంది. ఉషః కాంతులు చీకటిని పారద్రోలాయి. బ్యాలెట్ సహాయంతో కార్మికుల నుండి ఎక్కువ మెజార్టీతో వచ్చిన సభ్యులు.

శ్రీ శ్రీ యతీంద్రులు	(ఎమ్.ఎ. ఫిలాసఫీ)
శ్రీ రామయ్య	(కోల్ కట్టరు) మజ్దూర్
శ్రీ శ్యామలరావు	(యూనియన్ నాయకుడు)
శ్రీ సుబ్బయ్య	(ట్రామరు)
శ్రీ రఘుప్రసాదు	(అడ్వకేట్)
డాక్టర్ కృపానిధి	(డాక్టర్)

ఈ ఆరుగురు ప్రతినిధులు యాజమాన్యం, తరఫున ఆరుగురు బోర్డు ఆఫ్ డైరక్టర్సుగ నియమించడమైనది. నేటితో కార్మికులు కూడ పరిశ్రమల్లో సమాన భాగస్వామ్యాన్ని పొందగలిగేరు. ఈ పురోభివృద్ధి వలన ఇంతకాలము నుండి కార్మికుల ప్రతిభకు, యాజమాన్యానికి మధ్యనిలిచిన పలుచని అశాంతి రేఖ పూర్తిగా చెరిపివేయబడింది. ఇపుడు కార్మికుల శక్తిపైన_ఉత్పత్తిపైన వారి శాంతి సౌభాగ్యాలు ఆధారపడిఉన్నాయి (ఫైల్సు [illegible] చూస్తూంటాడు.)

([illegible] సంగీతం ఉత్సాహంగా వినిపిస్తుంది.)

ఈ సంవత్సరము రాబడి 52 కోట్లు. ఖర్చు 50 కోట్లు. మిగిలిన రెండు కోట్లు లాభాన్ని కార్మిక శ్రేయస్సుకై ఏ విధంగా ఖర్చు చేస్తే బాగుంటుందో ఇప్పుడు మనం నిర్ణయించాలి.

శ్యామ:_(నిలబడి) క్రిందటి సంవత్సరము ఖర్చులు పోను మిగిలిన లాభం ఎంతండీ ?

జ. మే:_నలభై లక్షలు.

శ్యామ:_ఆఖర్చు వివరాలను తెలుసుకోవచ్చా ?

జ. మే:_ (ఫైలో నుండి కొన్ని కాగితములు తీసి చదువుతాడు.)

జీతాలు, బోనసు, ప్రావిడెంటు ఫండు 55% పన్నుల క్రింద $1\frac{1}{2}\%$ రాయల్టీ, సెక్రటరీ ఆఫీసు నిర్వహణ 6% కొనుగోలు, మిసిలేనియస్, వెల్‌ఫేర్ మెడికల్ $2\frac{1}{2}\%$, రిజర్వుఫండు $\frac{3}{4}\%$ మిషనరీ అరుగుదల $7\frac{3}{4}\%$, షేర్ హోల్డర్స్‌కు పంచిన లాభం 2%.

వకీలు:_అవార్డులు అమలు పరచిన తరువాత సరాసరి క్యాటగిరీ ఒక్కింటికి కార్మికునికి పెరిగిన వేతన మెంత ?

జ. మే:_ రు 1-50

వకీలు:_ పూర్వం మొదటి క్యాటగిరీ వారి సరాసరి ఆదాయం?

జ. మే:_రు 1-50 పెరుగుదల 1-50 మొత్తం 3 రూ. చిల్లర పడుతుంది ఇప్పుడు.

శ్యామ:_ఇప్పుడు వచ్చిన లాభాన్నే డబ్బు రూపంలో కేటగిరీ ననుసరించి జీతంలో కలిపి ఇవ్వడం మంచిదని తోస్తూంది. ఉత్పత్తి అధికం చేయడం వలనే గదా ఇంత డబ్బు సంపాదించ గలుగుతున్నానని కార్మికుడు తెలుసుకుంటాడు.

జ. మే:_కార్మికుల జీతం కాకుండా అదనంగా శ్రమ ఫలితాన్ని బట్టి ఇన్సెంటివ్ బోనసు అని ఇప్పుడు ఇవ్వబడుతుంది.

వకీలు:_లాభాన్ని కార్మికులకు డబ్బు రూపంలో పంచడం కంటె సౌకర్యాలను అభివృద్ధి చేయడం మంచిది.

డాక్టరు: కార్మికుడు తన ఇంటి నుండి పనిస్థలానికి చేరుకోవాలంటే తన సంపాదనలో కొంత ద్రవ్యాన్ని రాను పోను బస్సు ఛార్జీల క్రింద ఖర్చు పెట్టవలసి వస్తుంది. అంటే కష్టించగా వచ్చిన పూర్తి జీతాన్ని పూర్తిగా తను అనుభవించటం లేదనే చెప్పాలి. అందుచేత_ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

వకీలు:_అవార్డుకు పూర్వం కార్మికులకు చౌక ఆహార ధాన్యాలు సప్లయ్ చేస్తూండేవారా ?

జ. మే: చేస్తూండే వారము.

వకీలు:_ఆ చౌక ధాన్యం ఎందుకు ఎత్తి వేయాల్సి వచ్చింది?

జ. మే:_ప్రతి దినం ఆ చౌక ఆహార ధాన్యాల విషయంలో ఏదో రకమైన ఆందోళనలను కార్మికులు తీసూండేవారు. అట్టి ఆందోళనలను తప్పించడం కోసం చౌక ఆహార ధాన్యాల క్రింద అయిన ఖర్చులు డబ్బు రూపంలో ముట్టజెబుతున్నాము.

వకీలు:- ఎన్ని లక్షలు ఖర్చు పెడుతుండేవారు?

జ. మే:- 50 లక్షలు.

వకీలు:- చౌ. ధాన్యం సప్లయిలో కనిపించే, చిన్న చిన్న గందర గోళాళను తొలగించడమంత గొప్ప కష్టమేమి కాదు. కాని- ఈ నాడు రోజు రోజుకు బజారు ధరలు ఆకాశాన్నంటు కున్నందువల్ల కార్మికులకు డబ్బు రూపంగా ఇస్తున్న రేషనింగు అలవెన్సు వల్ల కార్మికుడు మాత్రం లాభాన్ని పొందటం లేదు సరిగదా అంతకు పదిరెట్లు బజార్లో తిరిగి చౌకఆహార ధాన్యాలను సప్లయి కోల్పోతున్నాడు. చేసినట్లయితే 50 లక్షలు 100 లక్షల ఫలితాన్ని కార్మికునకు చూపెట్టిన వారమౌతాము.

డాక్టరు:- ఉచిత వైద్య విధానం ఇంకా ఉన్నత స్థాయిలో మొత్తం కుటుంబాని కంతటికీ చెందేలాగ చేయాలి.

శ్యామలారావు:- ఇంతవరకూ వైద్య ఫెయిరు ఒక్కరికే ఇస్తున్నారు. అలాకాకుండా ఆ కార్మికి కుటుంబాని కంతటికీ చెందేలాగుండాలి.

డాక్టరు:- ప్రతికార్మిక ఇంటికి విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలి.

యతీంద్రుడు:- తన జీవితమంతా పరిశ్రమకు ధారపోసి అధిక ఉత్పత్తి చేసి గర్వపడుతున్న కార్మికునకు వృద్ధాప్యంరాగానే పని నుండి తొలగిపోవలసి వస్తుంది. అంతవరకు పొందుతున్న చౌకఆహారం, ఉండడానికి ఇల్లు, వైద్య సౌకర్యములు తన పరిశ్రమనుండి కోల్పోతున్నాడు కనుక తప్పని సరిగా వృద్ధాప్య పోషణ అవసరం.

(అందరూ హర్షధ్వానాలు చేస్తారు. తరువాత సంగీతం వినిపిస్తూంది.)

జ. మే: ఇంతవరకూ, కార్మిక ప్రతినిధుల సూచనలు కార్మికులకు శ్రేయస్సును, శాంతి కలుగజేస్తాయని ఇపుడు తమతమ ఆమోదాన్ని తెలియజేయ వలసిందిగా కోరుచున్నాను. సాలీనా వచ్చిన లాభాలను కార్మికుల సౌకర్యాల వినియోగించాలనే అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. ఇంతవరకు సభ్యులు సూచించిన వివరాలివి.

1. బస్ ఫెయిర్ 2. చౌకధాన్యం సప్లై 3. కుటుంబాని కంతకు ఉచితవైద్య సౌకర్యం 4. విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా 5 వృద్ధాప్య పోషణ

(హర్షధ్వానాలు చేసి అందరు ఒక్కసారి చేతులు ఎత్తారు)

(పిచ్చిది కాగడతో ప్రవేశిస్తుంది.)

పిచ్చిది:- అమ్మయ్య! ఇన్నాళ్లకి యాజమాన్యంలో కార్మికులకు సమాన భాగస్వామ్యం వచ్చింది. ఇపుడు వీరంతా దాన్ని అమలు పర్చుతున్నారు అంతేకాదు దారిద్ర్యతానిర్మూలనకు దేశమంతటా బ్రహ్మాండమైన పోరాటం జరుగుతున్న నేటి దశలో కార్మికులు చేస్తున్న సమ్మెలు మటుమాయమైనవి. ఈ సమాన భాగస్వామ్యంతో సమ్మెలు ఇక జరుగవు (పిచ్చిగా నవ్వుతుంది.) అమ్మయ్య! ఇప్పుడు ఈ పరిశ్రమ నాది ఈ ఉత్పత్తి నాది. ఈ లాభం నాది అనే భావం కార్మికునకు కలిగింది.

(తెరలోపల నుండి యంత్రాలు తిరుగుతున్న చప్పుడు, సమ్మెటల చప్పుడు ఉత్సాహంగా కొన్ని క్షణాలు వినిపించి క్రమేపి తగ్గు స్థాయిలో వినిపిస్తూ ఉంటుంది. పిచ్చిది పిచ్చిగా నవ్వుతుంది. కార్మిక ప్రతినిధులను చూచి.)

ఓ ప్రతినిధుల్లారా! కార్మికులంతా కలిసిమిమ్ములను మనసారా ఎన్నుకున్నారు. మీరు నిస్వార్థంగా కార్మికశ్రేయస్సు కొరకే పనిచేసి వారందరి జీవితాలను ప్రకాశవంతంగా చేయడము మీ విధి. అంతేకాదు పరిశ్రమాభివృద్ధికి పాటు పడాలి. (పిచ్చిగా నవ్వుతుంది.)

(యంత్రాల రణగొణ ధ్వని సమ్మెట్ల దెబ్బలు మరింత ఉత్సాహంగా వినిపిస్తూ ఉంటాయి.)

దేశానికి జయభేరి ధ్వనులతో ఉత్పత్తి పెరుగుతుంది.
అదిగో—ఉత్పత్తి పెరుగుతూంది...... (యంత్రాల చప్పుడు మరీ ఎక్కువగా వినిపిస్తుంది)
ఉత్పత్తి పెరుగుతూంది. శ్రామికుల్లారా! సర్వసౌభాగ్యాలు మీవే......అవన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి

పెంచండి ఉత్పత్తి పెంచండి

(పిచ్చిగా నవ్వుతూంటె తెరపడుతుంది. పడిన కొన్ని క్షణాల వరకు యంత్రాల రణగొణ ధ్వని.)

(సమాప్తం)



పేరు మామిళ్ళ పంచాయతీ సమితిలో మడకర వారి పల్లిలో జిల్లా కలెక్టరు శ్రీ వి. చంద్రమౌళి ప్రకాశం శత జయంతి హరిజన కాలనీకి ఆగస్టు 23న ప్రారంభోత్సవం చేశారు.

జిల్లాల్లో

తొట్టంబేడు సమితిలో పాఠశాల భవనములకు ప్రారంభోత్సవము

ఇటీవల చిత్తూరు జిల్లాలోని తొట్టంబేడు సమితికి చెందిన పల్లారెడ్డి కండ్రిగ గ్రామంలోని సమితిపాఠశాల భవనమునకు జిల్లా కలెక్టరు శ్రీ బి. వి. రామారావుగారు ప్రారంభోత్సవము జేశారు. యీ సందర్భమున మాట్లాడుచు కలెక్టరు తాను యీ జిల్లాలో ప్రారంభోత్సవము జరిపిన భవనములలోకెల్ల యిది గొప్పదనిరి. దీని నిర్మాణమునకు రూ. 25 వేలు ఖర్చుకాగా, అందులో 16 వేల రూపాయలు గ్రామస్థులు యువజన సంఘము భరించినందుకు, సమితిఅధ్యక్షుని పిలుపు నందుకొని త్వరలో పూర్తి చేసినందుకు యీ గ్రామస్థులను కలెక్టరు అభినందించారు. ఈ భవనములో పిల్లలు బాగుగా చదివి ఉన్నత పదవులు అందుకోగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జిల్లాపరిషత్ ఛైర్మను శ్రీ వి. రామస్వామి రెడ్డిగారు అధ్యక్షత వహించారు. మంగళవాయిద్యముల మధ్య గ్రామస్థులు స్వాగతము పలికారు. అధ్యక్షులు మాట్లాడుచు ప్రజలతోడ్పాటు, ఉత్సాహమున్నపుడే ప్రభుత్వము గూడ అభివృద్ధిని సాధించ గలదనుటకు యీ గొప్ప భవనము ఒక నిదర్శనమనిరి.

సమితి అధ్యక్షులు శ్రీ డి. బత్తిరెడ్డి గారు మాట్లాడుచు, గ్రామస్థులకు, బడి, బావి, బాట అవసరము గనుక మొదటి రెండు పూర్తి చేసినట్లే బాటపని గూడ పూర్తిచేసి గ్రామస్థుల సంఘీభావము యింకా యినుమడింప జేయవలసినదిగా కోరారు.

శ్రీకాళహస్తి సమితి అధ్యక్షులు శ్రీ. బి వి. నారాయణ రెడ్డి, మాజీ శాసనసభ్యులు శ్రీ బి.జి. సుబ్బరామి రెడ్డి, శ్రీకాళహస్తి రేటు ప్రేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కె. వత్సలయ్య గారలు మాట్లాడారు.

అదేరోజున, సుబ్బారాయుడు కండ్రిగ, చుక్కల నిడిగల్లు, వేణుగోపాలపురం పాఠశాల భవనములకు జిల్లాపరిషత్ ఛైర్మను శ్రీ వి. రామస్వామి రెడ్డి, కలెక్టరు శ్రీ బి.వి. రామరావు గార్లు ప్రారంభోత్సవము జేశారు. ఈ భవనములకు ఒక్కొక్కదానికి రూ 8000/- సమితి ఖర్చు చేసింది. లక్షరూపాయల ఖర్చుతో నిర్మింప బడుచున్న 13 పాఠశాల భవనములలో 7 పూర్తిచేయబడినవి. మిగిలిన ఆరు భవనముల పని చురుకుగా జరుగుచున్నదని, బ్లాకు అధికారి శ్రీ బి. లక్ష్మణ రెడ్డి గారు తెలియ జేశారు.

షెడ్యూలు కులాలు, జాతులవారు యిండ్లవసతికి బంజరు భూములకు దరఖాస్తులు జిల్లాకలెక్టరు గారికి అందజేశారు.

చిత్తూరు జిల్లాలోని తొట్టంబేడు సమితిలో చేరిన, దవనెవారి కండ్రిగ, బైరాజు కండ్రిగ గ్రామ హరిజనులకు 42 జతల దుక్కిటెద్దులను జిల్లా కలెక్టరు శ్రీ బి వి. రామారావుగారు పంపిణి జేశారు. ఈ సందర్భమున మాట్లాడుచు కలెక్టరుగారు హరిజనులు యీ దుక్కి ఎద్దులతో వ్యవసాయము స్వంతముగా జేసికొని, ఆర్థికముగా దుర్బల వర్గాలు బాగుపడవలెనన్న ప్రభుత్వ ఉద్దేశమును

సఫలము చేయవలసిందిగా కోరారు. అంతేగాని, వీటిని విక్రయించి మార్పుచేసి దుర్వినియోగము చేయకూడదని అధ్యక్షత వహించిన జిల్లాపరిషత్ ఛైర్మను శ్రీ వి రామస్వామిరెడ్డిగారు యీ సందర్భమున హరిజనులను కోరారు సమితి అధ్యక్షులు శ్రీ డి. బత్తిరెడ్డిగారు యీ సమితిలో దుక్కి ఎద్దులను రాయలసీమ అభివృద్ధి పథకం క్రింద 52 జతల దుక్కి ఎద్దులు ఈ గ్రామ హరిజనులకు మంజూరు చేసిరనియు, ప్రస్తుతము 42 జతలు పంచితిమనియు, మిగిలిన 10 జతలు త్వరలో పంచగలమనియు చెప్పిరి.

బ్రాహ్మణ చెర్వు అగ్ని బాధితులకు వస్త్రముల పంపిణీ

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర సమితిలోని బ్రాహ్మణ చెర్వులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదములో నిరాశ్రయులైన 250 మంది కుటుంబీకులకు ప॥ గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీ యస్. ఆర్. గోవిందరాజన్ ఐ ఎ.ఎస్ గారిచే విరాళ మివ్వబడిన 250 చీరెలు సమితి ఆఫీసులో అధ్యక్షులు శ్రీ మంతెన భావ రాజుగారిచే బహూకరింపబడినవి. స్థానిక మిల్లు యజమానులు ఉదార స్వభావులైన శ్రీ కలిదిండి బంగారురాజు సోదరులచే విరాళముగా ఇవ్వబడిన 150 ధోవతులు కండువాలు మరియు పెనుమంట్ర వాస్తవ్యులైన శ్రీదాట్ల లక్ష్మీపతి రజుగారి కుమారులు సర్వశ్రీ దాట్ల సూర్యనారాయణ రాజు దాట్ల త్రిమూర్తి రాజు, దాట్ల సత్యనారాయణ రాజుగార్లచే విరాళ మివ్వబడిన 100 ధోవతులు, కండువాలు కూడ ఇదేసమయములో సదరు కుటుంబీకులకు సమితి అధ్యక్షులచే బహూకరింపబడినవి.


ఈ ఉత్సవములో స్థానిక సర్పంచ్ శ్రీ దాట్ల నీలాద్రిరాజు, బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసర్ శ్రీ పి. నరశింహరావు, తణుకు తహశీల్‌దార్ మున్నగువారు పాల్గొన్నారు.

నెల్లిమర్ల పంచాయతీ సమితి సమావేశం

ఆగస్టు 14వ తేదీ రాత్రి సమితి సమాచార కేంద్రంలో సమితి సభ్యులు, సిబ్బంది స్వాతంత్ర్య సమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమితి ఆఫీసు భవనం, జూనియర్ కళాశాల, జాతీయ పతాకం రంగు రంగుల విద్యుద్దీపములతో శోభాయమానంగా అలంకరింపబడ్డాయి. సమితి అధ్యక్షులు, డి. యస్. వి. వి. రామరాజుగారు మొదట జాతీయ పతాకమును ఆవిష్కరించారు. సమితి అధ్యక్షులు



నెల్లూరు జిల్లా కలెక్టరు ఆగస్టు 15 న నెల్లూరులో డా॥ బెజవాడ గోపాల రెడ్డిగారిని స్వాతంత్ర్య యోధునిగా సన్మానించారు.



పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ జలగం వెంగళరావు ఆగస్టు 23 న నెల్లూరులో జరిగిన బహిరంగ సభలో ప్రకాశంగారి చిత్ర పటాన్ని ఆవిష్కరించినప్పటి చిత్రం.



కేంద్ర విద్యుచ్ఛక్తి, నీటిపారుదల శాఖమంత్రి డా. కె.ఎల్. రావు ఇటీవల న్యూఢిల్లీలోని తిరుమల తిరుపతి దేవస్థానం వారి సమాచార కేంద్రాన్ని సందర్శించినప్పటి దృశ్యం


బి. డి. ఒ. శ్రీ కె. నరసింహారావు, బ్లాక్ అసిస్టెంటు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు, శ్రీ దారా బాబురావు గార్లు భారత స్వాతంత్ర్య సముపార్జనకై త్యాగాలు చేసిన వీరుల గురించి, 1857 సం॥ నుండి 1947 సం॥ వరకు స్వాతంత్ర్యము గురించి సిపాయి కలహము, మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్, పట్టాభి, ప్రకాశం, సుభాష్ చంద్రబోస్ మొ॥లగు నాయకులు నిర్వహించిన ముఖ్యమైన ఘట్టములగురించి వివరించారు. రాజ్యాంగంలో నిర్దేశించబడిన ప్రాథమిక సూత్రాలను ప్రభుత్వం పాటించాలని కోరారు. నిరుద్యోగం దారిద్ర్య నిర్మూలనకు దేశవ్యాప్తంగా కుటీర పరిశ్రమలు, లఘు పరిశ్రమలను నెలకొల్పాలన్నారు సమాజంలో బలహీన వర్గాలు, హరిజన గిరిజనుల సంక్షేమ సాధనకు ప్రభుత్వము, నాయకులు పునరంకితం కావాలని, నేటివరకు వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని వివరించారు. హరిజన కాలనీల వద్ద శ్రమదానంతో రోడ్డువేశారు.

కీసరాజ పల్లిలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

నల్గొండ జిల్లా కలక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య, ఆగస్టు 16వ తేదీన నల్గొండ తాలూకా కీసరాజపల్లి గ్రామంలో 29 యిండ్ల హరిజన కాలనీకి ప్రారంభోత్సవం జరిపినారు ఈ కాలనీ నిర్మాణానికి రూ. 60,000 ఖర్చు అయింది- కాలనీకి డాక్టరు అంబేద్కర్ పేరు పెట్టారు. ఈ సందర్భంలో జరిగిన బహిరంగ సభలో కలెక్టరు ప్రసంగిస్తూ హరిజనులు తదితర బలహీన వర్గాల శ్రేయస్సుకై ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ పథకాలను వివరించి చెప్పారు. హరిజనులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపి వారికి విద్యాబుద్ధులు గరపాలని ఉద్బోధించారు. విద్యావంతులు కావిదే ప్రభుత్వం ఎంత సహాయం చేసినా అది అంత ప్రయోజనకారిగా ఉండదని అన్నారు. 3,000 యిండ్లతో 75 హరిజన కాలనీల నిర్మాణం జరుగుతున్నదని ఆయన తెలిపారు. జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. రంగారెడ్డి కూడా ప్రసంగించారు.

నల్లగొండలో ప్రకాశం శతజయంతి సంఘ సమావేశం


నల్గొండలో జిల్లా కలక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య అధ్యక్షతన శ్రీ ప్రకాశం శత జయంతి ఉత్సవాల సంఘం ఆగస్టు 17 న జిల్లా పరిషత్తు ఆవరణలో సమావేశమయింది. ప్రకాశం పేరుతో టౌను హాలులో ఒక కొత్త విభాగాన్ని నిర్మించడానికి రూ. 75,000 విరాళాల రూపంలో సేకరించాలని యీ సంఘం నిర్ణయించింది. జిల్లాలో ఉత్తమ ఉన్నత పాఠశాలగా ఎంపిక అయిన దానికి రోలింగ్ షీల్డును బహూకరించాలని కూడా నిర్ణయం జరిగింది. ఈ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆగస్టు 23 న బహిరంగ సభలు, కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కూడా యీ సంఘం నిర్ణయించింది. ఈ సమావేశంలో డి. ఆర్. ఒ. శ్రీ పి.పి. విలియమ్స్, సిటీ మునిసిపల్ అధ్యక్షులు శ్రీ రాజరత్నం, మాజీ ఎం. ఎల్. సి శ్రీ శంకరరావు, శ్రీ పి. రంగారావు, శ్రీ జి. వి. హెచ్. శర్మ, శ్రీ సి. గోపాలరెడ్డి, శ్రీ మల్లారెడ్డి మున్నగు అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.



నెల్లూరులోని సహకార, పౌరసంబంధ, యాత్రి శాఖ, రవాణాశాఖలు సంయుక్తంగా విద్యార్థుల, కార్మికుల, అభ్యుదయ కర్షకుల పరిశీలనాయాత్ర ఒకదానిని ఆగస్టు 8 నుంచి 12వ తేదీవరకు ఏర్పాటుచేశారు.



నెల్లూరులో ఆగస్టు 15 న స్వాతంత్ర్యదినోత్సవ కార్యక్రమం.



గిరిజన సంక్షేమ శాఖమంత్రి శ్రీ భీమ్‌రావ్ ఆగస్టు 8వ తేదీ కడపజిల్లాలోని తూముకుంటలో హరిజనుల నిమిత్తం కాలనైజేషన్ స్కీముకు ప్రారంభోత్సవం చేశారు.

చిత్తూరు జిల్లాలో కరువు నివారణ కార్యక్రమం

చిత్తూరు జిల్లా కలెక్టరు శ్రీ పళనియప్పన్ ఇటీవల పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ కరువు నివారణ పథకం క్రింద చిత్తూరు జిల్లాకు రు. 13 లక్షలు మంజూరుచేశారని అన్నారు. జిల్లాలోని కరువు తీవ్రతనుగూర్చి ప్రభుత్వానికి అప్పుడే తెల్పడం జరిగిందని కూడ ఆయన తెలియజేశారు.

జిల్లాలో బావులను లోతుచేసే 6 యంత్రాలు పనిచేస్తున్నాయి. రు. 16 లక్షల ఖర్చుతో చిన్నతరహా నీటి పారుదల పనులను చేపట్టారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడానికి మరికొన్ని ప్రాంతాలలో అదనంగా మరో రు.10 లక్షల ఖర్చుతో పనులను చేపట్టుతున్నారని కలెక్టరు అన్నారు.

ఆపత్కాల తక్కావి ఋణాల పంపిణీ నిమిత్తం ప్రభుత్వం యీ జిల్లాకు రు. 5 లక్షలు మంజూరు చేసింది. ఈ కార్యక్రమం క్రింద గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన వ్యక్తులకు ఋణాలు మంజూరు చేయడానికి సిబ్బందిని ఆయత్తంచేశారు. జిల్లాలో కరువు పరిస్థితులను నివారించడానికి ప్రభుత్వంనుంచి మరింత సహాయం అందుతుందనే ఆశాభావాన్ని జిల్లా కలెక్టరు వ్యక్తంచేశారు.



వరంగల్లు జిల్లా కలెక్టరు శ్రీ కె. మాధవరావు ఆగస్టు 15న వరంగల్లు పోలీసు పెరేడు మైదానంలో సెన్సస్ బహుమతులను పంచిపెట్టారు.



ఆగస్టు 15న వరంగల్లు జిల్లా పరిషత్ ఛైర్మెన్ శ్రీ బి. జనార్దన్ రెడ్డి సాంస్కృతిక కార్యక్రమంలో ప్రసంగించారు.

పశ్చిమ గోదావరిజిల్లాలో అగ్నిబాధితులకు సహాయం

పశ్చిమగోదావరి జిల్లాలో యిటీవల జరిగిన ఘోరమైన అగ్నిప్రమాదాలలో యిళ్లు నష్టపడిన సుమారు వెయ్యిమంది కుటుంబాలకు ఒక్కొక్కదానికి రూ. 100ల సహాయంక్రిందను రూ. 200 మేరకు ఋణముల క్రిందను మంజూరుచేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు శ్రీ ఎన్.ఆర్.గోవిందరాజన్ తెల్పారు. అగ్నిప్రమాదానికి గురికానటువంటి పక్కా యిళ్లు నిర్మించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయం చేస్తున్నదని ఆయన అన్నారు. అగ్నిప్రమాదాలలో నష్టపడిన కుటుంబాలకు ఒక్కొక్కదానికి ఒక చీరను పంపిణీచేస్తున్న సందర్భంలో కలక్టరు ఈ విషయాన్ని వెల్లడించారు. బాధితుల పునరావాసానికి శాయశక్తులా సహాయం చేయడం జరుగుతుందని ఆయన హామీ యిచ్చారు.

ఆర్.డి.ఓ శ్రీ సి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సత్యనారాయణ పురంలో 78 ఇండ్లు, ఏనువాదపురంలో 69 ఇండ్లు, ఏలూరు పట్టణంలో జనసమర్దం ఎక్కువగావున్న మురికిపేటలు అగ్నికి ఆహుతి అయిన ఫలితంగా ఈ ప్రాంతాలలో మొత్తం 259 కుటుంబాలవారు నిరాశ్రయులైనారని చెప్పారు.

నెల్లూరు జిల్లాలో అనావృష్టి పరిస్థితులు: అధికారులతో మునిసిపల్ మంత్రి చర్చలు

రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి శ్రీ మాణిక్‌రావు ఆగస్టు 25 వ తేదీన నెల్లూరులో జిల్లా అధికారులు అనధికారుల సమావేశంలో అనావృష్టి పరిస్థితులను గురించి చర్చలు జరుపుతూ ప్రభుత్వం అనావృష్టి పరిస్థితులు గమనించి, తగిన సహాయక చర్యలు తీసుకోవడానికి కృతనిశ్చయంతో వుందని చెప్పారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. మంచినీటి సరఫరా పథకాలను అమలు జరపడానికి ప్రభుత్వం ఎంతైనా ఖర్చుపెట్టడానికి సిద్ధంగా వుంది. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మంచినీటి సౌకర్యాలు కల్పించేందుకు రూ. 15 కోట్లు మంజూరు చేయవల సిందని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. కేంద్రం రూ 5 కోట్లు మంజూరుచేసింది ఈ మొత్తంలో సగం డబ్బు మంచినీటి పథకాల కొరకై ఖర్చుపెట్టబడుతుంది. మిగిలి పోయిన పనులను పూర్తిచేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది. జిల్లాలో అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాకు తగినవాటా లభిస్తుందని, మంత్రి సభ్యులకు హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. పార్థసారథి ప్రసంగిస్తూ అనావృష్టి ని ఎదుర్కొనడానికి రూ. 173 లక్షలు ఖర్చుకాగల మాస్టరు ప్లాను తయారుచేసి దాని ఆమోదం కొరకు ప్రభుత్వానికి పంప బడిందని చెప్పారు.


పశుగ్రాసం ఈ జిల్లానుంచి ఇతరచోట్లకు రవాణా కాకుండా తగినచర్యలు తీసుకోబడతాయని కలెక్టరు చెప్పారు. జిల్లాలో ప్రతి రెండు పంచాయతీలకు ఒకటి చొప్పున చౌకధర దుకాణం తెరువబడుతుందని సర్పంచ్, గ్రామాధికారి, వి. యల్. డబ్ల్యు. లతో కూడిన సంఘాలు ఈ దుకాణాలను నిర్వహిస్తాయనీ కూడా ఆయన వెల్లడి చేశారు.

ఈ సమావేశంలో జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. గోపాల కృష్ణారెడ్డి, సమితుల అధ్యక్షులు కూడా పాల్గొన్నారు.


శ్రీ మాణిక్‌రావు నెల్లూరు తాలూకాలో గ్రామస్థులకు 548 బంజరు పట్టాలు, 183 నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. వందమంది రైతులకు తల 1కి రూ. 50 ల చొప్పున రూ. 5000 వరకు ఆయన పశుగ్రాస రుణాలు కూడా పంచిపెట్టారు.

పెదకొండూరులో పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

నల్గొండ జిల్లా రామన్నపేట పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ జి. అనంతరెడ్డి, పెదకొండూరు గ్రామంలో రూ. 7,700 ల ఖర్చుతో యిటీవల నిర్మించబడిన ఒకే గది పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని ఉద్బోధించారు. పాఠశాలకు అవసరమైన పరికరాలను సరఫరా చేస్తామని ఆయన హామీ యిచ్చారు.



విశాఖపట్నం హిందూస్థాన్ షిప్‌యార్డులో ఆగస్టు 23 వ తేదీన 'విశ్వమమత' నౌకకు జల ప్రవేశ మహోత్సవం జరిగింది.



జల ప్రవేశ మహోత్సవానికి ముందు కమాండర్ ఛీఫ్ ఇంజనీర్ శ్రీ ఆర్. టి. అంజిర్‌బాగ్ నౌకకు పుష్పమాల అలంకరిస్తున్న దృశ్యం.

నల్లగొండలో ఖరీఫ్ ప్రణాళిక

నల్లగొండజిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య, యిటీవల పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ఈ ఖరీఫ్ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలను వేసి ఆహారోత్పత్తిని అధికం చేయడానికి వ్యవసాయ శాఖవారు వివరంగా ఒక ప్రణాళికను సిద్ధం చేశారని తెల్పారు. 50 వేల ఎకరాలలో జయ, విజయ హంస, రత్న మున్నగు మేలురకం వంగడాలను సాగు చేయబడుతాయి. 20 వేల ఎకరాలలో స్వర్ణ జొన్న, సంకర జొన్న, సంకర సజ్జ మున్నగు రకాల కాయధాన్యాలు పండించ బడుతాయి. విత్తనములు, క్రిమిహారక మందులు రసాయనిక ఎరువులు కొనడానికి ఖరీఫ్ కాలంలో రైతులకు రూ. 38 లక్షల మేరకు స్వల్పకాలిక ఋణాలు మంజూరు చేయడానికి సంకల్పించ బడినదని కలెక్టరు తెల్పారు. అంతేకాకుండా 4 లక్షల ఎకరాలలో మొక్కల రక్షణ కార్యక్రమం గూడా చేపట్టబడుతుందని ఆయన చెప్పారు.

కడప జిల్లాలో కరువు సహాయక కార్యక్రమాలు

కడపజిల్లా పరిషత్తు సర్వసభ్యసమావేశం జూన్ 10న జిలాపరిషత్తు అధ్యక్షులు శ్రీ సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. శాసనమండలి సభ్యులు శ్రీ భుజంగరావు కడపలో వర్తమాన విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేటు కోర్సులను ఆరంభించడానికి ప్రభుత్వాన్ని అభ్యర్థించేందుకు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఈ సర్వసభ్యసమావేశం ఆమోదించింది. పాతకోర్టుభవనంలో మహిళాల డిగ్రీకాలేజిని ఆరంభించడానికి కూడా ఒక తీర్మానం ఆమోదించబడింది. 1970-71, 71-72, సంవత్సరాలలో తెరువబడిన అన్ని ఉన్నతపాఠశాలలకు గ్రాంటు విడుదల చేయడానికి కూడా తీర్మానం ఆమోదించబడింది.

జిలాలో అనావృష్టిపరిస్థితులను గురించి శాసనసభ్యులు శాసనమండలి సభ్యులకు వివరంగా తెలియజేసే ఉద్దేశంతో శాసన సభా సమావేశం జరగడానికి ముందుగానే ఈ సర్వసభ్యసమావేశం ఏర్పాటుచేయబడినది. ఈ సర్వసభ్యసమావేశంలో అనావృష్టిపరిస్థితులు. సహాయక కార్యక్రమాలను గురించి వివరంగా చర్చించడం జరిగింది.

జిల్లా కలెక్టరు శ్రీ వి. చంద్రమౌళి సహాయక కార్యక్రమాల వివరాలను గురించి చెప్తూ జిల్లాకు కేటాయించిన రూ.85 లక్షలకుగాను ఇంతవరకు రూ 55 లక్షలు మేరకు ఖర్చుపెట్టడం జరిగిందని మిగిలిన 30 లక్షల రూపాయలకు సంబంధించిన పనులు పూర్తి అయినాయని చెప్పారు. ఇంకా అదనంగా నిధులు అవసరమని ప్రభుత్వానికి తెల్పడం జరిగింది. 1972 జూన్ తరువాత గూడా సహాయక కార్యక్రమాలు కొనసాగించవలసిన అవసరం చాలా వున్నదని ప్రభుత్వానికి తెల్పడం జరిగింది. జిల్లాలో 3వేల గ్రామాలకు గ్రామాలలో ఏదోఒకవిధంగా త్రాగునీటి సమస్యవుంది. గత సంవత్సరంలో కొత్తగా 240 బావులను లోతుగా తవ్వించడం 280 బోరింగు బావులను తవ్వించడం జరిగింది. ఇంతేకాకుండా 1,414 పాతబావులను లోతుగా తవ్వించే కార్యక్రమం పూర్తి అయింది. బావులను లోతుగా తవ్వించే కార్యక్రమంకొరకు సమితులకు రూ. 8 లక్షలు కేటాయించబడినాయని కలెక్టరు తెల్పారు


సహాయక కార్యక్రమాలకొరకు మంజూరుచేయబడిన నిధులు మొత్తం జూన్ నెల ముగిసేలోగా పూర్తి చేయడం చాలా అవసరమని కలెక్టరు సభ్యులకు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 4 రిగ్గులు పని చేస్తున్నాయి. వాటిని ఇతర జిల్లాలకు తరలించే ముందు కడప జిల్లాలో ఈ రిగ్గులద్వారా కనీసం వెయ్యి బావులైనా త్రవ్వించడం జరుగుతుందని కలక్టరు హామీయిచ్చారు.

1972 అక్టోబరు వరకు కడప జిల్లాలో కరువు సహాయక కార్యక్రమాలు కొనసాగించేందుకు అదనపు నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఈ సర్వసభ్యసమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది.



నెల్లూరు జిల్లా కోవూరు పంచాయతి సమితికి చెందిన గువ్వగుంట హరిజనవాడలో పాఠశాల భవనానికి శ్రీ వై. పట్టాభిరామిరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

మేము పొగాకు పండించే రైతులము కాకపోయినా, సరిఅయిన ఉత్పత్తి



మేము పొగాకు పండించం. కాని, ఆధునిక పద్ధతులలో పొగాకు పంటను నిర్వహించుటకు కావలసినదంతా చేస్తాం. ఎందుకు?

పొగాకు ప్రాముఖ్యమైన వాణిజ్య పంట. రైతులు దీనిని శాస్త్రీయంగా ఎట్లు నిర్వహించాలని తెలుసుకోగోర్తారు. వారికి తెలియజేయటం, తెలిసినవారి ప్రథమ కర్తవ్యం. మేము అదే చేస్తున్నాం. మేము పంట తీరును బట్టి, నేలను బట్టి, వర్షపాతమును బట్టి, వివిధ ప్రాంతములకు అనుగుణంగా, పొగాకు పంట ఉత్పత్తి చేసే సరియైన పద్ధతులను రూపొందించాం. ఫలితం? రైతుకు రసాయనిక ఎరువు భూమికి ఏ విధంగా వేయాలో, ఆరోగ్యకరమైన నారును ఎట్లు పొందాలో తెలుసు.

సరియైన నారు మళ్ళను పెంచటం, సరిగా మొక్క నాటటం, కలుపు తీయటం, తల కొట్టటం, ఆకు తెంపటం, సరియైన పద్ధతులలో మందు వేయటం వలన కలిగే లాభములు ఏమిటో, రైతు అవగాహన చేసుకోగలుగుతున్నాడు. ఎన్ని ఎకరాల పంటకు, బారనుల కోసం, ఎంత స్థలము కావాలో, ఏ విధంగా పంట మార్పిడి చేయాలో, అతనికి తెలుసు.

ఇటువంటి తర్ఫీదు, దృక్పథమే, ఇతనిని దేశములో ప్రముఖ ప్రగతిశీలుడైన రైతులలో ఒకనిగా చేస్తోంది. అతనికి సలహా కావలసినప్పుడు, ఇవ్వటానికి, తెలిసినవారెవరైనా అవసరం.

పద్ధతులను ఎందుకు అభివృద్ధి చేస్తున్నాం?

ఐ ఎల్ టి డి

ఇండియన్
లీఫ్ టొబాకో
డెవలప్‌మెంట్
కంపెనీ లిమిటెడ్

ఐ ఎల్ టి డి— పొగాకు శాస్త్రీయ వ్యవసాయిక పద్ధతులకు మూలాధారము.

U-IL-C-7 TL

Generating power is not enough.


The electrical power generated has to be properly controlled. Power plants and equipment have to be protected from electrical hazards. BHEL Circuit Breakers do both. They act as connecting devices which allow or stop power flow. And, when "faults" threaten to damage costly power installations, they protect the plant by breaking the excessive fault currents.

BHEL, Hyderabad, has put on the market a wide range of Minimum Oil Circuit Breakers (33 KV to 132 KV) of very reliable and economic designs.

After successfully executing an order from **Malawi**, the Hyderabad Plant recently won a prize order from **Kenya** for five Minimum Oil Circuit Breakers. Of course, within India, in almost all the States, Minimum Oil Circuit Breakers from BHEL, Hyderabad, continue to give faultless service.

SPECIAL FEATURES:


- **Light in weight and bulk, requiring light support structures and foundations**
- **Balanced dynamic forces, resulting in economic structures**
- **Designed to withstand earthquake shock corresponding to 0.5g. horizontal acceleration**
- **Very low oil content: Minimum FIRE HAZARD, low oil cost (investment) and purification charges**
- **Self-acting contraction chamber requiring no external arc-quenching medium**
- **Rapid and smooth extinction of arc**




BHARAT HEAVY ELECTRICALS LTD.
(A Government of India Undertaking)
Ramachandrapuram,
Hyderabad-32
Regd Office
5, Parliament St, New Delhi-1

FDS BHEL.1782D

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM. ANDHRA PRADESH HYDERABAD
PRINTED BY THE DIRECTOR OF PRINTING. GOVT OF ANDHRA PRADESH. AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD


అయితే!
బంగారాలు వెళతాం అక్కడ గంగన్న చదువుందట. అక్కడే సంసారం పెడతాం
సుబ్బమ్మ అభిమానవతి. ఎవ్వరి మీద ఆధారపడటం ఆమెకు ఇష్టంలేదు. పెళ్ళి అయ్యాక బంగారాలు తరలింది అక్కడ ఆ తల్లి ఒక మంచి పూరిల్లు పెట్టుకుని బిడ్డలను పెంచుకుంటూ, చదువు చెప్పించుకుంటూ సంసారం గుట్టుగా నడుపుకుంటుంది
అమ్మా! అందరూ ఆక్షేపిస్తున్నారమ్మా! ఆ అమ్మ వంటలు చేస్తోందని!
అందుకు సిగ్గుపడవలసినది ఏమీ లేదురా! మనం ఒకరి మీద పడి తినటంలేదు. మన బ్రతుకు మనం బ్రతుకుతున్నాం!
కొన్నాళ్ళు గడిచాయి. ప్రకాశం ఫస్ట్‌ఫారం మొదటి తరగతిలో ప్యాస్ అయ్యాడు. అప్పుడు స్కూలు హెడ్‌మాస్టర్ సుందరశివయ్య గారు బాగా చదివే పిల్లల్ని ఇంటికి తీసుకెళ్ళి అక్కడ ప్రత్యేకంగా చదువు చెప్పేవారు. వాళ్ళల్లో ప్రకాశం ఒకడు.
ఏమిరా! ప్రకాశం! చదువు బాగానే చదువుతున్నావు. గానీ అల్లరి బుద్ధులు పోలేదురా నీకు.
దేనికదే మాస్టారూ!
ఆ రోజుల్లోనే ప్రకాశమూ అద్దేపల్లి అప్పడు అనే వాడూ కలసి ఒక ముఠా లేవదీశారు. ఆ ముఠా పేరు 'టౌన్ కంపెనీ' అని. దానిలో మున్సిఫ్, నాళ్లేలూరి రామజోగయ్య అనే రౌడీలు కూడా ఉండేవారు
వినండి! మనం క్రికెట్ ఆటలలో పైకి రావాలి - గదా? అలా రావటానికి అవి కొనుక్కోవాలి. అందుకు డబ్బు కావాలి. అది మన దగ్గర లేదు.
అందుకు మన అప్పడు ఒక మంచి పథకం వేశాడు. చెప్తాడు వినండి.
మన ఊరి చెరువు కింద పొలం కోతకు సిద్ధంగా ఉంది. ఈ రాత్రి మనం వెళ్ళి ఆ పంట కోసేసి అమ్మేద్దాం!
Bujjai


RADHANAND & Co
HARDWARE MERCHANT
SOUND
Hercules
SRI KRISHNA CYCLE Co
R.P RUSTOMFRAM
INFORMATION